ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలు

అడ్డుకున్న దేవాదాయ అధికారులు

ఈనాడు, హైదరాబాద్: హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా బహదూర్‌పురాలోని దేవీబాగ్ ఆలయ భూముల్లో చేపట్టిన నిర్మాణ పనులను దేవాదాయశాఖ అధికారులు అడ్డుకున్నారు. అవి దేవాదాయశాఖ భూములంటూ బోర్డు పాతడంతోపాటు ప్రహరీని ఆనుకొని గేటు నిర్మాణం చేపట్టి తాళం వేశారు.

మూడెకరాల్లో అక్రమ నిర్మాణాలు.. దేవీబాగ్ దేవాలయానికి రూ.50కోట్ల విలువైన ఆరు ఎకరాల భూములున్నాయి. నిజాంకాలం నాటి ముంతకబ్ రికార్డుల్లో 3, రెవెన్యూ రికార్డుల్లో 3 ఎకరాలున్నాయి. రెవెన్యూ మూడెకరాలకు సంబంధించి కొన్నేళ్లుగా వివాదాలు నడుస్తున్నాయి. ఫౌండర్ ట్రస్టీలు నకిలీ ధ్రువపత్రాలతో ఆ భూములను ప్లాట్లుగా విభజించి విక్రయించారన్నది దేవాదాయశాఖ ఆరోపణ. అవి తమవే అని ట్రస్టీలు చెప్పడంతో వివాదం చెలరేగింది. హైదరాబాద్ కలెక్టర్ విచారించి దేవాదాయశాఖవేనని ధ్రువీకరించారు. ట్రస్టీలు హైకోర్టులో సవాల్‌చేశారు. నాలుగేళ్లుగా వివాదం నడుస్తుండగా, న్యాయస్థానం 'స్టేటస్ కో' ఆర్డర్ జారీచేసింది. ఎన్నికల హడావుడిలో ఆ భూముల్లో నిర్మాణాలు చేపట్టారన్న తెలుసుకున్న అధికారులు పనులు ఆపేశారు. స్టేటస్‌కోకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంపైన కేసు నమోదుచేస్తామని, కూల్చివేతకు ఆదేశాలివ్వాలంటూ కోర్టును ఆశ్రయిస్తామని అధికారులు తెలిపారు.


అక్రమ నిర్మాణాలను నిలిపివేసిన దేవాదాయశాఖ అధికారులు



పరిసరాల పరిశుభ్రత.. మనందరి బాధ్యత

శంషాబాద్ మండల పరిధి అమ్మపల్లి గ్రామంలో బుధవారం అధికారులు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పాలనాధికారి శశాంక సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారిలా.

బీట్ ఏదైనా.. సినిమా పాటలే ఇష్టం!

- విద్యార్థుల సంగీత, సాహిత్య అభిరుచులిలా
- హెచ్‌సీయూలోని విభాగం అధ్యయనం


ఈనాడు, హైదరాబాద్


తెలుగు పాటలు.. పద్యాలు.. జానపదాలు.. పాశ్చాత్య సంగీత హోరు.. వీటిన్నింటిలో ఏది ఇష్టమంటే.. శైలి ఏదైనా సినిమా పాటలంటే ఇష్టమని యువతీయువకులు అంటున్నారు. 18ఏళ్ల నుంచి 25 ఏళ్లవరకు, 25ఏళ్లు ఆపై వయసున్న యువతీయువకుల ఇష్టాలపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని సంగీత విభాగం గతేడాది అధ్యయనం చేసింది. వర్సిటీలోని పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు, పరిశోధకుల్లో 350 మందిని ఎంపికచేసి వారితో మాట్లాడారు. 350 మందిలో 168 మంది సినిమా సంగీతాన్ని ఇష్టపడుతున్నామని తెలిపారు.

వేగం.. శ్రావ్యం.. సమ ప్రాధాన్యం

సినిమా పాటల్లో వేగంగా పూర్తయ్యే వాటితో పాటు శ్రావ్యమైన పాటలకు విద్యార్థులు ప్రాధాన్యమిస్తున్నారు. చాలామంది సినిమా పాటల్లో సాహిత్యాన్ని పట్టించుకోవడం లేదు. తాము కూడా పాడేలా ఉండే రాగాన్ని ఇష్టపడుతున్నారు. పదాలు, మాటలు అర్థమైనా.. కాకపోయినా గాయనీ, గాయకుల ఆలాపన, సంగీత కళాకారుల వాయిద్యాల సమ్మిళితాన్ని గమనిస్తున్నారు. తొంభైశాతం మంది మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని సినిమా పాటలు వింటున్నారు. యాభైశాతం మంది విద్యార్థులు గంటకుపైగా సంగీతాన్ని వింటూ సేదతీరుతున్నారు.







- సంగీత విభాగం సహ ఆచార్యులు ప్రగ్యా ప్యాసీ, పరిశోధక విద్యార్థి మోహిత్ మెహతాలు చేసిన ఈ అధ్యయనాన్ని నాద్-నర్తన్ జర్నల్ ఇటీవల ప్రచురించింది

డిజిటల్‌కు పెరుగుతున్న ఆదరణ

-డా.ప్రగ్యా ప్యాసీ, సహాయ ఆచార్యులు



హెచ్‌సీయూ విద్యార్థులే కాదు.. డిగ్రీ కళాశాలలు, ఇతర వర్సిటీల్లోని విద్యార్థులు థియేటర్లకు వెళ్లి సినిమాలు చూడకపోయినా డిజిటల్ సంగీతాన్ని ఇష్టపడుతున్నారని మా అధ్యయనంలో తేలింది. చరవాణుల్లో వార్తావిశేషాల ద్వారా వీరు సినిమాల గురించి తెలుసుకుని పాటలు వింటున్నారు. సంగీతాన్ని ఆస్వాదిస్తున్నారంటే మానసికంగా ఉల్లాసంగా ఉంటున్నారని అర్థం. దీంతోనే విద్యార్థులు వారి లక్ష్యాలను సులువుగా చేరుకుంటున్నారు.

నగరంలోనూ నేర పాఠాలు

- చోరీలు, మోసాల్లో తర్ఫీదు
- రాష్ట్ర, అంతర్రాష్ట్ర ముఠాల నయా ఎత్తులు

ఈనాడు, హైదరాబాద్: దొంగతనాలు, మోసాల్లో ఆరితేరిన ముఠాలు ఆనవాళ్లు బయటకు తెలియకుండా నయా మార్గం ఎంచుకుంటున్నాయి. మైనర్లు, యువతను ముందుంచి నేరాలు చేయిస్తున్నాయి. ద్విచక్ర వాహనం కొట్టేయటం నుంచి.. నకిలీ అధికారుల రూపంలో బురిడీ కొట్టించటం దాకా నేర్పిస్తున్నాయి. వారిని ఆయా బృందాలకు నాయకులుగా నియమిస్తున్నాయి. ఎక్కువ సంపాదించిన వారికి రెండు మూడు రెట్లు జీతం అదనంగా ఇస్తున్నాయి.



ఉదాహరణలివిగో..

పాతబస్తీ నేరస్తుడు.. వందకు పైగా కేసుల్లో జైలుకెళ్లొచ్చాడు. సొమ్ము కొట్టేసేందుకు కొత్త మార్గం ఎంచుకున్నాడు. చిల్లరగా తిరిగే యువకులకు బిర్యానీ, బైక్‌లపై తిరిగేందుకు పెట్రోల్ ఖర్చులు ఇస్తూ సెల్‌ఫోన్ల చోరీ నేర్పించాడు. రాత్రిళ్లు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వారు చోరీ చేసిన ఫోన్లను దళారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు.

- ఇటీవల బహదూర్‌పురలో ఆటోలో ప్రయాణిస్తున్న బాలుడు తన పక్కనే కూర్చున్న వృద్ధుడి జేబులోని నగదు కొట్టేశాడు. చాదర్‌ఘాట్ వద్ద మరో యువకుడు ఓ వ్యక్తి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయాడు. సీసీ ఫుటేజీ ద్వారా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమీషన్ వస్తుందనే ఆశతో నేరాలకు పాల్పడ్డామని.. తాముండే ప్రాంతానికి చెందిన కొందరు చోరీలపై శిక్షణ ఇచ్చారంటూ సమాధానమిచ్చారు.

శిక్షణ ఇలా..

నగర శివార్లకు చెందిన దొంగలు బైకుల తాళాలు తీసి క్షణాల్లో మాయం చేయగల నేర్పరులు.. తల్లిదండ్రుల పర్యవేక్షణకు, చదువుకు దూరమైన 12-15 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలతో మాట కలుపుతారు. కొద్దిరోజులు నగరమంతా తిప్పుతారు. బైకులపై ఫీట్లు చేయటం అలవాటు చేస్తారు. తాళం వేసిన బైక్‌లను ఎలా చోరీ చేయాలి? ఎలా స్టార్ట్ చేయాలనేదానిపై రాత్రిళ్లు శిక్షణ ఇస్తారు. ఒక్కో వాహనానికి రూ.2-3 వేలు కమీషన్ ఇస్తారు. అంతర్రాష్ట్ర ముఠాల వారు సెల్‌ఫోన్ల చోరీలకు మైనర్లు, మహిళలను పావులుగా మార్చుకుంటున్నాయి. రద్దీ ప్రాంతాల్లో ఫోన్లు దొంగిలించటంపై శిక్షణ ఇస్తున్నారు. పిల్లలు పట్టుబడినపుడు అక్కడున్న మహిళలు అడ్డుకుని, తమతో అనుచితంగా ప్రవర్తించారని గొడవ చేయాలని సూచిస్తున్నారు. ఫోన్ కొట్టేశాక సమీపంలోని ముఠా సభ్యుడికి అందజేసే వరకూ ఎలా నడచుకోవాలో పాఠాలు చెబుతున్నట్టు ఇటీవల పట్టుబడిన ఇద్దరు చిన్నారులు వెల్లడించారు.

ఘాటెక్కుతున్న ఉల్లి

మార్కెట్‌లో పెరుగుదల ఇలా..	
తేదీ	ధర
15	47
16	47
17	48
18	51
19	50
20	50
21	52
22	52
23	52
24	52
25	52



అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే: ఉల్లి ధర రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని హోల్‌సేల్ దుకాణాల్లో ఆగస్టులో కిలో రూ.34 ఉన్న ధర ప్రస్తుతం రూ.52కు చేరింది. బహిరంగ మార్కెట్లో కొనాలంటే కిలోకు రూ.60నుంచి రూ.70 చెల్లించాల్సి వస్తోంది. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, మెదక్, కర్నూలు జిల్లాల నుంచి మలక్‌పేట మార్కెట్‌కు ఉల్లి వస్తుంది. వర్షాలకు కర్ణాటకనుంచి దిగుమతి తగ్గిపోవడంతో మహారాష్ట్రపైనే ఆధారపడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. డిసెంబరు చివరల్లో కొత్త పంటవచ్చేదాకా ఇదే పరిస్థితి ఉంటుందన్నారు. 'ఇతర దేశాలకు ఎగుమతి కారణంగా మహారాష్ట్ర నుంచి మలక్‌పేటకు వచ్చే ఉల్లి తగ్గింది. మన దగ్గర ఇప్పుడిప్పుడే సీజన్ మొదలైంది' అని మార్కెట్ అధికారి దామోదర్ తెలిపారు.

3 చోట్ల వాయు నాణ్యత సంతృప్తికరం



ఈనాడు, హైదరాబాద్: నగరంలోని సనత్‌నగర్, జూపార్కు, హెచ్‌సీయూ వద్ద వాయు నాణ్యత సంతృప్తికరంగా ఉందని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తాజా నివేదికలో స్పష్టం చేసింది. సంవత్సరం ఆరంభంలో ఈ ప్రాంతాల్లో వాయు నాణ్యత తక్కువగా నమోదవ్వగా మూడు నెలల నుంచి స్థిరమైన, సంతృప్తికరమైన ఫలితాలు వెల్లడవుతున్నాయని పేర్కొంది. సాధారణంగా వాయు నాణ్యతా సూచీ 0-50 మధ్య నమోదైతే సంతృప్తికరమని, 51-200 మధ్య నమోదైతే సున్నిత వ్యక్తులతో పాటు ఇతరులకు శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయని వెల్లడించింది. హెచ్‌సీయూ, సనత్‌నగర్, జూపార్కు వద్ద మూడు నెల్లో 50లోపే సూచీ నమోదైందని తెలిపింది. హెచ్‌సీయూ వద్ద జనవరి నుంచి మే వరకు వరుసగా 83, 68, 85, 80, 68గా నమోదైంది. సనత్‌నగర్ వద్ద వరుసగా 130, 76, 72, 72, 59, జూపార్కు వద్ద 109, 120, 128, 124, 93గా నమోదైంది. జీడిమెట్ల, బాలానగర్ ప్రాంతాల్లో వాయునాణ్యత సంతృప్తికరంగా లేదని, 8 నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని నివేదికలో వెల్లడించింది.

3 నెలల్లో నమోదైన వాయునాణ్యతా సూచీ

ప్రాంతం	జూన్	జులై	ఆగస్టు
హెచ్‌సీయూ	36	28	36
సనత్‌నగర్	48	46	47
జూపార్కు	34	23	42

రహదారి తవ్వకుండానే మురుగుకు మోక్షం

ట్రెంచ్‌లెస్ సాంకేతికత అమలుకు కసరత్తు



గ్రేటర్‌లో మురుగు వ్యవస్థ 7000 కి.మీ పైనే

మ్యాన్‌హోళ్లు 3 లక్షలు

ఈనాడు, హైదరాబాద్: అమీర్‌పేట ప్రధాన రహదారి, శ్రీనగర్‌కాలనీ ఆటోస్టాండ్ కూడలి ప్రాంతంలో మురుగు సమస్య నిత్యకృత్యం. ఇక్కడ సీవరేజి ఓవర్ ఫ్లోతో మురుగంతా సెల్లార్లలోకి వెళ్తోంది. ప్లాట్ల యజమానులు బోర్లు పెట్టి బయటకు తోడుకోవాల్సిన దుస్థితి. గతంలోని మెట్రో పనులతో సీవరేజి అలైన్‌మెంట్ దెబ్బతినడమే ఇందుకు కారణం. మురుగు కిందికి పారకుండా ఎగువకు వచ్చేస్తోంది. దీన్ని సరిచేయాలంటే ప్రధాన రహదారి కావడంతో తవ్వడానికి బల్దియా నుంచి అనుమతి రావడం లేదు. దీంతో ట్రెంచ్‌లెస్ సాంకేతికతను వినియోగించి మురుగు వ్యవస్థను సరిచేయాలని జలమండలి నిర్ణయించింది. త్వరలో పనులు చేపట్టనున్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా ఇప్పటికే 200 ప్రాంతాలను గుర్తించారు. ఎయిర్‌టెక్ యంత్రాలతో సరిచేసినా రెండ్రోజులకే పరిస్థితి మొదటికొస్తోంది. అమీర్‌పేట, పంజాగుట్ట నాగార్జున సర్కిల్, నాంపల్లి, ఆసిఫ్‌నగర్, జియాగూడ, బేగంపేటలోని బ్రాహ్మణవాడి ఇలా చాలాచోట్ల మురుగు ఉప్పొంగుతోంది. ఈ సమస్యపైనే జలమండలికి నెలకు 30 వేలవరకు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ట్రెంచ్‌లెస్ టెక్నాలజీతో పనులు చేపట్టనున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా...వాహన రద్దీ ప్రాంతాల్లో రోడ్డు కటింగ్‌తో ఇబ్బందులు వస్తున్నాయి. దీన్ని అధిగమించడానికి ప్రత్యేక డ్రిల్లింగ్ యంత్రాలను ఉపయోగించి ట్రెంచ్‌లెస్ ద్వారా మురుగు పైపులను ఏర్పాటు చేయనున్నారు. ఆప్టికల్ ఫైబర్, ఇతర కేబుళ్లు లేని ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టనున్నారు.


నిమ్స్ - పంజాగుట్ట మార్గంలో ఇదీ తీరు..


మాసబ్‌ట్యాంక్ - బంజారాహిల్స్ రోడ్‌నం.1లో రెండు వైపులా ట్రాఫిక్ జాం

నగర ట్రాఫిక్.. నిత్య జామ్‌ఝూటమే!

నగరంలో ఎప్పుడు వర్షం కురుస్తుందో.. ఏ రోడ్లు మునిగిపోతాయో తెలియని పరిస్థితి. ఇక ఎక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుంతో సైతం అర్థంకాని తీరు కొనసాగుతోంది. వీవీఐపీల పర్యటనలు, రోడ్ల ముంపునకు తోడు కాలిబాటలు, రోడ్ల ఆక్రమణలు కూడా ఇందుకు కారణమవుతున్నాయి. ప్రధానంగా స్కూళ్లు, ఆఫీసులకు వెళ్లివచ్చే సమయాల్లో రద్దీ తీవ్రంగా ఉంటోంది.

కుమార్తె పెళ్లికి ఏర్పాట్లు.. కుంటలో శవమై తేలాడు



రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: కుమార్తె పెళ్లికి శుభలేఖలు ఇవ్వడానికి వెళ్తానని చెప్పిన వ్యక్తి పత్తికుంటలో శవమై తేలాడు. రాజేంద్రనగర్ ఠాణా పరిధిలోని హనుమాన్‌నగర్‌కు చెందిన **నాగరాజు**(45)కు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాళ్లుకొడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురు లావణ్యకు వచ్చేనెల 15న పెళ్లి చేయాల్సి ఉంది. దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులకు కార్డులు పంపిణీ చేయడానికని 23వ తేదీన ఇంటి నుంచి వెళ్లాడు. మర్నాడు ఫోన్‌చేయగా అందుబాటులోకి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా బుధవారం హనుమాన్‌నగర్ సమీపంలోని పత్తికుంటలో నాగరాజు మృతదేహం కనిపించింది. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన నాగరాజు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వినాయకుడి నిమజ్జనం సందర్భంగా వచ్చే ఇనుము కోసం పత్తికుంటలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. అతడితో ఉన్న ఇద్దరు ఎవరనే విషయంపై పోలీసులు దృష్టి సారించారు. 18 రోజుల్లో కూతురి పెళ్లిపెట్టుకొని నాగరాజు మృతి చెందడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు.

రూ.100 కోట్లతో 50 భూగర్భ జలాశయాలు



ఈనాడు, హైదరాబాద్: రోడ్లపై నిలిచే నీటి సమస్యను నివారించేందుకు రూ.100కోట్ల వ్యయంతో, 50 చోట్ల, 10లక్షల లీటర్ల వరద నీటి నిల్వ సామర్థ్యం కలిగిన భూగర్భ జలాశయాలను నిర్మించనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఇప్పటికే పనులు చేపట్టామని తెలిపారు. లేక్‌వ్యూ గెస్ట్ హౌజ్, కేసీపీ సర్కిల్, సచివాలయం ఎదురుగా, ఇతరత్రా కలిపి మొత్తం 18 చోట్ల 23 భూగర్భ ట్యాంకులు నిర్మాణమవుతున్నాయన్నారు. 141 ప్రాంతాల్లో వరద పెద్ద ఎత్తున నిలుస్తోందని, ఆ సంఖ్యను 50కి తగ్గించేందుకు ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ఉత్తమ పోలీసు స్టేషన్‌గా 'హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణా'


డీజీపీ జితేందర్ చేతుల మీదుగా పురస్కార పత్రాన్ని అందుకుంటున్న ఆర్.జి.శివమారుతి

నారాయణగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పౌరులకు అత్యుత్తమ సేవలందించినందుకు ఉత్తమ పోలీసు స్టేషన్‌గా 'హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణా' నిలిచింది. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ చేతుల మీదుగా సైబర్ క్రైమ్ పోలీసు ఠాణా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) ఆర్.జి.శివమారుతి పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్, అదనపు పోలీసు కమిషనర్ (క్రైమ్, సిట్), డీసీపీ (సైబర్ క్రైమ్)లతో పాటు సిబ్బందిని డీజీపీ అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, అలాగే పోలిసింగ్‌ను అన్ని రంగాల్లో మొదటిస్థానంలో నిలపాలని ఆయన సూచించారు.

అగమ్యగోచరం

ప్రయాణికులను తికమక పెడుతున్న ఆర్టీసీ యాప్

ఈనాడు, హైదరాబాద్: ● నగరవాసి ఒకరు ఖమ్మం వెళ్లేందుకు టికెట్ బుక్ చేశారు. ప్రయాణంరోజు సాయంత్రం ఎల్బీనగర్‌లో వేచిఉన్నారు. గమ్యం యాప్‌లో చూడగా బస్సు ఎస్సార్‌నగర్‌వద్ద ఉందని సూచించింది. వెంటనే బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేయగా దిల్‌సుఖ్‌నగర్ చేరుకున్నామని, 10 నిముషాల్లో ఎల్బీనగర్ చేరుకుంటామని చెప్పారు. యాప్‌ను నమ్ముకుంటే పరిస్థితేంటని ప్రయాణికుడు వాపోయారు. ఇటీవల పలువురికి ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. ప్రయాణాన్ని సులభతరం చేయాల్సిన ఆర్టీసీ 'గమ్యం' యాప్ అగమ్యగోచరంగా తయారైంది. యాప్‌ను నమ్ముకున్న ప్రయాణికులు నష్టపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సుల రాకపోకల సమయాలను, ఏ బస్సు ఏ ప్రాంతంలో ఉంది.. ఏ సమయానికి స్టేషన్‌కు వస్తుందో వివరాలు ఈ యాప్‌లో చూడొచ్చు. కేవలం పుష్పక్ బస్సులకే కచ్చిత సమయాలను చూపుతోందని, మిగిలిన బస్సుల్లో గజిబిజి వ్యవహారంలా తయారైందని, సాంకేతిక సమస్యలను రూపుమాపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎన్‌వోసీలు ఇచ్చినా మరోసారి పరిశీలన తప్పనిసరి

హెచ్‌ఎండీఏ లేక్ ప్రొటెక్షన్ కమిటీలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలో భవన నిర్మాణాలు, లేఅవుట్లకు ఇరిగేషన్ శాఖ ఆధారంగా అనుమతులు జారీ చేసి ఉంటే అలాంటి వాటిని మరోసారి పరిశీలించిన తర్వాతే తుది అనుమతులు ఇవ్వాలని చెరువుల పరిరక్షణ కమిటీ తేల్చింది. అమీర్‌పేట హెచ్‌ఎండీఏ కార్యాలయంలో బుధవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలోని లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా అవుటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని చెరువుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఆక్రమణల తొలగింపు, చెరువు కట్టల పటిష్టత, మురుగు కలవకుండా ఎస్టీపీల ఏర్పాటు తదితర అంశాలపై జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకోనున్నారు. ఇప్పటికే లేక్‌వ్యూ విల్లాలు, అపార్ట్‌మెంట్లు, చెరువులు, కాల్వలు, నీటి కుంటల ప్రాంతాల్లో ఇరిగేషన్ శాఖ నిరభ్యంతర పత్రాలతో హెచ్‌ఎండీఏ అనుమతించిన వాటిని మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు. హెచ్‌ఎండీఏ అనుమతులు ఇచ్చిందని నిర్మాణాలు ప్రారంభించి తర్వాత ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు గుర్తించి కూల్చివేయడం సరికాదని, ముందే గుర్తించడం వల్ల అడ్డుకోవచ్చునని తెలిపారు. హెచ్‌ఎండీఏలోని పీవోలు, ఏపీవోలు సంబంధిత మ్యాపులతో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన తర్వాత అనుమతులు ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది.

ఇండోర్ ప్రజలది 'స్వచ్ఛ' మనసు

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన నగర మేయర్, కార్పొరేటర్లు


విజయలక్ష్మికి స్వాగతం పలుకుతున్న ఇండోర్ మేయర్ పుష్యమిత్ర

ఈనాడు, హైదరాబాద్: ఇండోర్ ప్రజలకు పారిశుద్ధ్యం విషయంలో క్రమశిక్షణ ఉందని, ఎవరికి వారు స్వచ్ఛందంగా ఇంటి చెత్తను తడి, పొడిగా వేరుచేసి చెత్తఆటోలకు అందిస్తున్నారని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, 40 మంది కార్పొరేటర్ల బృందం వెల్లడించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో వరుసగా ఏడుసార్లు మొదటి ర్యాంకు సాధించిన ఇండోర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించేందుకు బుధవారం పాలకమండలి నేతలు ఆ నగరానికి వెళ్లారు. ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు, డంపింగ్ యార్డు నిర్వహణను పరిశీలించి, అనంతరం ఇండోర్‌మేయర్ పుష్యమిత్రతో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీల సహకారం, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛతను సాకారం చేసుకోగలిగామని, కఠిన నిబంధనలతో ఉల్లంఘనలు తగ్గాయని ఆయన వివరించారు. ఖాళీ స్థలాలు, రోడ్లపై వ్యర్థాలు వేసేవారికి రోజుకు రూ.3లక్షల జరిమానా విధిస్తున్నామని తెలిపారు. ఇండోర్‌లో రోడ్లపై ఉన్న తోపుడు బండ్లు, ఆహార విక్రయకేంద్రాలు చెత్త డబ్బాలు ఏర్పాటుచేసుకోవడం ప్రశంసనీయమని మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు సంతోషం వ్యక్తంచేశారు.

జంట జలాశయాల గేట్ల ఎత్తివేత

ఈనాడు, హైదరాబాద్: జంట జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో.. గండిపేట, ఉస్మాన్‌సాగర్‌లలోకి వరద ప్రవాహం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక ఆయా రిజర్వాయర్ల గేట్లు ఎత్తినట్లు జలమండలి తెలిపింది. గండిపేటలో అడుగు మేర రెండు గేట్లు ఎత్తి 234 క్యూసెక్కులు విడుదలచేశారు. హిమాయత్‌సాగర్‌లో బుధవారం సాయంత్రం అడుగు మేర గేట్లను ఎత్తారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జలమండలి అధికారులు సూచించారు.

లడ్డూ కల్తీ కారకులను శిక్షించాలని న్యాయవాదుల డిమాండ్



రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: కలియుగ దైవం తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూని కల్తీ చేసి, భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదులు డిమాండ్ చేశారు. భాజపా న్యాయ విభాగం నేతలు బుధవారం భోజన విరామ సమయంలో జిల్లా కోర్టుల భవన సముదాయం ఎదుట నిరసన తెలిపారు. భాజపా న్యాయ విభాగం నేతలు పీఠం ప్రదీప్ కుమార్, నరేశ్‌కుమార్, గురువయ్య, వినోద్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్, మీనాక్షి పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

ఏబీ బర్ధన్ సేవలు చిరస్మరణీయం



హయత్‌నగర్, న్యూస్‌టుడే: పేదల తరపున పోరాడిన ఏబీ బర్ధన్ సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి కొనియాడారు. ఏబీ బర్ధన్ శత జయంత్యుత్సవాలు పురస్కరించుకొని బుధవారం కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు హరి సింగ్, దాసరి ప్రసాద్, నవనీత, నారాయణ, పుల్లయ్య, నారాయణరెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

పలు కాలనీలు జలమయం



సాహెబ్‌నగర్-ఇంజాపూర్ మార్గంలో వరద

వనస్థలిపురం, న్యూస్‌టుడే: ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం మరోమారు భారీ వర్షం కురిసింది. వనస్థలిపురం పరిధిలోని పలు కాలనీ రోడ్లపై వరద పెద్ద ఎత్తున ప్రవహించింది. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

యునాని పరిశోధన కేంద్రంలో జాతీయ సదస్సు నేడు, రేపు

వెంగళరావునగర్: ఎర్రగడ్డలోని యునాని పరిశోధన కేంద్రం ఆడిటోరియంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ ఆధ్వర్యంలో రీసెర్చ్ (యునాని) సైంటిస్ట్ లెవల్-1 కోసం మెడిజెంస్, 'హెచ్ఆర్‌డీ కోర్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లపై 'ఏషన్ కమ్ ఇండక్షన్' పేరిట గురు, శుక్రవారాల్లో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు.

ప్రణాళికా లోపం.. ప్రజలకు శాపం

వర్షమొస్తే పలు కాలనీల మునక



ఓంకార్‌నగర్ వద్ద రోడ్డుపైకి చేరుతున్న వరద

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: ప్రణాళిక లేకుండా చేపడుతున్న పనులతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలు.. చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతున్నాయి. వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీ నుంచి ఓంకార్ నగర్ వరకు చేపట్టిన ట్రంక్‌లైన్ పనులతో ఓ వైపు సమస్య తీరగా, మరోవైపు ముంపు సమస్య తలెత్తింది. వనస్థలిపురం క్రిస్టియన్ కాలనీ, హస్తినాపురం ఈస్ట్, రాజిరెడ్డి నగర్, వెంకటరమణ కాలనీ, అనురాధా కాలనీల మీదుగా ఓంకార్ నగర్ వరకూ రూ.2.70 కోట్లతో ట్రంక్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టకముందు ఈ కాలనీలు ముంపు బారిన పడేవి. ఐదారు కాలనీల మీదుగా ట్రంక్‌లైన్ నిర్మించి, ఎక్కడా లింకు ఇవ్వకుండానే ఓంకార్ నగర్ పెట్రోల్ పంపు వద్ద వదిలేశారు. వర్షం వచ్చినప్పుడల్లా వరద సాగర్ రోడ్డు దాటి హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఏపీఎస్ఈబీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, ద్వారకా తిరుమల కాలనీ మీదుగా సాగర్ ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీలను ముంచుతోంది. వదిలేసిన ట్రంక్ లైన్ నిర్మాణాన్ని సాగర్ రోడ్డుకు సమీపం నుంచి శక్తి నగర్, యశోధర నగర్ మీదుగా సాగర్ రింగ్ రోడ్డు వరకూ పొడగించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.



వరద కాల్వ నిర్మాణానికి తెచ్చిన పైపులు



ఏపీఎస్ఈబీ కాలనీలో ఇళ్లలోకి నీరు రాకుండా ఇసుక బస్తాలు

ఐదేళ్లుగా అవస్థలు..

బండ్లగూడ, న్యూస్‌టుడే: నాగోల్ డివిజన్ బండ్లగూడ సమీపంలోని శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్ వాసులు ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నారు. ఎగువున ఉన్న గోపాలకృష్ణాపురం కాలనీ, మన్సూరాబాద్ రోడ్డులోని డీమార్ట్ నుంచి వరద ఈ కాలనీలోకి చేరుతోంది. అక్కడ నుంచి దిగువకు వెళ్లడం లేదు. కాలనీకి ఆనుకొని ఎత్తులో నిర్మించిన రెండు గేటెడ్ కమ్యూనిటీల నుంచి వరద సైతం ఇదే కాలనీలోకి వస్తోంది. నీరు దిగువకు వెళ్లకుండా, ఓ గేటెడ్ కమ్యూనిటీ వాళ్లు అడ్డుగా రేకులు పెట్టడంతో సమస్య తీవ్రమవుతోంది. స్థానికంగా వరద తరలింపు పనులకు గతేడాది చివరలో రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. బండ్లగూడ చౌరస్తా పెట్రోల్ బంకు మీదుగా వెళ్తున్న ఎస్ఎన్‌డీపీ నాలాలో వరద కలిసేలా పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. జూన్‌లో తవ్వకాలు చేపట్టి, బండ్లగూడ చౌరస్తా నుంచి పనులు ప్రారంభించారు. బండ్లగూడ గ్రామంలోకి వచ్చేసరికి పనులు నిలిచిపోవడంతో స్థానికులకు సమస్యలు తప్పడంలేదు. వర్షాలు తగ్గాక పనులు ప్రారంభించి, పూర్తి చేస్తామని కార్పొరేటర్ చింతల అరుణాయాదవ్ తెలిపారు.



శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్‌లో దిగువకు వరద వెళ్లకుండా రేకులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఎల్బీనగర్: రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్బీనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. వనస్థలిపురం రైతుబజార్ ముందు ఉన్న షెడ్లు, చిరు వ్యాపార సముదాయాల బుధవారం జేసీబీ సహాయంతో కూల్చివేశారు. కొన్నేళ్లుగా రైతుబజార్ ప్రాంగణంలో దుకాణాలు ఏర్పాటు చేసుకొని పలువురు పూలు, పండ్లు, ఇతర గృహోపకరణాలు విక్రయిస్తుంటారు. ఈ దుకాణాల కారణంగా పలుమార్లు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానికులు, కాలనీవాసులు అనేకసార్లు అధికారులు ఫిర్యాదు చేశారు. బుధవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసుల సహకారంతో రైతుబజార్ గోడ వెంబడి, రైతుబజార్ నుంచి గణేశ్ ఆలయం వరకు ఉన్న దుకాణాలు, షెడ్లను కూల్చివేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, సీఐ అశోక్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ గట్టుమల్లు పాల్గొన్నారు.

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్బీనగర్: వర్షాలతో జ్వరాలు ప్రబలుతున్నందున గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో బుధవారం గైనకాలజిస్ట్ బి.మేనక ఆధ్వర్యంలో డా.అర్చన, డా.ప్రసన్నలత, డా.వాసవి తదితరులు విలేకర్లతో మాట్లాడారు. డెంగీ, గన్యా, వైరల్ జ్వరాలతో అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. ఏ సమస్య తలెత్తినా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

అసలే అంధకారం.. ఆపై గొయ్యి



నాగోల్- గౌరెల్లి రేడియల్‌లో రాత్రి పూట పూర్తిగా అంధకారం నెలకొంటుంది. ఆ మార్గంలో కుంట్లూర్ నుంచి ఓఆర్ఆర్ వెళ్లే దిశలో రాజీవ్ గృహకల్ప ఎదురుగా నడిరోడ్డుపై గొయ్యి ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హయత్‌నగర్

నిమజ్జనం ముగిసె.. వ్యర్థాలు మిగిలె..



మినీ ట్యాంక్‌బండ్‌గా పేరు గాంచిన సరూర్‌నగర్ చెరువు కట్టపై వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. వర్షాలకు వ్యర్థాలు తడిచి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు, హైదరాబాద్

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030	మలక్‌పేట: 80085 73284
	హయత్‌నగర్: 98336 64897
	కర్మన్‌ఘాట్: 94400 32872
	బండ్లగూడ: 96034 78579
	మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, బండ్లగూడ, వనస్థలిపురం, సైదాబాద్

? వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ చైతన్య ఆసుపత్రి ముందు లైన్‌లో నిత్యం మురుగు ఏరులై పారుతోంది. దుర్వాసన, అపరిశుభ్రతతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.- జయసింహ, ప్రశాంత్‌నగర్

✔ సిబ్బందిని పంపించి మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయించి, సమస్యను పరిష్కరిస్తాం. - శ్రీనివాస్‌రెడ్డి, జీఎం, జలమండలి

? ఆనంద్ నగర్ రోడ్డు నంబర్-2లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైంది. దీంతో చెత్తాచెదారం దాంట్లోకి చేరుతోంది. వెంటనే మూత ఏర్పాటు చేయాలి.- హరిశంకరబ్రహ్మగుప్తా, ఆనంద్‌నగర్

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. మూత ఏర్పాటు చేస్తాం. - శ్రీనివాస్‌రెడ్డి, జీఎం, జలమండలి

? లోకాయుక్త కాలనీ నుంచి శ్రీసాయినగర్ కాలనీ వైపు వెళ్లే మార్గంలో వినాయక మండపం ఇంకా తొలగించలేదు. వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - గోవర్ధన్, సైదాబాద్

✔ మండపాలు తొలగించాలని నిర్వాహకులను సూచించాం. మరోమారు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి తగిన చర్య తీసుకుంటాం. - రాఘవేందర్, ఇన్‌స్పెక్టర్, సైదాబాద్

సంక్షిప్త సమాచారం

పార్కులో వెలగని విద్యుత్తు దీపాలు

మూసారాంబాగ్: ఎస్బీహెచ్ కాలనీ ఉద్యానంలో అంధకారం నెలకొంది. ఒక్కటంటే ఒక్క దీపం వెలగకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఫార్మసిస్టులకు సత్కారం

మూసారాంబాగ్: ఫార్మసిస్టులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని రంగారెడ్డి జిల్లా కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.పెండెం కృష్ణకుమార్ కోరారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ సందర్భంగా బుధవారం దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న ఫార్మసిస్టులను సత్కరించారు.

గస్తీ పెంచాలని సీఐకి వినతి

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో రాత్రి పూట గస్తీ పెంచాలని మజీద్-ఎ-హుస్సేనీ కమిటీ అధ్యక్షుడు మీర్ హాది అలీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం హయత్‌నగర్ సీఐ నాగరాజు గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.

సీపీఎం కార్యకర్తల సమావేశం

కర్మన్‌ఘాట్: క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, రవీందర్ యాదవ్ కోరారు. బైరామల్‌గూడలో బుధవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్డుల జారీ విషయం ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఎల్లయ్య, పార్టీ నాయకులు రామస్వామి, దుర్గారావు, గణేశ్, ప్రభాకర్, కోటేశ్వర్‌రావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్, కండక్టర్లదే కీలకపాత్ర



సిబ్బందికి నగదు పురస్కారాలు అందజేస్తు న్న మేనేజర్ విజయ్

హయత్‌నగర్, న్యూస్‌టుడే: ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల పాత్ర కీలకమని హయత్‌నగర్-1 డిపో మేనేజర్ విజయ్ అన్నారు. హయత్‌నగర్ వన్ డిపోలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. సంస్థకు అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లు ఉదయశ్రీ, రమాదేవి, లక్ష్మారెడ్డి, ప్రశాంత్, సురేందర్‌లకు నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు. అనంతరం డీఎం విజయ్ మాట్లాడుతూ.. కొత్తగా ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ బస్సులను ప్రతి 30 నిమిషాలకు ఒకటి చొప్పున హయత్‌నగర్ నుంచి ఉప్పల్ రింగ్‌రోడ్డు మీదుగా జేబీఎస్ వరకు నడుపుతున్నట్లు తెలిపారు. సహాయ డిపో మేనేజర్ విజయకుమారి, సిబ్బంది నరేశ్ పాల్గొన్నారు.

బీసీ సంఘాల సమావేశం నేడు

నారాయణగూడ: బీసీల హక్కుల సాధన, అన్ని బీసీ సంఘాల్లో ఐక్యత తీసుకురావడానికి ఈనెల 26న అఖిలపక్ష, కులసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బోల్ల శివశంకర్ తెలిపారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. బుధవారం పద్మశాలి భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీల పట్ల కంటి తుడుపు చర్యగా ఏదో ఇస్తున్నట్లు మాయ చేస్తోందనే అనుమానం కలుగుతోందన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి జగన్నాథం, తెలంగాణ ప్రాంత రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి రామచందర్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తరలింపు

ఈనాడు కథనానికి స్పందన

కర్మన్‌ఘాట్: హస్తినాపురం, లింగోజిగూడ డివిజన్ల పరిధిలో పలు కాలనీల్లో చెత్త, వ్యర్థాలను తొలగించారు. ఈ సమస్యను వివరిస్తూ 'ఇదేనా స్వచ్ఛత.. ఎవరిదీ బాధ్యత' శీర్షికన ఈ నెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆయా కాలనీల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వ్యర్థాలు తరలించారు.

ఎస్జీఎఫ్ జోనల్ క్రీడలు ప్రారంభం



ప్రారంభోత్సవంలో చిరంజీవి, రాధాకృష్ణ, వరప్రసాద్ రెడ్డి, అస్రాఫాతిమా, తిరుపతిరెడ్డి, ఓంహరికృష్ణ

సైదాబాద్, న్యూస్‌టుడే: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) సైదాబాద్ జోనల్ క్రీడలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూసారాంబాగ్-అంబర్‌పేట మార్గంలోని స్వామి వివేకానంద సెంటనరీ స్కూల్ మైదానంలో అతిథులు బెలూన్లు ఎగురవేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలిరోజు బాలికల కబడ్డీ, ఖో-ఖో పోటీలు జరిగాయి. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు చిరంజీవి, సైదాబాద్ జోన్ డిప్యూటీ డీఈవో తిరునగరి రాధాకృష్ణ, జోన్ డిప్యూటీ ఐవోఓస్-1 గవ్వి వరప్రసాద్‌రెడ్డి, జోన్ డిప్యూటీ ఐవోఓస్-2 అస్రాఫాతిమా, హెచ్‌డీఎస్జీఎఫ్ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి డి. తిరుపతిరెడ్డి, సైదాబాద్ కార్యనిర్వాహక కార్యదర్శి ఓంహరికృష్ణ పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలిలా..

- 14 ఏళ్ల విభాగం కబడ్డీ: ప్రథమ స్థానం- ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ఎస్ బాలికలు, ద్వితీయ స్థానం- ఎస్వీవీ మూసారాంబాగ్, తృతీయ స్థానం- సెయింట్ డామ్నిక్స్ ఉన్నత పాఠశాల, మూసారాంబాగ్
- 17 ఏళ్ల విభాగం కబడ్డీ: ప్రథమ-ఎస్వీవీ మూసారాంబాగ్, ద్వితీయ-ఎంజేపీటీ బీసీడబ్ల్యూఆర్ఎస్ బాలికలు, తృతీయ- టీజీఎంఆర్ఎస్ సైదాబాద్ బాలికలు
- 14 ఏళ్ల విభాగం ఖో-ఖో: సెమీస్‌కు చేరిన జట్లు- గీతాంజలి విద్యాలయ, ప్రభుత్వ మలక్‌పేట, ఎస్వీవీ మూసారాంబాగ్, టీజీఎంఆర్ఎస్ సైదాబాద్ బాలికలు
- 17 ఏళ్ల విభాగం ఖో-ఖో: క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన జట్లు: ప్రభుత్వ న్యూమూసారాంబాగ్, ఎస్వీవీ సైదాబాద్, శ్రీగాయత్రి, ప్రభుత్వ మలక్‌పేట, ఎంజేపీటీ బీసీడబ్ల్యూఆర్ఎస్ బాలికలు, ప్రభుత్వ శంకేశ్వర్ బజార్, ఎస్వీవీ మూసారాంబాగ్, టీజీఎంఆర్ఎస్ సైదాబాద్ బాలికలు

రెవెన్యూ అధికారుల దిగ్బంధం



ఉప్పల్ రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్న మూసీ పరివాహక బస్తీవాసులు

నాగోలు, న్యూస్‌టుడే: సర్వే నిమిత్తం వచ్చిన ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులను బుధవారం కొత్తపేట, చైతన్యపురి డివిజన్లకు చెందిన మూసీ పరివాహక కాలనీల ప్రజలు అడ్డుకున్నారు. తమ ఇళ్లను కూల్చుతారన్న భయాందోళనతో సత్యానగర్, న్యూమారుతీనగర్ ఈస్ట్ కాలనీలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఇటీవల చేసిన సర్వే తప్పుల తడకగా ఉందని, నదికి దూరంగా ఉన్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ కింద చూపుతున్నారని అధికారులు దిగ్బంధించారు. చైతన్యపురి ఠాణా పోలీసులు అక్కడకు చేరుకొని, అధికారులను తీసుకెళ్లారు. 225 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయని, ఆ విషయం తెలిపేందుకే తాము వచ్చామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

చాదర్‌ఘాట్ పరిధిలో..

చంచల్‌గూడ: చాదర్‌ఘాట్ మూసీ పరిసరాల్లో బుధవారం రెవెన్యూ అధికారులు పర్యటించారు. ఇళ్లు కోల్పోయే నిర్వాసితులను గుర్తించేందుకు ఉప కలెక్టర్ జ్యోతి, హిమాయత్‌నగర్ తహసీల్దారు సంధ్యారాణి, ఇతర రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇళ్లకు సంబంధించిన పత్రాలు, విద్యుత్తు బిల్లులు వంటి వాటితో సిద్ధంగా ఉండాలని.. ఒకటి, రెండు రోజుల్లో ఇంటింటికి సర్వే చేస్తామని అధికారులు స్థానికులకు తెలిపారు.

దీన్‌దయాళ్ అడుగుజాడలు అనుసరణీయం

సైదాబాద్, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అడుగుజాడల్లో నడవడమే ఆయనకు నిజమైన నివాళి అని భాజపా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్ రెడ్డి బస్తీలోని తన నివాసంలో బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా నియోజకవర్గాల్లోని 27 కేంద్రాల్లో జయంతి ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. అక్టోబర్ 15 వరకు భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు.



రెడ్డి బస్తీలో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి



మార్కెట్‌లో సభ్యత్వ నమోదులో సుధాకర్‌రెడ్డి

అన్నివర్గాల సంక్షేమమే మోదీ ధ్యేయం

అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే: అన్నివర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ అనేక పథకాలు రూపొందిస్తున్నారని భాజపా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని బుధవారం మలక్‌పేట మార్కెట్‌లో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. భాజపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వంజరి వినోద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సొంత నియంత్రికలు తప్పనిసరి

- అపార్టుమెంట్లకు విద్యుత్తు శాఖ తాఖీదులు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: 20 కిలోవాట్లకు మించి విద్యుత్తు వినియోగిస్తే సొంతంగా నియంత్రికలు ఏర్పాటు చేసుకోవాలని అపార్టుమెంట్ యాజమాన్యాలకు విద్యుత్తు శాఖ అధికారులు సూచించారు. ఆస్మాన్‌గఢ్ విద్యుత్తు డివిజన్ పరిధిలో మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాల్లో 10 సెక్షన్లు, 12 విద్యుత్తు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. విద్యుత్తు డివిజన్ పరిధిలో నిత్యం 1.80 కోట్ల విద్యుత్తు యూనిట్లు వినియోగిస్తున్నారు. వేసవిలో ఇది 2 కోట్ల యూనిట్లకు చేరుతోంది. సాధారణంగా 4 లేదా 5 మీటర్లు కలిగిన ఇళ్లల్లో ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. గతంతో పోల్చితే ప్రస్తుతం 4 లేదా 5 అంతస్తుల భవన నిర్మాణాలు పెరిగాయి. అపార్టుమెంట్లు నిర్మించి విక్రయించే సమయంలో నిర్మాణదారులు విద్యుత్తు సరఫరా విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఆయా నిర్మాణాలకు కాలనీలో లేదా బస్తీలో ఏర్పాటు చేసిన నియంత్రికల నుంచే విద్యుత్తును వాడుకుంటున్నారు. దీంతో అధిక లోడ్ కారణంగా సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. సాధారణ వినియోగదారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో దక్షిణ మండలం విద్యుత్తు సంస్థ 20 కిలోవాట్లకు మించి విద్యుత్తును వినియోగించుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ మేరకు మలక్‌పేట ఆస్మాన్‌గఢ్ డివిజన్ పరిధిలో 148 యాజమాన్యాలకు నోటీసులను జారీ చేశారు. 20 కిలోవాట్లకు మించి విద్యుత్తు వినియోగించే అపార్టుమెంట్లు, ఇతర నిర్మాణాల యజమానులు.. అందుకు అవసరమైన ఖర్చు చెల్లిస్తే, విద్యుత్తు సంస్థే అన్ని ఏర్పాట్లు చేస్తుందని స్థానిక అధికారులు తెలిపారు. సొంత నియంత్రికలు లేకుండా, సాధారణ నియంత్రికల నుంచి విద్యుత్తు వాడుతున్న అపార్టుమెంట్లు, 4 లేదా 5 అంతస్తుల భవన యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇన్‌ఛార్జి డీఈ రామారావు, ఏడీఈ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానికంగా కరపత్రాలతో ప్రచారం చేస్తున్నారు.

ఆస్మాన్‌గఢ్ పరిధిలో..

గృహ కనెక్షన్లు:	వాణిజ్య కనెక్షన్లు:
1,67,705	25,896



చంచల్‌గూడ 220/33 కేవీ విద్యుత్ కేంద్రం



అబిడ్స్ తాజ్‌మహల్ హోటల్ యాజమాన్యానికి తాఖీదులు

అబిడ్స్, న్యూస్‌టుడే: అబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లోని పప్పులో పురుగు కనిపించిందని వచ్చిన ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు బుధవారం హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వాహణ, ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని అనేక లోపాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు జీహెచ్‌ఎంసీ హెల్త్ విభాగం అదనపు కమిషనర్ పంకజ తెలిపారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్
• చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన సభ రేపు



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న డా.చీమ శ్రీనివాస్ తదితరులు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన సభను 27న నిర్వహించనున్నట్లు పోరం ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు హాజరవుతున్నారని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సురేందర్‌రెడ్డి, వీరస్వామి, ఇంద్రకుమార్, విష్ణువర్ధన్, అనంతలక్ష్మి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధిదీపాలు..
రహదారులు చిమ్మ చీకట్లు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. చిమ్మ చీకటి నెలకొని తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయి. నిర్వహణను గ్రేటర్ అధికారులు గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీ, బస్తీల సంక్షేమ, యువజన సంఘాలు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేకుండాపోయింది. వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టాలని స్థానికులు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుడిమల్కాపూర్‌లో

23వేలకు పైగా...

గ్రేటర్ మెహిదీపట్నం(నాంపల్లి) సర్కిల్ పరిధిలో దాదాపు 23వేలకు పైగా వీధి దీపాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 400 హైమాస్టు, మినీ మాస్టు ల్యాంపులు కాగా, 22 వేలు ఎల్‌ఈడీ వీధి దీపాలు స్తంభాలకు ఏర్పాటై ఉన్నాయి. ఈ దీపాలు టైమర్ల సహాయంతో ఆటోమెటిక్‌గా సాయంత్రం వెలిగి, మరునాడు ఉదయం ఆరిపోవాలి. కొన్ని ప్రాంతాల్లో టైమర్లు పని చేయకపోవడంతో అందుబాటులో ఉన్న సిబ్బంది లేదా స్థానికులే ఆపరేటింగ్ చేస్తున్నారు. ఇక టైమర్లు పూర్తిగా మొరాయించిన ప్రాంతాల్లో కటిక చీకటి నెలకొంటుంది. ఎప్పుడూ పెద్ద ఎత్తున రాకపోకలు సాగించే ఆసిఫ్‌నగర్-జిర్రా రోడ్డు, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో దీపాలు వెలగడంలేదు. నాంపల్లి, సీతారాంబాగ్, మల్లేపల్లి, ఆగాపురా, మెహిదీపట్నం పరసర కాలనీల్లో అదే పరిస్థితి ఉంది. మరమ్మతుల కోసం స్పెయిర్ పార్టులు లేవని, స్తంభాలు ఎక్కేందుకు ల్యాడర్ లేదని, సిబ్బంది అందుబాటులో లేరని అధికారులు కారణాలు చెబుతున్నారు. ఇటీవల రాత్రి సమయంలో కురుస్తున్న భారీ వర్షాల్లో రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. ఈ రహదారుల్లో వీధి దీపాల వెలుగులు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు నరకం అనుభవిస్తున్నామని వాపోతున్నారు.



ఆసిఫ్‌నగర్ జిర్రా రోడ్డు

రోడ్లపై మురుగు.. పరుగు

విజయనగర్‌కాలనీ, కార్వాన్, న్యూస్‌టుడే: గుంతలు పడి అంతంత మాత్రంగా ఉన్న విజయనగర్ కాలనీ, శాంతినగర్, పీఎస్‌నగర్‌లలో డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చింది. రోడ్లపై పారుతున్న మురుగు లోనుంచే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. వృద్ధులు, ఉదయం నడిచే వాకర్స్ ఇబ్బందిపడుతున్నారని వాపోతున్నారు. వాహనదారులు రహదారిపై జారిపడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరోవైపు పలు చోట్ల వాల్వ్‌లు లీకై తాగునీరు వృథాగా రోడ్ల పాలవుతోంది.



శాంతినగర్ కాలనీలో..

వెంటనే మరమ్మతులు చేపట్టాలి

ఇంటి పన్ను, ఇతర ట్యాక్స్‌లు సక్రమంగా కడుతుండటంతో తమకు పలుమార్లు జీహెచ్‌ఎంసీ ఉత్తమ కాలనీగా అవార్డులు ఇచ్చిందని విజయనగర్, శాంతి నగర్ కాలనీల ప్రజలు చెబుతున్నారు. అయితే గత ఆరేడు నెలలుగా మురుగు సమస్య ముప్పుతిప్పలు పెడుతోంది. భారీ వానలకు గుంతలు పడి రోడ్లు ధ్వంసమైయ్యాయి, మ్యాన్‌హోళ్లు అడుగులోతులో ఎగుడు దిగుడుగా ఏర్పాటు చేశారు. వాటివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై పారుతున్న మురుగుతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: మహ్మద్ షకీల్ అహ్మద్, డీజీఎం జలమండలి డివిజన్-3

మురుగు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటాము. ఎగుడుదిగుడుగా ఉన్న మ్యాన్‌హోళ్లను సవరించటంతోపాటు అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తాము.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

వేంగంబజార్, మెహిదీపట్నం, సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే:

? ఎంజీబీఎస్‌లోని అలైటింగ్ పాయింట్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు వెళ్లే ప్లాట్‌ఫాం సమీపంలోని శౌచాలయంలో బోర్ నీరు అందుబాటులోకి లేకుండా పోయింది.
– అనిల్‌గౌడ్, గౌలిగూడ,

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్,ఎంజీబీఎస్ సీఈఓ

? ఆసిఫ్‌నగర్‌లోని శంకర్‌నగర్‌లోని ఓ వీధిలో వీడీసీసీ రోడ్డు నిర్మాణం కోసం అధికారులు తవ్వకాలు చేపట్టారు. పనులు ప్రారంభించి దాదాపు రెండు నెలల గడుస్తున్నా, ఇంకా పూర్తి కాలేదు.
– మహేశ్, స్థానికుడు

✓ భారీ వర్షాల వల్ల ఆలస్యం అవుతున్నాయి. వెంటనే పనులు చేపడతాం. –విష్ణువర్ధన్‌రెడ్డి, సహాయ ఇంజినీరు, మెహిదీపట్నం సర్కిల్

? సుల్తాన్‌బజార్, కండస్వామిలేన్, గుజరాతీగల్లి ప్రాంతాల్లో నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి.
– మహేందర్‌యాదవ్, సుల్తాన్‌బజార్

✓ సమస్య తమ దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు తీసుకుంటాం.
– కుల శేఖర్, జలమండలి–సుల్తాన్‌బజార్ సెక్షన్ మేనేజర్

? ఇసామియాబజార్, గాడీఖానా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. – రాజేందర్‌కుమార్, ఇసామియాబజార్,

✓ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటాం.
– కుల శేఖర్, జలమండలి–సుల్తాన్‌బజార్ సెక్షన్ మేనేజర్

ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి: కోదండరాం

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: యువతకు విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుక ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్సీ కోదండరాం పేర్కొన్నారు. కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం (టీఎంవీ) ఉర్దూ విభాగం ఆధ్వర్యంలో ఓయూ వ్యవస్థాపకులు 7వ నిజాం నవాబ్ మీర్‌ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ స్మారకార్థం నిర్వహించిన సదస్సుకు ఎమ్మెల్సీలు కోదండరాం, ఆమీర్ అలీఖాన్ హాజరయ్యారు. గత పదేళ్లలో దేశంలో నిరుద్యోగ సమస్య విపరీతకంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు నైపుణ్యంలో శిక్షణ కల్పించి చిన్న పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రోత్సహిస్తుందన్నారు. అలీఖాన్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ మాజీ ఛైర్మన్ ప్రొ.ఘంటా చక్రపాణి, టీఎంవీ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.విజ్జులత, ఉర్దూ విభాగాధిపతి డా.సయీదా నసీమ్ సుల్తానా, ప్రత్యేక అధికారి సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోదండరాం, చిత్రంలో ఆమిర్ అలీఖాన్, ప్రొ.విజ్జులత తదితరులు

మధుసూదన్‌రావుకు ఎక్సలెన్సీ అవార్డు



చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ అంబికానగర్‌లోని శాంతినికేతన్ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.మధుసూదన్‌రావుకు ఎక్సలెన్స్ నేషనల్ అవార్డు-2024 లభించింది. విద్యారంగంలో ఆయన చేస్తున్న కృషికి ఫిలాంత్రాఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ అవార్డుకు ఎంపిక చేశాయి.

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: గురువారం ఉ.10- 11.30 వరకు నయాఖిల్లా, జిన్సీ బజోర్, తకత్బౌలి, రాఘవమ్మ కంచ, హీరా ఖాన్ 1,2, మోతీ మోహల్, ఖాజీ గల్లి. ఉ.11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కటోరా హౌస్, గోల్కొండ రాణా దిల్వర్షా నగర్, రిసాలా బజార్. మ.3-సా.4.30 బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, మేరాజ్ కాలనీ, ఐఏఎస్ కాలనీ, చోటా జానకి నగర్, బక్తావర్ గూడ, జానకి నగర్, పారామౌంట్, ఎంసీహెచ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని సీబీడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు, వారి నుంచి సలహాలు సూచనలు స్వీకరించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజరు బీఏకే మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ అభిప్రాయాలు, సూచనలను ఉదయం 10గంటల నుంచి 11 వరకు 9959226133 ఫోన్ నంబరులో తెలియజేయాలని కోరారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ

నాంపల్లి, న్యూస్‌టుడే: నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై 29న రాష్ట్రవ్యాప్త బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జమా అతే ఇస్లామీహింద్ క్యాంపెయిన్ కన్వీనర్ డాక్టర్ అస్రా ముహ్సినా పేర్కొన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వేదికగా జరిగే ఈ సభకు ఎంపీ కడియం కావ్య రానున్నట్లు వెల్లడించారు. సమాజంలో మానవతా విలువలు పెంపొందించేలా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, పేర్కొన్నారు. కళాశాలల్లో, స్కూళ్లలో వాటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని వెల్లడించారు.

మెహిదీపట్నం రైతుబజార్‌లో కూరగాయల ధరలు

మెహిదీపట్నం: (బుధవారం నాటి ధరలు, కిలో రూ.లో)టమాటా 43, వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజీ 21, బీన్స్ 55, క్యారెట్ 43, దొండ 35, చిక్కుడుకాయ 50, గోకరకాయ 23, బీట్‌రూట్ 258 క్యాప్సికం 70, ఆలుగడ్డ 37, కీర 26, దోసకాయ 21, సొరకాయ 19, పొట్లకాయ 23, ఉల్లిగడ్డ 50, చామగడ్డ 35

ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలు చేపట్టాలని వినతి



జియాగూడ, న్యూస్‌టుడే: ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీలు త్వరగా చేపట్టేలా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు తెలంగాణ ఉద్యోగుల కుటుంబీకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం నాంపల్లిలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎమ్.హుస్సేనీ (ముజీబ్)కు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీలకు అంగీకరించాయని ఆందోళన చెందవద్దని సూచించారు.

భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: లలితాబాగ్ డివిజన్‌లోని ఉప్పుగూడ జండా వద్ద బుధవారం భాజపా సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి రామకృష్ణ ప్రారంభించారు. భాజపా కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను వివరించి, పలువురిని పార్టీలో చేర్పించారు. భాజపా సీనియర్ నాయకుడు మాదరి చంద్రశేఖర్, నియోజకవర్గ కన్వీనర్ పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

సుల్తాన్‌బజార్,న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్ల, ప్రజావ్యతిరేక విధానాలు విడనాడి సమస్యలను పరిష్కరించాలని, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) డిమాండ్ చేసింది. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్‌సీసీపీఏ) పిలుపు మేరకు బుధవారం కోఠిలోని కేంద్రీయ సదన్ వద్ద ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా టీఏపీఆర్‌పీఏ నాయకులు సోమయ్య, వి.కృష్ణమోహన్, ఎం.ఎస్.రెడ్డి, ప్రభాకర్ నాయర్, నారాయణరెడ్డి, డా.అరుణ తదితరులు మాట్లాడారు. ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై కేంద్రంపై ఒత్తిడి తెచ్చే విధంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. తమ సమస్యలపై ఎంపీలు, రాజ్యసభ సభ్యులను కలిసి వివరిస్తారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే 8వ వేతన కార్యనిర్వాహక సంఘం నియమించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎన్‌పీఎస్, యూపీఎస్, పీఎఫ్‌ఆర్‌డీఏ బిల్లులను రద్దు చేయాలని, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని, కోరారు. ఆయా సంఘాల నాయకులు రామచంద్రుడు, బ్రహ్మాచారి, రాజశేఖర్‌రెడ్డి, సుధావన్, వెంకయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సోమయ్య

ప్రారంభమైన కబడ్డీ, ఖోఖో పోటీలు



అభినందిస్తున్న డీఈఓ ఆర్.రోహిణి



క్రీడాకారుల విన్యాసాలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (హెచ్‌డీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఇంటర్ గోల్కొండ జోన్ లెవెల్ స్కూల్ కబడ్డీ, ఖోఖో అండర్ 14, 17 (బాలురు, బాలికలు) టోర్నమెంట్ బుధవారం రెడ్‌హిల్స్‌లోని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్‌లో ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి, హెచ్‌డీఎస్‌జీఎఫ్ అధ్యక్షురాలు ఆర్.రోహిణి హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గోల్కొండ జోన్ ఉప విద్యాధికారి సీహెచ్.వి.రమణ రాజు, నిలోఫర్ కెఫే వ్యవస్థాపకుడు బాబురావు, డాక్టర్ ఫ్లోరి తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బండ్లగూడ జోన్ స్థాయి కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ బుధవారం షంషీర్‌గంజ్ శారదా విద్యాలయ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను బండ్లగూడ జోన్ ఉపవిద్యాశాఖాధికారి డి.ఆదిత్య వర్ధన్ రాజు ప్రారంభించారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెపొందించడానికి హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఈ టోర్నమెంట్ నిర్వహిస్తుందన్నారు. శారీరక వ్యాయామం, మానసికోల్లాసం కోసం చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మూడు రోజుల పాటు క్రీడలు కొనసాగుతాయని హెచ్‌డీఎస్‌జీఎఫ్ బండ్లగూడ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇ.శ్రీనునాయక్ తెలిపారు. మండల డిప్యూటీ ఐఓఎస్‌లు లక్ష్మణ్‌సింగ, దశరథ్, పాఠశాల ప్రిన్సిపల్ సీమ, ట్రస్మా ప్రతినిధులు అఫ్సర్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో విద్యార్థుల సత్తా

నారాయణగూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ (హెచ్‌డీఎస్‌పీఎఫ్) ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కోసం పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి కరాటే బాలలు (14 నుంచి 17 సంవత్సరాలు) పాల్గొని తమ సత్తాను చాటుకున్నారు. టోర్నమెంట్‌ను నిర్వాహకులు నర్సింగ్‌రావు, టెక్నికల్ చీఫ్ సెన్సీ రమేష్‌గౌడ్ పర్యవేక్షించారు. సుజాత హైస్కూల్ (అబిడ్స్) విద్యార్థి కందూరి రోషన్ బంగారు, సోమాజిగూడ సెయింట్ ఆండ్రూస్ హైస్కూల్‌కు చెందిన షేక్ అబ్దుల్ కాంస్య పతకాలు సాధించారు.

చెత్త తరలింపు

ఈనాడు కథనానికి స్పందన

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: 'చెత్త కుప్పలు.. ప్రజలకు తిప్పలు' అనే శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పదించారు. మెహిదీపట్నం సర్కిల్ పరిధిలో పేరుకుపోయిన చెత్త కుప్పలను సంబంధిత పారిశుద్ధ్య విభాగం అధికారులు శుభ్రం చేశారు.

శాట్స్ నాలుగో తరగతి సిబ్బంది కొత్త కమిటీ ఎన్నిక



నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) నాలుగో తరగతి సిబ్బంది నూతన కమిటీ అధ్యక్షుడిగా డి.శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా ఆండాలు శ్రీనివాస్, కోశాధికారి ఎస్.సునీల్ కుమార్ ఎన్నికయ్యారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సుదీర్ఘకాలంగా అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఎం.అంజయ్య 30న ఉద్యోగ విరమణ చేయనున్నట్లు తెలిపారు. మిగితా పదవులు త్వరలోనే నియమిస్తామని, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్యవర్గం ప్రకటించింది.

పోలీసులకు ఉద్యోగ విరమణ రోజే ప్రయోజనాలు ఇవ్వాలి



అభివాదం చేస్తున్న సంఘం నేతలు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పోలీసులకు ఉద్యోగ విరమణ రోజే ప్రయోజనాలు అందచేయాలని తెలంగాణ విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ఎం.రాజమల్లారెడ్డి, కోశాధికారి ఎస్పీ కాశీంపీరా, ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, దేవేందర్‌రెడ్డి, సుదర్శన్ రాజు తదితరులు పాల్గొని మాట్లాడారు. అధికార లాంఛనాలతో పోలీసులను ఇంటికి పంపించాలని గతంలో ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత పోలీసు అధికారుల ఆరోగ్య భీమాను రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని కోరారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయకు నివాళులు



గన్‌ఫౌండ్రి, నారాయణగూడ, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఘనంగా నివాళులర్పించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్‌తో పాటు పలువురు నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● గన్‌ఫౌండ్రి డివిజన్ భాజపా ఆధ్వర్యంలో కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో రక్తదాన కార్యక్రమాన్ని ఆసుపత్రి సుపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ సమక్షంలో చేపట్టారు. భాజపా కార్యకర్తలు, నాయకులు నితిన్, సోనుసింగ్, సురేందర్‌శర్మ తదితరులు రక్తదానం చేశారు.

నియంత్రికను పరిశీలించిన విద్యుత్తు అధికారులు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: జహానుమా హనుమాన్ మందిర్ ప్రహరీ గోడ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్తు నియంత్రికను, సంభాన్ని అక్కడి నుంచి తొలగించి, సమీపంలో ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆశీష్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గోడ నిర్మాణానికి రూ.8 లక్షల నిధులు మంజూరైనా అవి అడ్డుగా ఉండడంతో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. దీంతో విద్యుత్తు సంస్థ మీరాలం సబ్‌డివిజన్ ఏడీఈ వెంకటేశ్, ఏఈ శ్రీనివాస్, బుధవారం వాటిని పరిశీలించారు త్వరలో మరో చోటుకు మారుస్తామని అధికారులు తమకు హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నాంపల్లి: రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నాంపల్లి రైల్వే పోలీసుల కథనం ప్రకారం... మంగళవారం ఫతేనగర్- సనత్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తుతెలియని వ్యక్తి(30) వేగంగా దూసుకువస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (నెం.12794) కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తాలూకు వివరాలు మృతికి కారణాలు ఇంకా తెలియరాలేదు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తికి జైలు

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: యువతిని వేధిస్తున్న వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కథనం ప్రకారం... గోల్కొండ నివాసి సర్ఫాజ్ ఖాన్ చిరు వ్యాపారం చేస్తుంటాడు. హబీబ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతిని కొంత కాలంగా వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, నాంపల్లిలోని 2వ ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 5 రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎం.స్వామి తీర్పు చెప్పారు.

మద్యం అక్రమ విక్రయం.. నిందితుడి అరెస్టు

చార్మినార్, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం అమ్ముతున్న దుకాణంపై బుధవారం దక్షిణ మండలం టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్సు అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. పురానాపూల్‌కి చెందిన నౌకటు వాలే నితీశ్ అక్రమంగా మద్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగమని నమ్మించి మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఉద్యోగాల కోసం పెట్టుబడులు పెట్టాలని నమ్మించి రూ.1.26 లక్షలు కొట్టేశారని బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... నగరానికి చెందిన ఓ విద్యార్థికి ఉద్యోగం ఉందని లాభాలు వస్తాయని ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. లింక్‌తో కూడిన సందేశాన్ని పంపించగా విద్యార్థి వెంటనే క్లిక్ చేసి, అందులో దరఖాస్తు చేసుకున్నాడు. రోజుకు లక్ష రూపాయల ఆదాయం వస్తుందనే హామీతో ఆగ్రోకెమికల్ కార్యక్రమంలో పెట్టుబడి పెట్టడం మొదలుపెట్టాడు. రూ.500తో మొదలు పెట్టి క్రమంగా పెంచుకుంటూ రూ.1.26 లక్షలు ఆన్‌లైన్ బదిలీ చేశాడు. ఆతర్వాత ఆ యాప్‌ను మూసివేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని..

నారాయణగూడ, న్యూస్‌టుడే: కొత్త క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని నమ్మించి రూ.1.15 లక్షలు దోచేశారంటూ ఓ బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... మహిళకు యాక్సిస్ ఇండియన్ అయిల్ క్రెడిట్ కార్డు పేరుతో కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఫోన్ వచ్చింది. ఆగంతుకుడు అప్లికేషన్ లింక్‌ను వాట్సాప్ ద్వారా పంపించాడు. ఆమె దగ్గరున్న క్రెడిట్ కార్డుల గురించి అన్ని వివరాలు మోసగాడితో చెప్పింది. కొన్ని నిమిషాల్లోనే ఆమె కార్డు నుంచి రూ.1.15 లక్షలు మరో ఖాతాకు బదిలీ అయినట్లు సందేశం వచ్చింది. బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆయిల్‌పామ్ సాగుతో అన్నదాతలకు లబ్ధి: ఎమ్మెల్యే



నాగర్‌గూడలో మొక్కను నాటుతున్న కాలె యాదయ్య, నాయకులు, అధికారులు

షాబాద్, న్యూస్‌టుడే: ఆయిల్ పామ్ సాగుతో అన్నదాతలు అధిక లబ్ధి పొందుతారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయ సమీపంలో ఆయిల్ పామ్ మొక్కల సాగును బుధవారం ఆయన ప్రారంభించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు పండ్ల తోటల సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంల మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో అపర్ణ, ఉద్యానశాఖ అధికారులు, రైతులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్

• రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

లోపాలకు తావు లేకుండా ఓటరు సర్వే



కమ్మెటలో ఇంటింటి పరిశీలనలో ఆర్డీఓ సాయిరాం, తహసీల్దారు కృష్ణయ్య

చేవెళ్ల, న్యూస్‌టుడే: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పక్కాగా రూపొందించాలని ఆర్డీఓ సాయిరాం ఆదేశించారు. బుధవారం కమ్మెట గ్రామంలో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను తహసీల్దారు కృష్ణయ్యతో కలిసి పరిశీలించారు. లోపాలకు తావులేకుండా సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని, ఒక కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే వార్డులో ఉండేలా చూడాలన్నారు. ఒకరి పేరు మీద ఒకటి కంటే ఎక్కువ ఓట్లు నమోదై ఉంటే నోటీసులు ఇచ్చి తొలగించాలన్నారు. జాబితా తప్పులు లేకుండా తయారు చేసేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీఓ కోరారు.

సంక్షిప్త సమాచారం

కొందుర్గు ఎంఈవోగా గాయత్రీదేవి



కొందుర్గు, న్యూస్‌టుడే: కొందుర్గు ఎంఈవో కిష్టారెడ్డి బదిలీ కావడంతో ముట్పూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న గాయత్రీదేవిని ఆ స్థానంలో నియమించారు. బుధవారం ఎంఆర్సీ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు.

నేడు సహకార సంఘం సమావేశం

షాద్‌నగర్ న్యూటౌన్: షాద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు దారమోని బక్కన్నయాదవ్ తెలిపారు. సంఘం భవన ఆవరణలో జరుగుతుందని పేర్కొన్నారు.

మహాలక్ష్మి ధ్రువీకరణ పత్రాల పంపిణీ

నందిగామ: నందిగామ మండలం నర్సప్పగూడలో మహాలక్ష్మి (వంట గ్యాస్ రాయితీ) ధ్రువీకరణ పత్రాలను మాజీ సర్పంచి కావలికృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగ నర్సింహులుయాదవ్ బుధవారం పంపిణీ చేశారు.

రెవెన్యూ శాఖకు మార్చాలని వినతి

కొందుర్గు: వీఆర్‌ఏలుగా విధులు నిర్వహించిన 1266 మందిని గతంలో మున్సిపల్ శాఖకు బదిలీ చేశారని, తమను తిరిగి మాతృశాఖకు మార్చాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు పూర్వ వీఆర్‌ఏలు బుధవారం నాయబ్ తహసీల్దార్ రాకేశ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆ రీనా కుమారి, వాణి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మాజీ ఉప ఎంపీటీసీ చేయూత

కొందుర్గు: విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం ఆనందంగా ఉందని బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటలక్ష్మి అన్నారు. గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్ సమకూర్చిన రూ.9 వేల గౌరవ వేతనాన్ని బడిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు విద్యా వాలంటీర్లకు ఆయన అందజేసి మాట్లాడారు.

పేద విద్యార్థుల చదువులకు తోడ్పాటు

చేవెళ్ల: కౌకుంట్ల ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 40 మందికి గ్రామానికి చెందిన అబ్దుల్ ఇనాయత్ బుధవారం నోటు పుస్తకాలు, కలాలు, పలకలు ఇతర స్టడీ మెటీరియల్ అందజేశారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆర్పీ పట్నాయక్

షాద్‌నగర్ న్యూటౌన్: షాద్‌నగర్ పురపాలిక పెద్దజానంపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని బుధవారం సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్ దంపతులు దర్శించుకున్నారు. ఈ ఆలయం చరిత్రాత్మక విశిష్టత కలిగి ఉందని తెలిసి వచ్చానని పట్నాయక్ తెలిపారు.

రామన్నగూడను మున్సిపాలిటీలో కలపొద్దు

చేవెళ్ల, న్యూస్‌టుడే: ప్రతిపాదిత చేవెళ్ల మున్సిపాలిటీలో రామన్నగూడ గ్రామాన్ని చేర్చొద్దని భాజపా నాయకుడు పెద్దోళ్ల కృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మున్సిపాలిటీలో విలీనం వల్ల ప్రజలపై పన్నుల భారం పెరుగుతుందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే అధికారులు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

'అమలుకు నోచని కార్మిక చట్టాలు'

కాటేదాన్: రాష్ట్రంలోని 90 శాతం పరిశ్రమల్లో కార్మిక చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని, 12 గంటల పని విధానంపై అధికారులు దృష్టి సారించడం లేదని సీఐటీయూ తెలంగాణ ఉపాధ్యక్షులు భూపాల్ విమర్శించారు. బుధవారం కాటేదాన్ పారిశ్రామికవాడలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ప్రభుత్వం కార్మికులకు మోసం చేసిందన్నారు. ఇప్పుడున్న సర్కారు కార్మికుల చట్టాలు అమలు చేయాలని లేకుంటే నిరసనలు తప్పవని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జి.కురుమయ్య, కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు రుద్రకుమార్ పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు: భాజపా

శంషాబాద్, న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదు అధిష్ఠానం నిర్దేశించిన లక్ష్యానికి మించి చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని భాజపా జిల్లా అధ్యక్షుడు బొక్కా నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శంషాబాద్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు కె.దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్ద సంఖ్యలో యువతకు సభ్యత్వం ఇచ్చేలా కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.ప్రేమ్‌రాజ్, వై.శ్రీధర్, శంకరప్ప, మహిపాల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం

రాజేంద్రనగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), రోటరీ క్లబ్, ఎన్ఎంజే క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రిజిస్ట్రార్ ప్రారంభించి మాట్లాడుతూ... ఆపద సమయంలో రక్తం లభించిక చాలా మంది ఇబ్బందులు పడుతుంటారన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. డాక్టర్ జె.సత్యనారాయణ, రోటరీ క్లబ్ ఛైర్మన్ రామ్‌ప్రసాద్, డాక్టర్ ఆర్.జగదీశ్వర్, అసోసియేట్ డీన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి, డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియం... నెరవేరని లక్ష్యం

- గ్రామాల్లో ఎక్కడా కానరాని ఎరువు తయారీ
- అలంకారప్రాయంగా షెడ్లు

న్యూస్‌టుడే, చేవెళ్ల గ్రామీణ



చేవెళ్లలో నిర్మించినది ఇలా ఖాళీగా ..

సేంద్రియ ఎరువుల తయారీ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా ఉండటంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. చేవెళ్ల డివిజన్ వ్యాప్తంగా తడి, పొడి చెత్త సేకరణ ప్రక్రియ తూతూమంత్రంగా సాగుతోంది. సేకరించిన వ్యర్థాలనూ కుప్పలుగా పోస్తూ ఎరువు తయారీ అంశాన్ని పూర్తిగా వదిలేశారు. డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 132 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చేవెళ్ల మండలంలో 37 ఉండగా.. ప్రతి గ్రామంలో షెడ్లు నిర్మించడం జరిగింది. కేవలం మండలంలోని ఒకటి రెండు గ్రామాల్లో మాత్రమే వీటిని ఉపయోగిస్తున్నారు. మిగతా చోట్ల ఎరువు తయారీ ఊసే లేదు. జిల్లాలో ప్రతి గ్రామానికి ఒకటి చొప్పున 556 షెడ్లను నిర్మించారు. ఉపాధి హామీ నిధుల నుంచి ఒక్కో షెడ్డుకు రూ.2.40 లక్షలు ఇందుకోసం ఖర్చు చేశారు. సేకరించిన తడి చెత్తను షెడ్డులో నిర్మించిన ఛాంబర్లలో వేసి.. గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బంది ద్వారా ఎరువు తయారు చేయించాలి. ఈ ప్రక్రియ జిల్లాలో ఎక్కడా జరగడం లేదు. ఇంటింటి నుంచి తీసుకెళ్లిన చెత్తాచెదారాన్ని కార్మికులు షెడ్డు వద్ద కుప్పలుగా పోసి చేతులు దులుపుకుంటున్నారు.

ఎప్పటిలాగే... పర్యావరణ పరిరక్షణ, రైతులు ఆర్థికంగా బలోపేతం కావడం, సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీకి ఈ షెడ్లను అందుబాటులోకి తెచ్చింది. అయినప్పటికీ ఆ ప్రక్రియ నీరుగారిపోవడంతో రైతులు ఎప్పటిలాగానే కృత్రిమ ఎరువులను కొనుగోలుచేసి పొలాల్లో చల్లుకొంటున్నారు. ప్రభుత్వం ఆశించిన విధంగా గ్రామాల్లో ఎరువు తయారైతే అవసరమైన రైతులకు ఉచితంగా అందేది. గ్రామ పంచాయతీ అధికారుల తీరుతో షెడ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు లాభపడ్డారు మినహా.. రైతులకు ప్రయోజనం కలగలేదు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330
శంకర్‌పల్లి : 8008573266
షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353

నందిగామ, చేవెళ్ల, రాజేంద్రనగర్, న్యూస్‌టుడే

? నందిగామ మండల కేంద్రం నుంచి వీర్లపల్లికి వెళ్లే రహదారిలో వాగుపై వంతెన లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – శ్రీనివాస్, వీర్లపల్లి

✓ ఆ మార్గంలో వంతెన నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందించాం. మంజూరు కావాల్సి ఉంది. అందుకనే రహదారి పనులు కొంతమేర నిలిపివేశాం.–హేమంత్, పంచాయతీరాజ్ ఏఈ, నందిగామ

? చేవెళ్ల పట్టణంలో రాత్రి సమయంలో కరెంటు సరఫరా నిలిపేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్‌శాఖ సిబ్బందికి సమస్య విన్నవించినా స్పందించడం లేదు. –శ్రీనివాస్, చేవెళ్ల

✓ వర్షం పడినప్పుడు కరెంటు సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వినియోగదారులు సమస్య చెప్పిన వెంటనే స్పందించి సిబ్బందిని పంపి సరఫరా పునరుద్ధరిస్తున్నాం. –స్వామి, డీఈ

? ఉప్పర్‌పల్లి చిన్నతాళ్లకుంట పార్కులో సాయంత్రం నుంచి రాత్రి వరకు కొందరు యువకులు ప్రతిరోజు గొడవ పడుతున్నారు. గంజాయి తాగుతున్నారు. సాయంత్రం నడకకు వచ్చేవారికి ఇబ్బందిగా ఉంది. – బాలకృష్ణ, ఉప్పర్‌పల్లి

✓ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. –క్యాస్ట్రో, ఇన్‌స్పెక్టర్, రాజేంద్రనగర్

చెరువు నాలాపై ఆక్రమణ తొలగింపు

మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదుకు స్పందించిన ఎమ్మెల్యే



తటాకానికి నీరు చేరేందుకు అడ్డుగా ఉన్న ప్రహరీ పొక్లెయిన్‌తో కూల్చివేత

షాద్‌నగర్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే చొరవ.. ఎమ్మెల్యే చిత్తశుద్ధితో చెరువుకు నీరందించే నాలాకు కబ్జా కోరల నుంచి విముక్తి లభించింది. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ శివారులో పాటు కాలువను ఆక్రమించి ఓ వ్యక్తి ప్రహరీ నిర్మించారు. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేరుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హైడ్రా తరహాలో అడుగు ముందుకేసిన ఎమ్మెల్యే నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ యంత్రాంగాన్ని రంగంలోకి దించి, మంగళ, బుధవారాల్లో ప్రహరీని కూల్చివేయించారు. గ్రామ శివారులో పాటు గొలుసుకట్టు చెరువుల్లో వీరమోని చెరువు ఒకటి. ఈ జలవనరు నిండి అలుగు పారితే ఆ కింద ఇతర చెరువులోకి చేరుతుంది. అయితే ఆయకట్టు కలిగిన పాటుకాలువను అడ్డంగా ప్రహరీ నిర్మించడంతో నీరంతా ఒకవైపుకే చేరి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఎమ్మెల్యేను సత్కరించిన రైతులు

షాద్‌నగర్: పాడిని నమ్ముకున్న రైతులకు ఉపాధిని అందించే విజయ డెయిరీని గత ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు రూ.50కోట్లు విడుదల చేసిన క్రమంలో షాద్‌నగర్ పాలశీతల కేంద్రంలో డెయిరీ నిర్వాహకుల ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యేను సత్కరించారు. డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ శివాల్కర్‌యాదవ్, మేనేజర్ సురేష్, అధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఛైర్మన్ నరేందర్ తదితరులు

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. మణికొండ వైస్రాయ్ కాలనీలో ఓపెన్‌జిమ్‌ను, ఎంప్లాయిస్‌కాలనీలో కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తును, ఇదే కాలనీలో రూ.42 లక్షలతో కొనుగోలు చేసిన బంకెట్ మౌంటెడ్ క్రేన్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. హనుమాన్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు, 17వ వార్డు గోల్డెన్ టెంపుల్ నుంచి వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ వరకు బీటీ రోడ్ నిర్మాణ పనులకు, వట్టి నాగులపల్లిలో ఏర్పాటు చేయనున్న కంపోస్ట్ షెడ్, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. హామీలన్నింటిని దశలవారీగా నెరవేరుస్తున్నామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

శంషాబాద్: స్వచ్ఛతా హీ సేవాలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కోరారు. బుధవారం అమ్మపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాలనాధికారి శశాంకతో కలిసి పాల్గొన్నారు. ఆలయంలో పూజలు చేసి ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎంపీడీవో మున్నీ పాల్గొన్నారు.

ఎరువులు సిద్ధంగా ఉంచుతాం

నందిగామ: రైతుల అవసర నిమిత్తం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు తీసుకోవాలని పీఏసీఎస్ ఛైర్మన్ గొర్లపల్లి అశోక్ అన్నారు. చేగూరు పీఏసీఎస్‌లో మహాజన సభ బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సాగుకు ఇబ్బందులు లేకుండా ఎరువులు సిద్ధంగా ఉంచుతామన్నారు. రూ. 8.6 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. సబ్‌డివిజనల్ అధికారి సరస్వతి, సీఈఓ వెంకటయ్య, వైస్‌ఛైర్మన్ మధుసూదన్,డైరెక్టర్లు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి..షాద్‌నగర్‌లో నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూసంస్థల ప్రతినిధులు

షాద్‌నగర్ న్యూటౌన్: ఆధ్యాత్మికులకు ఆలయాల్లో ప్రాధాన్యం ఇచ్చి హిందూధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా కీర్తిని ఇనుమడింపజేయాల్సిన ప్రభుత్వాలు కుట్రలు చేసిందని విశ్వహిందూపరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రముఖ్ బండారి రమేష్ ఆరోపించారు. తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించడాన్ని నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో హిందూసంస్థల సభ్యులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యకూడలిలో మానవహారం, రాస్తారోకో అనంతరం జరిగిన సమావేశంలో రమేష్‌తో పాటు భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, నాయకులు చెట్ల వెంకటేష్ తదితరులు మాట్లాడారు. తిరుమల లడ్డూను ప్రపంచవ్యాప్తంగా ఎంతో పవిత్రంగా భావిస్తారని, అలాంటి ప్రసాదాన్ని అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత



ప్రభుత్వ కళాశాలలో పారిశుద్ధ్య కార్యక్రమంలో వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ కింద బుధవారం పిచ్చిమొక్కలను తొలగించి, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పురపాలిక ఛైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, ప్రిన్సిపల్ సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ◆ షాద్‌నగర్ అగ్నిమాపక కేంద్రంలో నూతన ఫైరింజన్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

బండ్లగూడజాగీర్: స్వచ్ఛతపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. స్వచ్ఛతాహీసేవా-2024లో భాగంగా బుధవారం హైదర్షాకోట్‌లోని ఎస్ఎంపీ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు తడి, పొడి, హానికారక చెత్తపై అవగాహన కల్పించారు. ఇంటి వద్ద చెత్తను వేరు చేసే విధానంపై కుటుంబీకులకు విద్యార్థులు వివరించాలని సూచించారు. పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లేడు చౌదరిగూడెం: మండలంలోని గాలిగూడలో స్వచ్ఛతా హీ సేవాపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ విద్యార్థులతో చేయించారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అందరూ ముందుకు రావాలన్నారు. మాజీ సర్పంచి యాదయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొందుర్గు: పరిశుభ్రతతో గ్రామాలు కళకళలాడాలని కొందుర్గు ప్రత్యేకాధికారి రియాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వచ్ఛతా హీసేవ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ... తాగునీటి సమస్యలు, సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు జాగ్రతలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో అనురాధ, కార్యదర్శులు పాల్గొన్నారు.



బండ్లగూడ జాగీర్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

నార్సింగి: నార్సింగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం మున్సిపాలిటీ సిబ్బంది స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు పాఠశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. 'ఎస్‌హెచ్‌ఎస్ 2024 నార్సింగి' ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ కృపావరం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల బుక్‌కీపర్ ఆత్మహత్యాయత్నం

అధికారుల తీరే కారణమని భర్త ఆరోపణ

జిల్లేడు చౌదరిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జాకారంలో డ్వాక్రా సంఘాల బుక్ కీపర్ స్వప్న ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నా జీతం చెల్లింపు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమె.. మహిళా సమాఖ్య ఏపీఎం నరసింహ, సీసీ స్వర్ణలతలపై అడిషనల్ పీడీ సూర్యారావుకు ఫిర్యాదు చేసింది. దీంతో కోపం పెంచుకున్న వారిద్దరు మందలించడంతో బుధవారం పురుగుల మందు తాగిందని భర్త నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఈ విషయమై ఏపీఎంను వివరణ కోరేందుకు 'న్యూస్‌టుడే' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నందిగామలో విద్యుదాఘాతంలో కార్మికుడి మృతి

నందిగామ: విద్యుదాఘాతంలో కార్మికుడు మృతి చెందిన సంఘటన నందిగామ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అబ్దుల్ షాకీర్(40) నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న షెడ్డులో వెల్డింగ్ పనిచేస్తుండగా విద్యుదాఘాతాని గురై కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడిపై దాడి.. ఐదుగురిపై కేసు

శంషాబాద్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నరసింహపై దాడి చేసిన ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు శంషాబాద్ పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 24న తన కారులో స్వగ్రామానికి వెళుతుండగా.. జిమ్ ఆసుపత్రి వద్ద అదే గ్రామానికి చెందిన కత్తుల జనార్దన్, పెంజర్ల అరుణ్, కత్తుల రేణుబాబు, కత్తుల సాయివర్ధన్ కారును అడ్డగించారు. అసభ్యపదజాలంతో దూషించడమే కాకుండా కర్రలు, రాళ్లతో వాహనాన్ని ధ్వంసం చేసి పరారయ్యారు. జూపల్లి జగపతిరావు ప్రోద్బలంతోనే దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాస్లాబాద్‌లో అక్రమ మద్యం పట్టివేత

జిల్లేడు చౌదరిగూడెం: మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో ఆటోలో తరలిస్తున్న 36 బీరు బాటిళ్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. లాల్పహాడ్‌లోని దుకాణం నుంచి బెల్టు షాపునకు తీసుకెళుతుండగా, స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై కె.విజయ్ పేర్కొన్నారు.

మూడేళ్ల కుమార్తెతో తల్లి అదృశ్యం

శంషాబాద్: శంషాబాద్ మండల పరిధిలో ఓ తల్లీకుమార్తె అదృశ్యమైయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. కుమార్తె(3)తో కలిసి ఇంటి వద్ద ఉంటున్న వివాహిత(24) ఈ నెల 20న ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త ఫిర్యాదుతో బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోతలతో గుంతలు.. వాహనదారుల తంటాలు



కొత్తూరు నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి అంచులు వర్షాలకు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు రోడ్డు దిగేందుకు ఇబ్బందిగా మారింది. పల్లపు ప్రాంతాల్లో ఇసుకమేట వేసి ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. – న్యూస్‌టుడే, కొత్తూరు

తొండుపల్లి పైవంతెనపై రాకపోకలు షురూ



శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ మున్సిపల్ పరిధి తొండుపల్లిలో జాతీయ రహదారిపై 2021లో చేపట్టిన పైవంతెన నిర్మాణం అధికారులు నాలుగేళ్లకు పూర్తి చేశారు. రూ.19 కోట్లతో 1.01 కిలోమీటర్ల ఈ పైవంతెన నిర్మాణాన్ని 2022లో పూర్తి చేయల్సి ఉన్నా... అధికారుల ఉదాసీనత, గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా పనులు ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో సర్వీస్ రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు నరకయాతన అనుభవించారు. కిలోమీటరు దూరం ప్రయాణానికి 40 నిమిషాలు ట్రాఫిక్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ అంశంపై 'ఈనాడు' వరుస కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో గుత్తేదారు పనుల్లో వేగం పెంచారు. ఎట్టకేలకు నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం నుంచి వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతించారు. నాలుగేళ్లుగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు, స్థానికులకు ఊరట లభించింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో హెప్జిబా

షాబాద్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీవో హెప్జిబా అన్నారు. షాబాద్‌లో అంగన్వాడీ సిబ్బంది నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు తాజా ఆకు కూరలు, పాలు, గుడ్లతో పాటు తృణధాన్యాలను ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో అపర్ణ, ఏపీవో వీరాసింగ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాటేదాన్: బిడ్డకు తల్లి పాలే శ్రేష్ఠమని సీడీపీఓ కవిత పేర్కొన్నారు. మైలార్‌దేవుపల్లి పద్మశాలిపురంలోని రామకృష్ణమఠంలో పోషణ మాసం సందర్భంగా బుధవారం అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులు, దివ్యాంగ పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులను నమ్మి వచ్చేవారికి నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకురావాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు, మందులు అందుబాటులో ఉన్నాయా, లేదా అడిగి తెలుసుకున్నారు. వైద్యపరీక్షలకు సంబంధించిన ల్యాబ్‌లను పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలన పాటించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎలాంటి మందుల కొరత ఉన్నా వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో పోలీసుల విస్తృత తనిఖీలు

కొత్తూరు, న్యూస్‌టుడే : కొత్తూరు పురపాలికలో బుధవారం రాత్రి కిరాణా దుకాణాలు, హోటళ్లు, లాడ్జీల్లో పోలీసులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో కొత్తూరు, నందిగామ ఇన్‌స్పెక్టర్లు నరసింహారావు, ప్రసాద్, 70 మంది కానిస్టేబుళ్లు తనిఖీల్లో పాల్గొన్నారు. పలు దుకాణాల్లో నిషేధిత గుట్కాలు, బెల్టు షాపుల్లో మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి



హైదర్‌గూడ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

రాజేంద్రనగర్: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం రాజేంద్రనగర్, హైదర్‌గూడ చౌరస్తాల్లో భాజపా నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజేంద్రనగర్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ముఖ్య అతిథిగా, హైదర్‌గూడలో పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి మల్లారెడ్డి పాల్గొన్నారు. భాజపా నాయకులు విజయ్, బాబురావు, వేణు, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ న్యూటౌన్: అఖండ భారత్ నిర్మాణమే ధ్యేయంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అడుగులు వేశారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య అన్నారు. పార్టీ షాద్‌నగర్‌శాఖ కార్యాలయంలో బుధవారం దీన్‌దయాళ్ జయంతి కార్యక్రమంలో వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

ఆయిల్‌పామ్ తోటలతో అధిక లాభాలు


చెల్లంపల్లిలో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: రైతులు ఆయిల్‌పామ్ తోటలతో అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం చెల్లంపల్లి గ్రామంలో రైతు శేఖర్ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేష్, ఏడీహెచ్ కృష్ణారావు, ఏడీఏ ఆదిలక్ష్మి, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ ముంతాజ్, రైతులు పాల్గొన్నారు.

కందుకూరు, న్యూస్‌టుడే: అయిల్ పామ్‌కు సాగుకు రైతులు ముందుకు రావాలని ఉద్యానశాఖ ఏడీ కిషన్‌రావు అన్నారు. బుధవారం మీర్ ఖాన్‌పేటలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, హెచ్ఓ సౌమ్య, ఏపీఓ రవీందర్‌రెడ్డి, ఏఈఓ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు మోక్షం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: అల్కాపురి కాలనీ రోడ్డు నం-1లో మురుగు పొంగుతోందని.. మేమున్నాం మీకు తోడుగా శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జలమండలి మేనేజర్ సురేష్ స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరించారు.

నిమజ్జన వ్యర్థాల తొలగింపు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రి ఉత్సవాల అనంతరం ఇబ్రహీంపట్నం సమీపంలోని శేరిగూడ, తట్టిఖానా చెక్‌డ్యాంల వద్ద నిమజ్జనాలు చేశారు. చెక్‌డ్యాం వద్ద వ్యర్థాలు వదిలేశారు. పేరుకు పోయిన నిమజ్జన వ్యర్థాలపై ఈనెల 21న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి కమిషనర్ రవీంద్రసాగర్, ఛైర్మన్ కప్పరి స్రవంతి స్పందించారు. సిబ్బందిని పంపించి ఆ ప్రాంతాలను శుభ్రం చేయించారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

మహేశ్వరం, ఆమనగల్లు: కొళ్లపడకల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కస్నానాయక్ మహేశ్వరం మండల విద్యాధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పీఆర్టీయూ మండల సంఘ అధ్యక్షులు జానకిరామ్, గౌరవ అధ్యక్షులు వి.ఎల్.ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జంగయ్య సన్మానించారు. ఆమనగల్లు ఎంఈవోగా పగిడిపాల పాండు బుధవారం బాధ్యతలు చేపట్టారు.

అయిదు భవనాల సీజ్

పెద్దఅంబర్‌పేట్, న్యూస్‌టుడే: కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి జరుగుతున్న 5 నిర్మాణాలను బుధవారం పెద్దఅంబర్‌పేట్ పురపాలిక అధికారులు సీజ్ చేశారు. కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

యునాని పరిశోధన కేంద్రంలో జాతీయ సదస్సు నేడు, రేపు

వెంగళ్‌రావునగర్: ఎర్రగడ్డలోని యునాని పరిశోధన కేంద్రం ఆడిటోరియంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ ఆధ్వర్యంలో రీసెర్చ్ (యూనాని) సైంటిస్ట్ లెవల్-1 కోసం మెథడాలజీ, హెచ్ఆర్‌డీ కోర్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లపై 'ఏషన్ కమ్ ఇండక్షన్' పేరిట గురు, శుక్రవారాల్లో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు.

సమీకృత మార్కెట్లు.. సాకారమెప్పుడు?

మహేశ్వరం, బాలాపూర్, మీర్‌పేట, న్యూస్‌టుడే

నాటి గ్రామీణ ప్రాంతాలు నేడు పట్టణ ప్రాంతాలుగా మారాయి. దానికి అనుగుణంగా సౌకర్యాలను కల్పించాలన్నది పాలకుల ఆలోచన. దీనిలో భాగంగానే వారికి అధునాతనమైన ఇంటిగ్రేటెడ్(సమీకృత) మార్కెట్లను అందుబాటులోకి తేవాలన్నది గత ప్రభుత్వ నిర్ణయం. రెండేళ్ల క్రితం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లు, తుక్కుగూడ మున్సిపాలిటీలో ఏర్పాటుకు స్థల కేటాయింపుతో పాటు నిధులు మంజూరు చేశారు. కానీ, ఇప్పటివరకు పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. కొత్త ప్రభుత్వం వచ్చినా వాటి గురించి ఆలోచించకపోవడంతో మార్కెట్లు ప్రజలకు అందనిద్రాక్షగా మారాయి.

శంకుస్థాపన చేసి 32 నెలలు..

సమీకృత మార్కెట్లు పూర్తైతే పట్టణ వాసులు కూరగాయలు, మంసాహారం ఏది కావాలన్నా.. ఒకచోటకు వెళితే సరిపోతుంది. పండ్లు, పూలు కొనేందుకు అటు ఇటు తిరగాల్సిన అవసరం లేదు. అధునాతన ఇంటిగ్రేటెడ్(సమీకృత) మార్కెట్ నిర్మాణంతో ఆ తిప్పలు తప్పనున్నాయి. సమీకృత మార్కెట్లను నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో జనవరి 30, 2022లో మంత్రి కేటీఆర్.. మంత్రి సబితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. మీర్‌పేటలో ఎకరా స్థలం మాత్రమే అందుబాటులో ఉంది. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. బడంగ్‌పేట, తుక్కుగూడలో ఆరు నెలల సమయం పట్టింది. నిధుల లేమి కారణంగా మొదటి నుంచి పనులకు ఆటంకం కలుగుతోంది. చేసిన పనులకు డబ్బులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు చేయడానికి ముందుకు రావట్లేదు. గత సంవత్సరం అక్టోబరు నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. శంకుస్థాపన జరిగి 32 నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో పెరిగిన ధరలు దృష్ట్యా కేటాయించిన నిధుల కంటే రెట్టింపు బడ్జెట్ అవసరం కానుంది. సుమారు ఒక్కోదానికి రూ.5-7 కోట్లు కావాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.


తుక్కుగూడలో నిలిచిన మార్కెట్ పనులు


బడంగ్‌పేటలో స్లాబ్ వరకే పూర్తి


మీర్‌పేటలో మార్కెట్ కోసం కేటాయించిన స్థలం

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	స్థలం (ఎకరాలు)	కేటాయించిన నిధులు (రూ.)	పూర్తైన శాతం	అవసరమయ్యే నిధులు
తుక్కుగూడ	3	4.50 కోట్లు	65	రూ.5 కోట్లు
బడంగ్‌పేట	2	4.50 కోట్లు	40	రూ.7 కోట్లు
మీర్‌పేట	1	4.50 కోట్లు	-	-

మెరుగైన వైద్య సేవలు


మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక. చిత్రంలో వైద్యాధికారులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. బుధవారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ఎక్కువ నమోదైన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వైద్యులు రాకేష్, పాపారావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం


శాస్త్రవేత్త డా.రమాకాంత్, కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ జయప్రద

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని శాస్త్రవేత్త డా.రమాకాంత్ పేర్కొన్నారు. గుంతపల్లిలోని అవంతి ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా.రమాకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ డా.వై.జయప్రద మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.కె.బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు కాపాడుకుందాం


అబ్దుల్లాపూర్‌మెట్‌లో మత్స్యకారులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: చెరువులు, కుంటలను కబ్జాలు, కాలుష్యం నుంచి కాపాడుకుందామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల మత్స్యకారులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర మత్స్యకారుల సదస్సుకు వెళ్లే ముందు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ర్యాలీ నిర్వహించారు. గోడపత్రికను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాచగోని రమేష్ ముదిరాజ్, జింక వెంకటేశ్, ఎలమోని రామకృష్ణ, పిట్టల సత్తయ్య, జింక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


మహేశ్వరం ర్యాలీలో సీడీపీవో శాంతిశ్రీ, వైద్యులు సౌమ్య, మల్లికార్జున్ తదితరులు

మహేశ్వరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందుతోందని తెలిపారు. మహేశ్వరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలు, పోషకాహారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైద్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాలాపూర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డీఆర్‌డీఓ అధికారులు స్వచ్ఛత కిట్లను అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపై బుధవారం బడంగ్‌పేట గాంధీనగర్‌లో డీఆర్‌డీఓ డీజీ యు.రాజాబాబు, డైరెక్టర్ పీఎం ఆర్.వేణుగోపాల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శోభ, ప్రధానోపాధ్యాయుడు ధనంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ కోరారు. బుధవారం మంచాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి పద్మజ తెలిపారు. ఉప్పరిగూడ గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీవో తులసి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.

వాణిజ్య పంటలతోనే రైతులకు లాభం



కప్పపాడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వాణిజ్య పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. బుధవారం కప్పపాడ్ గ్రామంలోని కందాల తిరుమల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే.. ముందుగా ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహరావు మాట్లాడుతూ జిల్లాలో 3వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, ఉద్యానశాఖ అధికారిణి నవీన, ఏఈఓలు శ్రవణ్, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, సహకార సంఘం ఛైర్మన్ పాండురంగారెడ్డి, యాచారం మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలి



మాట్లాడుతున్న మత్స్య సహకార ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మెట్టు సాయికుమార్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: భవిష్యత్ తరాలకు మేలు జరగాలంటే హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం విస్తరించి చెరువులను రక్షించాలని మత్స్య సహకార ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అధ్యక్షతన మత్స్యకారుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిలుగా హాజరైన సాయికుమార్‌తో పాటు టీజీఎంఎస్‌సీసీఎల్ రాష్ట్ర ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు లెల్లెల బాలకృష్ణ, కొప్పు పద్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5500 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4.90లక్షల మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. భూములకు ధరలు పెరిగిపోవడంతో రాష్ట్రంలో అనేక చోట్ల స్థిరాస్తి వ్యాపారులు చెరువులను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. శాటిలైట్ ద్వారా చెరువులను, కుంటలను సర్వే చేయించి ఎఫ్‌టీఎల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు ప్రభుత్వం పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సదస్సుకు ముందు మత్స్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెనమోని శంకర్, సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సరూర్‌నగర్: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. గుడ్ మార్నింగ్ సరూర్‌నగర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం డివిజన్‌లోని విజయపురి కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పచ్చని గొడుగు.. ఆహ్లాద ప్రయాణం

సాగర్ రహదారిపై గుర్రంగూడ- ఇంజాపూర్ మధ్యలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు.. ప్రయాణికులకు గొడుగు పట్టినట్లు విస్తరించాయి. దీంతో ఎండ తీవ్రత ప్రయాణికులకు తెలియకుండా ఆహ్లాదంగా సాగుతోంది. - న్యూస్‌టుడే, యాచారం



మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

తుర్కయంజాల్ పురపాలిక, కందుకూరు, ఆదిభట్ల, న్యూస్‌టుడే:

? ఇంజాపూర్ వినాయకనగర్ రోడ్ నం.1 అధ్వానంగా తయారైంది. -ఎం.వెంకటాచారి, స్థానికుడు

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.-భిక్షపతి, ఏఈ, తుర్కయంజాల్

? లేమూరు నుంచి రాచులూరు వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. -శ్రీధర్, లేమూరు

✓ మరమ్మతులు చేయిస్తాం. -సతీష్‌రెడ్డి ఏఈ

? మంగళపల్లి పటేల్‌గూడ నుంచి సాహెబ్‌గూడ వెళ్లేదారిలో రోడ్డు పక్కనే చెత్త వేస్తున్నారు. సమస్య పరిష్కరించండి.- కృష్ణ, పటేల్‌గూడ

✓ సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల

సంక్షిప్త సమాచారం

వైద్య శిబిరం విజయవంతం

మాడ్గుల, న్యూస్‌టుడే: మాడ్గుల ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో ఉప్పల ట్రస్టు, కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 171 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ ఉప్పల వెంకటేశ్ పాల్గొన్నారు.

కిట్లు అందజేత

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్వోలతో ఉప తహసీల్దార్ సంతోశ్ సమావేశం నిర్వహించారు. బీఎల్వోలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ మంజుల, బీఎల్వోవోలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ మంజూరుకు వినతి

తలకొండపల్లి: వెల్జాల్ గ్రామానికి పీహెచ్‌సీ మంజూరు చేయాలని కోరుతూ బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహకు స్థానిక నాయకులు నగరంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస మూర్తి, అజీజ్, నర్సింలు, ఆరీఫ్, వెంకట్‌రెడ్డి, అశోక్‌బాబు, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా 28న

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28న శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పి.బిక్షపతిచారి ఆధ్వర్యంలో బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. భాజపా నాయకులు. . డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఇంటింటికి తిరిగి పెద్దఎత్తున భాజపా సభ్యత్వాలు నమోదు చేయించారు.

కష్టపడితేనే లక్ష్య సాధన సాధ్యం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కష్టపడాలని దిల్‌సుఖ్‌నగర్ జోన్ నారాయణ విద్యాసంస్థల డీన్ రాధాకృష్ణ తెలిపారు. బుధవారం కొత్తపేటలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమంబర్, ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపల్ నీరజ, ఏవో రమేష్, ఏడీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం

మంచాల: రంగాపూర్ నుంచి మాల్ వరకు రెండు వరసల రహదారి విస్తరణ పనులు బుధవారం ప్రారంభించినట్లు నాయకులు, అధికారులు తెలిపారు. 16 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.16 కోట్లు వచ్చాయని తెలిపారు.

తాగునీరు సక్రమంగా అందించండి

మంచాల, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించాలని మిషన్ భగీరథ ఏఈ పావని, ఎంపీడీఓ ఉషారాణి తెలిపారు. బుధవారం మంచాల మండల పరిషత్ కార్యాలయంలో వాటర్ మెన్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఉప్పల ట్రస్టు సాయం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన చంద్రమ్మ ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రిని బుధవారం ఉప్పల ట్రస్టు నుంచి మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్ అందించారు.

పెద్దఅంబర్‌పేట్ ఛైర్‌పర్సన్ ఎన్నిక 3న

పెద్దఅంబర్‌పేట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ నూతన ఛైర్‌పర్సన్ ఎన్నిక అక్టోబరు 3న జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది.

కార్మిక శ్రమ దోపిడీపై పోరాటం



రాగన్నగూడలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్

తుర్కయంజాల్ పురపాలిక, కందుకూరు: కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా ప్రైవేటు కంపెనీలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 30న చలో లేబర్ కమిషనరేట్‌ను నిర్వహిస్తామన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని సీఐటీయూ కార్యాలయంలో వద్ద నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు డి.కిషన్, జగదీష్, సహాయ కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు. కందుకూరులో బుట్టి బాల్‌రాజ్ అధ్యక్షతన సీఐటీయూ జిల్లా, మండల కన్వీనర్ల సన్నాహక సమావేశం జరిగింది.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి


యాచారంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

యాచారం: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి ఆయన సేవలను గుర్తుచేశారు. యాచారంలో బుధవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, విశ్రాంత ఉపాధ్యాయుడు పాలోజు విష్ణుమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై చర్యలకు వినతి


డిపో మేనేజర్ వెంకట నర్సప్పకు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: బస్సు ఆపాలని అడిగిన దివ్యాంగుడైన రవీందర్‌పై దాడి చేసిన ఆర్టీసీ డ్రైవర్ జంగయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య.. బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు రాజు, బాల్‌రాజు, గువ్వల యాదయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కాటేదాన్, న్యూస్‌టుడే: తుక్కుగూడ బస్టాప్ వద్ద మిర్చి బజ్జీలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న యువతి (28) ఈనెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె భర్త ఫిర్యాదు మేరకేసు దర్యాప్తు చేస్తున్నట్లు పహాడీషరీఫ్ పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని జీహెచ్‌ఎంసీ స్వీపర్ మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గుంతపల్లి గ్రామానికి చెందిన బరిగల రాములమ్మ (67) జీహెచ్‌ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తోంది. బుధవారం మధ్యాహ్నం గుంతపల్లిలోకి ఇంటికి వెళ్లేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి వద్ద బస్సు ఎక్కేందుకు వేచి ఉంది. హయత్‌నగర్ ఆర్టీసీ డిపో బస్సు.. రాములమ్మను ఢీకొట్టింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎస్పీ బాలు స్వర గానాన్ని మరువలేం


కందుకూరు, న్యూస్‌టుడే: తెలుగు ప్రజల మనస్సులో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని పలువురు కొనియాడారు. ఎస్పీ బాలు వర్ధంతిని ఆయన అభిమానులు బుధవారం కందుకూరులో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి, ఎస్సై సైదులు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాబిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న అభిమానులు

జల్‌పల్లిని వీడని వరద బెడద

జల్‌పలి, న్యూస్‌టుడే: శంషాబాద్ పీ7 రోడ్డు పరిసరాలను వరద బెడద వీడలేదు. జల్‌పల్లి పెద్దచెరువు నుంచి నీరు బుధవారం పోటెత్తింది. వాహనదారులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


పీ7 కార్గో రోడ్డుపై వరద..



కూలిన ఇల్లు

మాడ్గుల: ఇటీవల కురిసిన వర్షాలకు అన్నెబోయిన్‌పల్లిలో బుధవారం పోలే రాములమ్మ ఇల్లు కూలింది. కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

నాలుగు రోజుల పోలీస్ కస్టడీకి నృత్య దర్శకుడు జానీ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, చంచల్‌గూడ, నార్సింగి, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీని నాలుగు రోజుల (బుధవారం మధ్యాహ్నం నుంచి 28వ సాయంత్రం 4.30 వరకు) పోలీసు కస్టడీకి అనుమతిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ కౌన్సిల్ సమక్షంలోనే జరపాలని పేర్కొంది. జానీ ఈనెల 19 నుంచి చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్నారు. ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. జానీని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు తెలిసింది. బాధిత యువతి ఎలా పరిచయమైంది? లైంగిక దాడి, అవకాశాల పేరిట ఎలా లొంగదీసుకున్నది, ఈ అంశాల్లో అతని భార్య పాత్ర గురించి ఆరా తీస్తున్నట్లు సమాచారం.

పుట్టినరోజు వేడుకకు వెళ్లొస్తూ.. రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం



పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు వెళ్లి తిరిగి వస్తున్న విద్యార్థినిని ఓ వాహనం ఢీకొనడంతో మృతిచెందింది. పటాన్‌చెరు ఎస్సై అమీనాసింగ్ వివరాలు.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పన్యాల గ్రామానికి చెందిన నాగలక్ష్మి(18) ఇంటర్ చదివింది. స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు పిలిస్తే సోదరుడు నాగరాజుతో కలిసి కూకట్‌పల్లి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలో మంగళవారం సాయంత్రం ఓ వాహనం వీరి బైకును బలంగా ఢీకొంది. ఇద్దరూ పడిపోవడంతో నాగలక్ష్మి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందింది.

బాల్యానికి మత్తు సంకెళ్లు



తాము తీసుకెళ్లేది మత్తు పదార్థమని వారికి తెలియదు. వాడితే కలిగే దుష్పరిణామాల గురించి ఆలోచనే లేదు. వాళ్ల పొట్లాల్లో నింపి ఇస్తారు.. వీళ్లు చెప్పిన ప్రాంతానికి తీసుకెళ్లి ఇచ్చేస్తారు. ఇదీ నగరంలో గంజాయి రవాణాలో మైనర్ల పాత్ర. ఎవరికీ అనుమానం రాకుండా, పోలీసు తనిఖీలు తప్పించుకునేలా చిన్నారులతో ఇలా చేయిస్తున్నారు. పోలీసులు ఆరా తీయగా డబ్బుకు ఆశపడి ఇలా చేస్తున్నట్లు వెల్లడైంది.

వారెవరైతే గుర్తించలేరని..

బస్సులు, ఆటోల ద్వారా చిన్నారుల గంజాయిని గమ్యస్థానాలకు చేరుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అన్ని ప్రాంతాలకు చేరవేయడంలో ధూల్‌పేటదే కీలకపాత్ర. సుమారు 50 శాతం సరకు ఇక్కడి నుంచే వెళ్తున్నట్లు అంచనా. ఇళ్ల దగ్గరే ఉంటూ విక్రయించడంలో మహిళలు కీలకం. ధూల్‌పేటలో 55 మంది విక్రేతల్ని అరెస్టు చేయగా వారిలో 15 మంది మహిళలు.

ఉదాహరణలు కొన్ని...

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒక మైనర్ యువతి అనుమానాస్పదంగా కనిపించింది. సంచిని తనిఖీ చేయగా రూ.3.5 లక్షల విలువైన గంజాయి ఉంది. ఒడిశా నుంచి మహారాష్ట్ర తీసుకెళ్తున్నానని, ఇలా చేసినందుకు కమిషన్ వస్తుందని సమాధానమిచ్చింది.
- సైబరాబాద్ పోలీసులు గంజాయి తరలిస్తున్న ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. ఖర్చుల కోసం ఈ పనిచేస్తున్నట్లు వారి సమాధానం విన్నవడంతో ఆశ్చర్యపోయారు.
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో పోలీసు తనిఖీల్లో ఒక కారులో 27 కిలోల గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి తీసుకొస్తున్న నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు మైనర్.

తల్లిదండ్రుల పర్యవేక్షణ లేని వారే లక్ష్యం

కూలికి వెళ్లే తప్ప రోజు గడవని కుటుంబాల్లో తల్లిదండ్రులిద్దరూ పనులకు వెళ్తుంటారు. తమ చిన్నారులు పాఠశాలకు వెళ్తున్నారో లేదో పట్టించుకొనే వారు తక్కువ. దీంతో పిల్లలు చెడు సావాసాలు, బడికి వెళ్లకుండా జల్సాలు, డబ్బు కోసం చిన్నచితకా పనులు చేస్తుంటారు. ఇలాంటి వారికి నేరగాళ్లు గాలం వేస్తున్నారు. పార్శిల్ లోపల ఏముందో చెప్పకుండా చెప్పిన ప్రాంతంలో ఇచ్చి రావాలని చెబుతారు. ఒక్కసారి గంజాయి చేరవేసినందుకు రూ.వేలల్లో ఇస్తున్నారు. చిరుప్రాయంలో రూ.వేలు కళ్ల చూస్తున్న కుర్రాళ్లు చెప్పినట్లు వింటూ మత్తు రవాణాలో ఏజెంట్లుగా మారుతున్నారు.

ఈనాడు, హైదరాబాద్

తెచ్చాం తిండి.. త్వరగా రండి




రాయదుర్గం ఐటీ కారిడార్‌లోని నాలెడ్జి సిటీ ప్రాంతంలో ఉన్న ఉద్యోగులు కొందరు ఆహార పదార్థాలను ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఇచ్చి తెప్పించుకుంటున్నారు. వాటిని తీసుకొచ్చిన స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్‌లు కార్యాలయాల వద్ద వేచి చూస్తూ కనిపించారు

భారీ వాన.. జనం తెలుగు తల్లి పంచన



నగరంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనం ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వాహనదారులు ఎక్కడ చోటు దొరికితే అక్కడ తల దాచుకున్నారు. వాహనాల రద్దీ అధికంగా ఉండే సచివాలయ ప్రాంతంలో తెలుగుతల్లి పైవంతెన కింద భారీగా చేరారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనదారుడు.. తల పైనుంచి డీసీఎం వెళ్లి దుర్మరణం



జవహర్‌నగర్, న్యూస్‌టుడే: కీసర మండలం తిమ్మాయిపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచి కందాడి అమరేందర్‌రెడ్డి (55), బుధవారం ఉదయం 8.30 గంటలకు జవహర్‌నగర్ నుంచి తిమ్మాయిపల్లికి బయల్దేరారు. డంపింగ్‌యార్డు సమీపంలో ప్రధాన రోడ్డుపై కల్వర్టు వద్ద రెండు చోట్ల భారీగా కలుషిత జలాలు వాన నీటితో కలిసి మోకాళ్ల లోతు ప్రవహిస్తున్నాయి. అమరేందర్‌రెడ్డి ఆ నీటిలో నుంచి రోడ్డు దాటి కల్వర్టును దాటేందుకు ప్రయత్నించి పడిపోయాడు. ఆ సమయంలో నీళ్ల ట్యాంకు ఖాళీ డ్రమ్ముల లోడుతో తిమ్మాయిపల్లి నుంచి జవహర్‌నగర్ వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం అమరేందర్‌రెడ్డి తల మీద నుంచి వెళ్లగా అతను అక్కడికక్కడే చనిపోయాడు. స్థానికులు అతడి డ్రైవింగ్ లైసెన్స్‌ను గుర్తించి కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు సమాచారం అందించారు. అమరేందర్‌రెడ్డి భార్య కందాడి ప్రమీల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు. ఆయన తల్లి గతంలో తిమ్మాయిపల్లి సర్పంచి. గ్రామస్థులు, బంధువులు పెద్దఎత్తున ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని డంపింగ్ యార్డులోని కార్యాలయంలోకి తరలించారు. కోపోద్రిక్తులైన వారు కార్యాలయం అద్దాలను ధ్వంసం చేయడంతో ఒక్కసారిగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, కాప్రా తహసీల్దార్ సుచరిత మాట్లాడారు. రాంకీ యాజమాన్యం నుంచి రూ.11 లక్షల పరిహారం అందించి, డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

శంషాబాద్‌కు మళ్లిన ఐదు విమాన సర్వీసులు

శంషాబాద్, న్యూస్‌టుడే: ముంబయి విమానాశ్రయంలో బుధవారం ప్రతికూల వాతావరణం కారణంగా అక్కడ దిగాల్సిన నాలుగు దేశీయ, ఒక అంతర్జాతీయ విమాన సర్వీసులను ముంబయి ఏటీసీ అధికారులు శంషాబాద్‌కు మళ్లించారు. విస్తారా ఎయిర్‌లైన్స్‌కు చెందిన యూకే 941(దిల్లీ నుంచి ముంబయి), ఇండిగోకు చెందిన 6ఈ 5139(అహ్మదాబాద్-ముంబయి), 6ఈ 342(పట్నా-కోల్‌కతా), 6ఈ 1304 (దోహ-ముంబయి), 6ఈ 5255(బెంగళూర్-ముంబయి) సర్వీసులు శంషాబాద్‌లో దిగాయన్నారు. ఇక్కడి నుంచి ముంబయి వెళ్లాల్సిన విస్తారా ఎయిర్‌లైన్స్ యూకే 534 సర్వీస్‌ను రద్దు చేసినట్లు తెలిపారు.

బైక్‌పై ప్రేమ జంట రొమాన్స్.. బాలాపూర్ పోలీసులకు ట్విటర్‌లో ఫిర్యాదు



పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: నగర శివారు శ్రీశైలం రహదారిపై ప్రేమజంటలు రెచ్చిపోతున్నారు. ద్విచక్రవాహనంపై బుధవారం ఓ యువతి పెట్రోల్ ట్యాంక్‌పై కూర్చొని వాహనం నడుపుతున్న వ్యక్తికి ముద్దులు పెడుతూ రొమాన్స్ చేసింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ వద్ద చోటు చేసుకుంది. ఈ దృశ్యాలను మరో జంట చరవాణిలో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసింది. దీనిని చూసిన ఓ ప్రయాణికుడు ట్విటర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈశాన్య రాష్ట్రాల కళామహోత్సవానికి భారీ ఏర్పాట్లు



గోడపత్రికలు విడుదల చేస్తున్న అధికారులు

బొల్లారం, న్యూస్‌టుడే: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో తొలిసారిగా అతి పెద్ద కళ, సాంస్కృతిక, సంప్రదాయ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు దిల్లీలోని రాష్ట్రపతి భవన్ ఓఎస్డీ స్వాతిషాహీ తెలిపారు. బుధవారం బొల్లారంలోని నిలయంలో ఉత్సవాల గోడపత్రికలు విడుదల చేశారు. పశ్చిమ రాష్ట్రాల అభివృద్ధి, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 8 రోజులపాటు జరిగే ఉత్సవాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారన్నారు. 400 మందికిపైగా కళాకారులు పాల్గొంటారని తెలిపారు. వీక్షణకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్రపతి నిలయం అధికారిక వెబ్‌సైట్ లేదా నిలయం ముందు ఉన్న కౌంటర్ వద్ద వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

బ్యాంకు సొమ్ము కాజేసిన ఇంటిదొంగలు

ఈనాడు, హైదరాబాద్: ఖాతాదారులకు చేరాల్సిన సొమ్మును సొంత ఖాతాల్లో జమచేసుకున్న ఇద్దరు బ్యాంకు ఉద్యోగులపై సీసీఎస్‌లో కేసు నమోదైంది. నాంపల్లిలోని ఓబ్యాంకులో బాలుసందీప్, శ్యామల ఉద్యోగులు. వ్యక్తిగత, విద్యారుణాలు మంజూరు చేసే విభాగంలో పనిచేస్తున్నారు. మే నుంచి జులై మధ్యలో ఖాతాదారుల ఖాతాల్లో జమచేయాల్సిన సొమ్మును ఉద్దేశపూర్వకంగా తమ వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. అంతర్గత ఆడిటింగ్‌లో గుర్తించిన బ్యాంకు అధికారులు మోసాన్ని గ్రహించారు. రూ.1.22 కోట్లు బ్యాంకు సొమ్ము దుర్వినియోగమైనట్టు గుర్తించారు. కాజేసిన సొమ్మును నిందితుడు ఆన్‌లైన్ గేమింగ్‌లో ఖర్చుచేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పార్కుల కబ్జాలపై హైడ్రా విచారణ

అమీన్‌పూర్ బాధితులకు న్యాయం చేస్తామన్న కమిషనర్



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

ఈనాడు, హైదరాబాద్: హెచ్ఎండీఏ అనుమతి పొందిన లేఅవుట్లలోని పార్కు స్థలాలను అక్రమార్కులు మాయం చేయడంపై వచ్చిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. అమీన్‌పూర్‌లోని వేర్వేరు లేఅవుట్ల మధ్య నెలకొన్న వివాదం పార్కుల ఆక్రమణకు దారి తీయడంతో సర్వే చేపట్టారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఎండీఏ అనుమతి గల లేఅవుట్ల పార్కు స్థలాలను పరిశీలించారు. సమస్య కొలిక్కి రాకపోవడంతో బాధితులు, ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను ట్యాంక్‌బండ్ సమీపంలోని బుద్ధభవన్‌లో ఉన్న హైడ్రా కార్యాలయానికి పిలిపించి సాయంత్రం సమావేశం ఏర్పాటు చేశారు. బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఫిర్యాదుదారులు సంతోషం వ్యక్తం చేశారు.

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పురపాలక పరిధిలో బుధవారం హైడ్రా, రెవెన్యూ శాఖలు సర్వే చేపట్టగా ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.


క్లబ్బుల్లోనూ గబ్బే

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హోటళ్లలోనే కాదు క్లబ్బుల్లోనూ గబ్బే అన్నట్టుగా ఉంది. ఎల్బీ స్టేడియం ఫతేమైదాన్ క్లబ్, సైఫాబాద్‌లోని నిజాం క్లబ్‌లో ఆహార పదార్థాలు అధ్వానంగా ఉన్నాయని ఆహార భద్రత అధికారులు బుధవారం ఎక్స్ ద్వారా తెలిపారు. ఆహార తయారీకి ఉపయోగించే నీటి ఆర్వో ప్లాంట్‌కు సంబంధించిన వాటర్ అనాలసిస్ రిపోర్ట్‌లు అందుబాటులో లేవన్నారు. వంటగదులు మురికితో కూడి ఉన్నాయన్నారు. ఆహార పదార్థాలపై మూతలు లేకుండా ఉంచారని, వంట గదిలో బొద్దింకలు తిరుగుతున్నట్లు కూడా గుర్తించారు.

పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌ను 6 నెలల్లో నిర్ధారించండి

ఈనాడు, హైదరాబాద్: రామంతాపూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌ను 6 నెలల్లో నిర్ధారించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తుది నోటిఫికేషన్ తర్వాత అక్రమ నిర్మాణమని తేలితే తొలగించి చెరువు చుట్టూ కంచె వేయాలని సూచించింది. 2005 నాటి పిటిషన్‌పై ఈ కీలక ఆదేశాలు జారీ చేస్తూ విచారణను ముగించింది. 26 ఎకరాల్లోని పెద్దచెరువును డంపింగ్‌యార్డుగా మారుస్తున్నారని.. నీటికాలుష్యం పెరిగి దుర్వాసన వస్తోందని ఉస్మానియా ప్రొఫెసర్ డా.కెవెల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు బుధవారం విచారణకు స్వీకరించింది. 153 మంది ప్రతివాదులుగా ఉన్న ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. అనధికార ప్రతివాదుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. చెరువు చుట్టూ కంచెతోపాటు పచ్చదనం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఫొటోలను సమర్పించారు. పెద్దచెరువు నుంచే జాతీయ రహదారిని నిర్మించినా ఎంతమేర పోయిందో అంచనా వేయలేదు. అనధికార ప్రతివాదులు ఇళ్లు నిర్మించుకొని 4 దశాబ్దాలుగా ఉంటున్నారు.' అని చెప్పారు. దీనిపై సీజే జోక్యం చేసుకుంటూ.. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఇంకా ఇవ్వలేదని, అయితే గత అక్టోబర్‌లో దాఖలు చేసిన అఫిడవిట్‌లోని వివరాలకు కట్టుబడి ఉన్నామని అధికారులు చెప్పారన్నారు. దుర్గం చెరువుకు ఇచ్చిన ఆదేశాలను ఇక్కడ కూడా అమలు చేస్తామని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ చెప్పారు.


నల్లకుంటలో మహిళ మృతదేహం



నల్లకుంట, న్యూస్‌టుడే: నల్లకుంట ఠాణా పరిధిలో ఓ మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఫీవరాసుపత్రి ఎదుట శివానంద్‌నగర్ బస్తీలో గుర్తుతెలియని మహిళ పడిపోయి ఉందని సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించగా అప్పటికే ఆమె మృతిచెందింది. ఆమె సంచిని తెరిచి చూడగా రెండు ఆధార్‌కార్డులున్నాయి. వాటిల్లో మహిళ పేరు బాసుపల్లి అర్చన(35)గా ఉంది. కానీ చిరునామాలు వేర్వేరుగా ఉన్నాయి. ఒకదానిపై వారాసిగూడ ఎల్.ఎన్.నగర్ చిరునామా.. మరోదానిపై యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రం చిరునామా ఉంది. ఆమె ఈనెల 24 నుంచి శివానంద్‌నగర్ పరిసరాల్లో కనిపిస్తోందని స్థానికులు చెప్పారన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

'గాంధీ'లో శిశువు అపహరణ

కొద్దిగంటల్లోనే పట్టుకున్న పోలీసులు



తల్లిదండ్రులకు బాబును అప్పగిస్తున్న పోలీసులు

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రి నుంచి రెండ్రోజుల వయసున్న మగశిశువు అపహరణకు గురికావడం కలకలం రేపింది. కొద్దిగంటల్లోనే పోలీసులు శిశువును తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. నల్గొండ జిల్లా గుండాల మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన సుభాన్, షాహినా దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మూడోసారి గర్భం దాల్చిన షాహినా ఈనెల 24న గాంధీలోని మాతా శిశు సంక్షేమ కేంద్రంలో చేరి అదేరోజు ఉదయం 10.30 గంటలకు బాబుకు జన్మనిచ్చింది. 11.30కు పరీక్షల నిమిత్తం వెళ్లి వచ్చేసరికి శిశువు కనిపించలేదు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా బాబును అపహరించిన మహిళను బిహార్‌కు చెందిన పూజాదేవిగా గుర్తించి అదుపులోకి తీసుకొని బాబును తల్లిదండ్రులకు అప్పగించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
MS.B ఉమా మహేశ్వరి, రికవరీ అధికారి సమక్షంలో
తేదీ: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.61/2018
లోని
ఆర్.పి. నెం.311/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఎఆర్సి- కర్ణాటక బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్చ్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి - 400025. ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేద్కర్ యూనివర్సిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం. ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 104,46,16,654.84 పై.(ఒక వంద నాలుగు కోట్ల నలభై ఆరు లక్షల పదహారు వేల ఆరు వందల యాభై నాలుగు రూపాయల ఎనభై నాలుగు పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.5,25,88,175.24/– (ఐదు కోట్ల ఇరవై ఐదు లక్షల ఎనభై ఎనిమిది వేల ఒక వంద డెబ్బై ఐదు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.311/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.
"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."
పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యుచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏవేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.
(బి. ఉమా మహేశ్వరి)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
MS.B ఉమా మహేశ్వరి, రికవరీ అధికారి సమక్షంలో
తేదీ: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం. 74/2018
లోని
ఆర్.పి. నెం. 309/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఎఆర్సి- ICICI బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్చ్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి - 400025 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేద్కర్ యూనివర్సిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం- 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 64,09,14,120/– (అరవై నాలుగు కోట్ల తొమ్మిది లక్షల పద్నాలుగు వేల ఒక వంద ఇరవై రూపాయలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.4,13,29,130/– (నాలుగు కోట్ల పదమూడు లక్షల ఇరవై తొమ్మిది వేల ఒక వంద ముప్పై రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.309/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.
"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."
పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యుచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏవేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-09-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 ఆయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.
(బి. ఉమా మహేశ్వరి)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేదీ: 30 ఆగస్టు 2024
ఒ.ఎ.నెం. 62/2018
లోని
ఆర్.పి.నెం. 312/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఎఆర్సి-పిఎన్‌బి (ఇ-ఒబిసి) యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్చ్, 2015 - ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి - 400025. ....సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేద్కర్ యూనివర్సిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ - 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 25,06,44,760.19 పై.(ఇరవై ఐదు కోట్ల ఆరులక్షల నలభైనాలుగు వేల ఏడువందల అరవై రూపాయల పందొమ్మిది పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.57,55,359/– (యాభై ఏడు లక్షల యాభైఐదు వేల మూడు వందల యాభైతొమ్మిది రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.312/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.
"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."
పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యుచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏవేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.
(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేదీ: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.120/2018
లోని
ఆర్.పి. నెం.242/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఎఆర్సి-ఎస్‌బిఐ (ఇ-ఎస్‌బిహెచ్) యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్చ్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి- 400025 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేద్కర్ యూనివర్సిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం- 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట,విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ....సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 98,56,05,012.77 పై.(తొంభై ఎనిమిది కోట్ల యాభైఆరు లక్షల ఐదు వేల పన్నెండు రూపాయల డెబ్బై ఏడు పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.7,04,29,597.76పై. (ఏడు కోట్ల నాలుగు లక్షల ఇరవైతొమ్మిది వేల ఐదువందల తొంభైఏడు రూపాయల డెబ్బైఆరు పైసలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.242/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.
"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."
పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యుచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏవేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 ఆయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.
(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేదీ: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.63/2018
లోని
ఆర్.పి. నెం.310/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఎఆర్సి-యాక్సిస్ బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్చ్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి- 400025 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేద్కర్ యూనివర్సిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ - 520008. ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 83,04,84,505.70 పై. (ఎనభైమూడు కోట్ల నాలుగు లక్షల ఎనభైనాలుగువేల ఐదువందల ఐదు రూపాయల డెబ్బై పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.5,28,67,320/– (ఐదు కోట్ల ఇరవై ఎనిమిది లక్షల అరవై ఏడు వేల మూడువందల ఇరవై రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.310/2019 గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.
"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."
పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యుచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏవేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.
(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేదీ: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.121/2018
లోని
ఆర్.పి. నెం.220/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఎఆర్సి-యునైటెడ్ బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్చ్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి- 400025. ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేద్కర్ యూనివర్సిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 98,85,92,254.85 పై. (తొంభై ఎనిమిది కోట్ల ఎనభైఐదు లక్షల తొంభైరెండు వేల రెండు వందల యాభైనాలుగు రూపాయల ఎనభైఐదు పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.6,32,27,028/ (ఆరు కోట్ల ముప్పైరెండు లక్షల ఇరవైఏడు వేల ఇరవైఎనిమిది రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.220/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.
"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."
పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యుచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏవేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 ఆయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.
(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

విపత్తులపై ఇన్‌కాయిస్ అప్రమత్తత


డాక్టర్ తుమ్మల శ్రీనివాస్‌కుమార్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్–న్యూస్‌టుడే, నిజాంపేట: ప్రకృతి విపత్తులను ముందస్తుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడానికి నిరంతరం పరిశోధనలు సాగిస్తున్నామని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కాయిస్) డైరెక్టర్ డాక్టర్ తుమ్మల శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సంస్థ కేంద్రంలో రెండు రోజుల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ) సదస్సు బుధవారం ప్రారంభమైంది. డైరెక్టర్ శ్రీనివాసకుమార్, ఇన్‌కాయిస్ గ్రూపు డైరెక్టర్ డాక్టర్ టి.ఎం.బాలకృష్ణ నాయర్, శాస్త్రవేత్తలు డాక్టర పతంజలి కుమార్, జె.పద్మనాభం, బి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యంపై సదస్సు 28 నుంచి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తల్లిపాల ప్రాధాన్యంపై నగరంలో రెండు రోజుల సదస్సు నిర్వహించనున్నట్లు జాతీయ వైద్య కమిషన్ సభ్యుడు, సుషేనా హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. సంతోష్‌కుమార్ క్రాలేటి తెలిపారు. ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్‌తో పాటు పలు సంస్థల సహకారంతో ఈనెల 28, 29వ తేదీల్లో నగరంలోని పది ఆసుపత్రులు, గ్రీన్‌ల్యాండ్స్‌లోని మ్యారీ గోల్డ్ హోటల్‌లో సదస్సులు ఉంటాయన్నారు. బ్రోచర్‌ను బుధవారం సోమాజిగూడలో ఆవిష్కరించారు. లాంబ్యాన్ నిర్వహణ కార్యదర్శి డా. నితాషా బగ్గా, ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు డా.కలవలపల్లి దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

విరిగిన చెట్లు.. అక్కడికక్కడే తుక్కు

- విద్యుదుత్పత్తికి ఉపయోగిస్తున్న జీహెచ్ఎంసీ


చెట్ల కొమ్మల్ని ముక్కలు చేస్తున్న యంత్రం

ఈనాడు, హైదరాబాద్: విరిగిన చెట్ల కొమ్మలకు జీహెచ్ఎంసీ చక్కని పరిష్కారం చూపుతోంది. పచ్చని వ్యర్థాలను ముక్కలుగా చేసి, వాటిని మండించి విద్యుత్తును ఉత్పత్తి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉప్పల్ సర్కిల్ ఉపకమిషనర్ ఆంజనేయులు ఈ విధానాన్ని ప్రారంభించారు. హరిత వ్యర్థాలను డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ వాహనాలు డంపింగ్ యార్డుకు తరలించి, విద్యుదుత్పత్తి కేంద్రానికి అందజేస్తున్నాయి. మొత్తంగా నగరంలోని విరిగిన చెట్లు.. విద్యుత్తుగా మారి వెలుగులిచ్చే ఇంధనంగా మారుతున్నాయి.

యంత్రాలు పెరగాలి.. ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ప్రత్యేకంగా చొరవ తీసుకుని చెట్ల కొమ్మలను తుక్కుగా మార్చే చిన్నపాటి యంత్రాన్ని సమకూర్చుకుంది. డీసీఎం వాహనంలో దాన్ని ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. సులువుగా కిందకు దింపి, రోడ్డుపై ఉన్న చెట్ల కొమ్మలను అందులో వేయొచ్చు. యంత్రానికి పైన ఉండే గొట్టం ద్వారా పొడిగా మారే వ్యర్థాలు డీసీఎంలో పడతాయి. ఫలితంగా.. మామూలుగా డీసీఎం మొత్తాన్ని ఆక్రమించే చెట్ల వ్యర్థాలు, 20శాతం ట్రాలీలో నిండిపోతున్నాయి. సమయం, ఇంధనం ఆదా అవుతోందని, హరిత వ్యర్థాలను వేగంగా తరలించడం వల్ల స్థానికుల సమస్య త్వరగా పరిష్కారం అవుతోందని అధికారులు చెబుతున్నారు.

ఎరువుగానూ మార్చవచ్చు.. నగరంలో రోడ్ల పక్కన లక్షలాదిగా పెల్టోఫోరం అనే చెట్లు ఉన్నాయి. ఈదురు గాలులు, కుండపోత వానలకు తరచుగా విరుగుతున్నాయి. 2 నెలల వ్యవధిలో దాదాపు 5,000 చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. వాటి నుంచి సుమారు 10 వేల టన్నుల హరిత వ్యర్థాలు ఉత్పత్తయ్యాయని అంచనా. వాటిని చెత్త నిల్వ కేంద్రాలకు తరలించగా, రాంకీ సంస్థ ఆ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తీసుకెళ్లింది. ఆకులు, చిన్నపాటి కొమ్మలను సేంద్రీయ ఎరువుగా, లావుపాటి కొమ్మలను విద్యుదుత్పత్తి కోసం ఉపయోగిస్తోంది. ఇటీవలి వర్షాలు, గణపతి ఉత్సవాల శోభాయాత్ర కోసం నగరంలో ఇటీవల వేలాది వృక్షాలు నేలకొరిగాయి. ఇప్పుడు హరిత వ్యర్థాలన్నింటినీ ఓచోట నిల్వ చేసి, అక్కడే ఎరువు తయారీ కార్యక్రమాన్ని చేపట్టింది.

నిజాం కళాశాలకు 'గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్' పురస్కారం



నవీన్ మిట్టల్ చేతుల మీదుగా అందుకుంటున్న ప్రొ.బీమా

నారాయణగూడ, న్యూస్‌టుడే: నిజాం కళాశాలకు 'గ్లోబల్ ఎక్స్‌లెన్స్' పురస్కారం దక్కింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)కు సంబంధించి జాతీయస్థాయిలో 101-105 బ్యాంక్ విడ్త్‌ను నిజాం కళాశాల సాధించింది. యూనివర్సిటీ ఆఫ్ విండ్సర్ (కెనడా), గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరియర్ ఫోరం (జీఈసీఎఫ్)లు కలిసి నిజాం కళాశాలను గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రకటించారు. బుధవారం ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.బీమా పురస్కారాన్ని అందుకున్నారు.

బీసీలపై వివక్ష పోవాలంటే మహా ఉద్యమం అవసరం


అభివాదం చేస్తున్న జ్ఞానేశ్వర్, ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం, ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో బీసీలపై వివక్ష ఉందని పలువురు బీసీ నేతలు పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో 'సమగ్ర కుల గణన - సామాజిక న్యాయం' అంశంపై రాష్ట్ర స్థాయి అఖిలపక్ష సదస్సు నిర్వహించాయి. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, ఫౌండేషన్ సెక్రెటరీ రాపోల్ జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, భారాస ఎమ్మెల్సీ ఎల్.రమణ, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ బీఎస్ రాములు మాట్లాడారు. బీసీలపై ఉన్న వివక్షను పోయేందుకు మహా ఉద్యమం అవసరం ఉందన్నారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ నేతలు లాల్ కృష్ణ, సురేష్, కిరణ్, శ్రీకాంత్ గౌడ్, జొల్లి శివకుమార్, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిరస్మరణీయుడు


నివాళులర్పిస్తున్న ఎన్.గౌతంరావు. చిత్రంలో రామచంద్రారెడ్డి తదితరులు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: సమాజంలో అట్టడుగున ఉన్న పేదలకు మొదటి ఫలాలు అందాలని కాంక్షించి అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రవచించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిరస్మరణీయులని భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని భాజపా నగర కార్యాలయంలో.. జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, నేతలు సందీప్‌సాయి, అనంతలక్ష్మి, ప్రవీణ్, కేకేయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



స్పందనకు వందనం



ఫిలింనగర్ మహాత్మాగాంధీ కాలనీవాసుల సమస్యకు పరిష్కారం లభించింది. ఇక్కడి నాలాపై ఇనుప వంతెన శిథిలావస్థకు చేరిన వైనంపై 'ఈనాడు'లో చిత్రం రావడంతో అధికారులు స్పందించారు. కొత్త వంతెన ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టుకు అంబులెన్సు వితరణ


జెండా ఊపి అంబులెన్సు ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టుకు నగరంలోని భగీరథ కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థ తమ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అంబులెన్సు విరాళంగా అందజేసింది. బుధవారం బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్టీ నారా భువనేశ్వరి జెండా ఊపి అంబులెన్సును ప్రారంభించారు. సంస్థ ఎండీ ఎస్.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ పి.పూర్ణచంద్రరావు, జనరల్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, ట్రస్ట్ సీఈవో కె.రాజేంద్ర కుమార్, సీవోవో గోపీ తదితరులు పాల్గొన్నారు.

మూసీ అభివృద్ధి సంస్థ సీఈగా దత్తుపంతు




ఈనాడు, హైదరాబాద్: మూసీ నది అభివృద్ధి ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా వేగం పెంచింది. ప్రత్యేకంగా ఎంఆర్‌డీసీఎల్ (మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్)కు సీనియర్ ఇంజినీరు దత్తుపంతును ముఖ్య ఇంజినీరు (సీఈ)గా నియమిస్తూ బుధవారం పురపాలకశాఖ ఉత్తర్వు జారీ చేసింది. ఇటీవలి వరకు ఆయన జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టుల విభాగంలో కీలకంగా పనిచేశారు. పాతబస్తీలోని పలు పైవంతెనలు, రోడ్డు విస్తరణ పనులు, నాలా నిర్మాణ పనులు, ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ, ఇతరత్రా ప్రాజెక్టులను పూర్తి చేసిన సంగతి తెలిసిందే.

అక్టోబరు 2 నుంచి బహుజన బతుకమ్మ


కరదీపిక ఆవిష్కరించిన విమలక్క, అరుణోదయ కళాకారులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును చాటిచెప్పే బహుజన బతుకమ్మ అక్టోబరు 2 నుంచి 10 వరకు 'బహుజన బతుకమ్మ'ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సారథి విమలక్క వెల్లడించారు. బుధవారం అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బహుజన బతుకమ్మ కరదీపికను, గోడపత్రికను ఆవిష్కరించారు. విమలక్క మాట్లాడుతూ.. ఏటా ఈ బతుకమ్మను ఊరూరా.. వాడవాడలో ఉద్యమంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు.

నాన్న ఊపిరి తీయాలనుకుంటే.. పెద నాన్న ప్రాణం పోశాడు


చిన్నారి ఇందుమతి

నిమ్స్, న్యూస్‌టుడే: కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన నాన్నే నాలుగేళ్ల క్రితం ఆ చిన్నారి ఊపిరి తీయాలనుకున్నాడు. చివరకు కొన ఊపిరితో బయటపడింది. ఇంతలో ఆ చిన్నారికి గుండెలో రెండు రంధ్రాలున్నట్లు తేలడంతో ఆ చిన్నారికి పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స ఉచితంగా చేయించారు పెద నాన్న. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం రాందాస్ తండాకు చెందిన మెఘావత్ మధు నాలుగేళ్ల క్రితం భార్యపై అనుమానంతో ఆమెను హత్య చేసి, ఆరేళ్ల కూతురు ఇందుమతిపైనా దాడి చేసి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తర్వాత చిన్నారి సంరక్షణ బాధ్యత పెదనాన్న తీసుకున్నాడు. ఇరవై రోజుల క్రితం చిన్నారికి తీవ్ర జ్వరం రావడంతో గుండెకు రెండు రంధ్రాలు ఉన్నట్లు గుర్తించారు. నిమ్స్‌లో బుధవారం ఇందుమతికి గుండె చికిత్స విజయవంతంగా పూర్తయినట్లు కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు చెప్పారు.

పదేళ్ల చిన్నారికి.. బ్రిటన్ వైద్య బృందం ఆధ్వర్యంలో పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో అత్యంత అరుదైన గుండె సమస్యలతో బాధపడుతున్న నలుగురు చిన్నారులకు బుధవారం విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేసినట్లు వైద్యులు ప్రకటించారు. పదేళ్ల సారికకు వేర్వేరుగా ఉండాల్సిన గుండె రక్తనాళాలు కలిసి ఉన్నట్లు తేలింది. రమణ ధన్నపనేని బృందం, కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు సమన్వయంతో చిన్నారికి సమస్యను శాశ్వతంగా నయం చేశారు.

నిజాం ఆశయాలకు అనుగుణంగా సేవలు


బ్రిటన్ బృందం, డైరెక్టర్ బీరప్పతో నవాబ్ నజీఫ్ అలీఖాన్

నిమ్స్, న్యూస్‌టుడే: పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించాలన్న నిజాం ఆశయాలకు అనుగుణంగా నిమ్స్ సేవలందిస్తోందని నిజాం మనవడు నవాబ్ నజీఫ్ అలీఖాన్ అన్నారు. ఆయన బుధవారం ఆస్పత్రిని సందర్శించారు. మిలీనియం బ్లాక్‌లోని కార్డియోథొరాసిక్ ప్రత్యేక విభాగాన్ని డైరెక్టర్ బీరప్ప, రమణ, కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, ప్రొఫెసర్ గోపాల్‌తో కలిసి పరిశీలించారు. సీనియర్ రెసిడెంట్ వైద్యుడు సయ్యద్ సల్మాన్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక


కార్యక్రమంలో బీఎన్ రాజేశ్వర్, అష్వాక్ హైదర్, డి.మోహన్, సురేందర్‌రెడ్డి, నిరంజన్, డా.ప్రభాశంకర్, సతీశ్‌నాయక్, డా.గంగాధర్ తదితరులు


అబిడ్స్, న్యూస్‌టుడే: నగరంలోని ఎగ్జిబిషన్ సొసైటీ 2024-25 సంవత్సరానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షులుగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షులుగా కె.నిరంజన్, కార్యదర్శిగా బి.సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, కోశాధికారి డా. బి.ప్రభాశంకర్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా వి.అజయ్‌కుమార్, అశ్విన్, ఎం.చంద్రశేఖర్, మిలింద్ గద్వాల్‌కర్, డా.బి.మురళీమోహన్, సతీశ్‌నాయక్, డా.బి.వెంకటేశ్వర్, డా.గంగాధర్‌రావు, అష్వాక్ హైదర్, బీఎన్ రాజేశ్వర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎగ్జిబిషన్ సొసైటీ గోల్డెన్ జూబ్లీబ్లాక్‌లో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తాజా మాజీ కార్యదర్శి బి.హన్మంత్‌రావు తెలిపారు.

బ్యాడ్మింటన్ క్రీడకు మరింత ప్రోత్సాహం


లోగో ఆవిష్కరణలో పుల్లెల గోపిచంద్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు


మాదాపూర్, న్యూస్‌టుడే: బ్యాడ్మింటన్ క్రీడను మరింత ముందుకు తీసుకెళ్లాలని, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ అన్నారు. బుధవారం హైటెక్ సిటీ ప్రాంతంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మేడ్చల్- మల్కాజిగిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్‌లో మరిన్ని పతకాలు సాధించే దిశగా సహకారం అందిస్తామన్నారు. అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ యూవీఎం బాబు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి హర్షయాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహులకు కంటి పరీక్షలు తప్పనిసరి


డా.రాజా నారాయణన్


జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మధుమేహం ఉన్న వారు కంటి పరీక్షలు తప్పక చేయించుకోవాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, అనంత్ బాజాజ్ రెటినా ఇన్‌స్టిట్యూట్ నెట్‌వర్క్ డైరెక్టర్ డా.రాజా నారాయణన్ సూచించారు. ప్రపంచ రెటీన దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. డయాబెటిక్ రెటినోపతి(డీఆర్), డయాబెటిక్ మాక్యులర్ ఎడిమా(డీఎంఈ), ఏజ్ రిలేటెడ్ మాక్యులర్ డీజనరేషన్(ఎన్ఏఎండీ) అనేవి దృష్టికి లోపాన్ని కలిగిస్తాయని అన్నారు. ఎల్వీపీఈఐ వైద్యుడు, శ్రీమతి కానూరి శాంతమ్మ సెంటర్ ఫర్ విట్రియో డిసీసెస్ వైద్యుడు డా.ముదిత్ త్యాగి పాల్గొన్నారు.

సంస్థాగత పదవుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన దుండ్ర కుమారస్వామి

కాచిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని బీసీలకు కాంగ్రెస్ పార్టీలోని సంస్థాగత పదవులలో ప్రాధాన్యం కల్పించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. సుమారు 54 శాతం ఉన్న బీసీలకు నేటికీ అన్నిరంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. బుధవారం టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను.. నేతలు శ్రీనివాస్, సాయి, మల్లేష్, రఘు, సురేష్, శ్రీకాంత్ తదితరులతో కలిసి సన్మానించి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కులగణన ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలన్నారు.

ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్ ఖోఖో టోర్నమెంట్


తిరుపతి అకార్డ్ పాఠశాల విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న రమణశ్రీ, విజయారాణి తదితరులు

నిజాంపేట, న్యూస్‌టుడే: బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి రెసిడెన్షియల్ పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ 7వ ఖోఖో టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేత జట్లకు బుధవారం బహుమతులు అందించారు. వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ వల్లూరుపల్లి రమణశ్రీ, ట్రస్టీ మేనేజర్ శాయాజీరావు, డైరెక్టర్ కొడాలి విజయారాణి, వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలల క్రీడా విభాగం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరామ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే: అండర్–14.. బాలికలు: హిల్స్ పాఠశాల (తోటపల్లి, ఏలూరు జిల్లా), నల్గొండ పబ్లిక్ స్కూల్ (నల్గొండ), శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ (అనకాపల్లి), సిస్టర్ స్టానిస్లాస్ (కర్నూలు). బాలురు: శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్ (అనకాపల్లి), నల్గొండ పబ్లిక్ స్కూల్ (నల్గొండ), హిల్స్ పాఠశాల (తోటపల్లి), ఏకశిలా ఐఎఎస్ పాఠశాల (వరంగల్).

అండర్–17.. బాలికలు: వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ (బాచుపల్లి), మాంటిస్సోరి (అనంతపురం జిల్లా), విజ్ఞాన్ స్కూల్ (గుంటూరు), పల్లవి అంతర్జాతీయ పాఠశాల (కీసర). **బాలురు:** అకార్డ్ పాఠశాల (తిరుపతి), శాంతినికేతన్ పాఠశాల (శామీర్‌పేట), బ్లూమింగ్ మైన్స్ (ఖమ్మం), సంస్కార పాఠశాల (ఎర్రగడ్డ).

అండర్–19.. బాలికలు: అకార్డ్ పాఠశాల (తిరుపతి), హార్వెస్ట్ పాఠశాల (ఖమ్మం జిల్లా), సిస్టర్ నివేదిత పాఠశాల (అమీర్‌పేట, హైదరాబాద్), సర్ సీఆర్ రెడ్డి పాఠశాల (ఏలూరు పట్టణం). **బాలురు:** శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ (అనకాపల్లి, విశాఖపట్నం), ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై పాఠశాల (కడ్తాల్), హెచ్‌పీఎస్ పబ్లిక్ పాఠశాల (ఖమ్మం), సర్ సీఆర్ రెడ్డి పాఠశాల (ఏలూరు).

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఇందిరానగర్ అభివృద్ధికి రాజ్‌భవన్ తోడ్పాటు


వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్ బస్తీ అభివృద్ధికి రాజ్‌భవన్ తోడ్పాటు అందించనుంది. బస్తీని ఏడాది పాటు పర్యవేక్షించి గవర్నర్ దత్తత తీసుకుని అక్కడి సమస్యల్ని పరిష్కరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 27న గవర్నర్ బస్తీకి రానుండటంతో రాజ్‌భవన్ అధికారుల బృందం బుధవారం బస్తీని సందర్శించి వివరాలు సేకరించింది. జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి సమస్యలపై ఆరా తీశారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, నీటి సరఫరా, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయని జీహెచ్ఎంసీ వర్గాలు తెలిపాయి.

అతివేగం ప్రమాదకరం


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: అతివేగంగా వాహనాలు నడుపుతూ.. విద్యార్థులు పిల్లలు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని బేగంపేట టీజీఏ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే సెక్షన్ 281 బీఎన్ఎస్, 177 (నేరాల శిక్షకు సాధారణ నిబంధన) మోటారు వెహికల్ చట్టం కింద కేసు నమోదు అవుతుందని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ప్రిన్సిపల్ సావిత్రి, ఓఎస్‌డీ కపిల్, హెచ్ఓడీ దీప తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట వరకు

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్, న్యూస్‌టుడే:

? బంజారాహిల్స్ యూబీఐ కాలనీ కూడలి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో కొన్ని వీధి దీపాలు పగటి సమయంలో వెలుగుతున్నాయి. – రమేష్, స్థానికుడు, బంజారాహిల్స్

✔ సాంకేతికలోపం తలెత్తి ఉండొచ్చు. సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (విద్యుత్ విభాగం), సర్కిల్–18.

సంక్షిప్త సమాచారం

ఉచిత కంప్యూటర్ శిక్షణ 14 నుంచి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: అమీర్‌పేట కమ్మ సంఘం ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, గృహిణులు, సీనియర్ సిటిజన్లకు మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అక్టోబరు 14 నుంచి ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 98495 66945, 91776 61161 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అక్టోబరు 8, 9వ తేదీల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు అమీర్‌పేట కమ్మ సంఘం హాల్ ఆవరణలోని శిక్షణ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యం ముఖ్యమే

హిమాయత్‌నగర్: పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం ముఖ్యమే అని వైద్యులు చెప్పారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో డా.సుహాస్ ఆర్ట్ డెంటల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. డా. వైష్ణవి, డా.సుహాస్‌లతో పాటు సిబ్బంది పరీక్షలు చేశారు. నారాయణగూడ ఏఐఎంఐఎం నూర్ అలీ, సమన్వయకర్త రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, డీన్ జబ్బార్ తదితరులున్నారు.

అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రవేశాలు

నారాయణగూడ: డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలకు నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన సహాయ కేంద్రం సమన్వయకర్త సి.వి.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ కెప్టెన్ డా.ఎం.విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా ఓపెన్ ఇంటర్, రెండు సంవత్సరాల ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధ్రువపత్రాలతో సహాయ కేంద్రానికి వచ్చి పరిశీలన చేయించుకుని, నిర్ధారించిన ఫీజు ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లించి, అడ్మిషన్ పొందాలన్నారు. పూర్తి వివరాల కోసం 7382929690 నంబరును సంప్రదించాలని కోరారు.

దీన్‌దయాళ్ జయంతి

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: పేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పనిచేసిన గొప్ప వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.బీజిరెడ్డి అన్నారు. ఫిల్మ్‌నగర్ గౌతంనగర్ చౌరస్తాలో బుధవారం దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి ఆటల పోటీలు

వెంగళ్‌రావునగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్, షేక్‌పేట్ జోనల్ టోర్నమెంట్ నేటి నుంచి శనివారం వరకు మూడు రోజులు పాటు ఎర్రగడ్డ డాన్ బాస్కో పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.శ్యాముల్‌రాజ్ తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు.

బంజారాహిల్స్.. రోడ్డెక్కితే ఒళ్లు హూనం


పోలీస్‌స్టేషన్ కూడలిలో రోడ్డు నం.14కు వెళ్లే దారి


రోడ్డు నం.7 మీసేవ ప్రధాన కార్యాలయం వద్ద

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్ పేరు చెబితే.. ప్రముఖులు ఉండే ప్రాంతం అని అందరికీ గుర్తు వస్తుంది. ఒక్కసారి చూద్దామని ఆ దారుల్లో సామాన్యుడు ద్విచక్రవాహనంపై వెళితే మాత్రం ఒళ్లు హూనం కావాల్సిందే. బంజారాహిల్స్‌లో పలు ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. రోడ్డు నం.4, 6, 5, 3, 7, 14 ఇలా ఏ రోడ్డు చూసినా అడుగు లోతు గుంతలు, కంకరతేలిన పరిస్థితులే దర్శనమిస్తున్నాయి. ఇలాంటి చోట్ల వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేయాల్సి ఉండగా.. మొత్తం రోడ్డు వేయాల్సి ఉందని, అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు తప్ప పనులు మాత్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.


రోడ్డు నం.4లో ఇలా..


యూబీఐ కాలనీ కూడలి నుంచి దేవరకొండ బస్తీకి వెళ్లే దారిలో..

ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఇంతే..!



షేక్‌పేట, న్యూస్‌టుడే: షేక్‌పేట నాలా చౌరస్తా పాస్ పోర్టు సేవా కార్యాలయం సమీపంలో రహదారి ఛిద్రమైంది. అక్కడ ఉన్న మ్యాన్‌హోల్ రహదారికి కిందికి ఉండడం, లీకైన మురుగు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దెబ్బతింటుంది. జలమండలి సిబ్బంది మరమ్మతులు చేసినా కొన్నాళ్లకే సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. జలమండలి, జీహెచ్ఎంసీ యంత్రాంగం సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



లక్డీకాపూల్‌లోని రాజ్‌దూత్‌కూడలిలో సంగం దాబా ఎదుట ఓ స్తంభం ప్రమాకరంగా ఒరిగింది. పునాది వద్ద ఒరిగిపోయిన ఈ స్తంభం కింద పడకుండా ఒకే ఒక్క తీగ ఉంది. అది తెగితే దాబాకు వచ్చే వారిపై పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఖైరతాబాద్

జేఎల్ఎం ఉద్యోగాలు ఆర్టిజన్లకు ఇవ్వండి


టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఫారూఖికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ 1535 (టీజీఎస్పీడీసీఎల్) యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వజీర్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ బుధవారం టీజీఎస్పీడిసిఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖిని మర్యాద పూర్వకంగా కలిశారు. టీజీఎస్పీడీసీఎల్‌లో జేఎల్ఎం నోటిఫికేషన్ ఇవ్వకముందే ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆర్టిజన్లను జేఎల్ఎం, జూనియర్ అకౌంటెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా అర్హతకు అనుగుణంగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సీఎండీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులికోటి, కె.లింగం, నవీన్, సురేష్, రాజు, మాళవిక, వసంత, దుర్గా పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీ చేసిన దోషులను శిక్షించాల్సిందే


సభ్యత్వ నమోదులో చింతల రామచంద్రారెడ్డి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తితిదే బోర్డు మాజీ సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి స్పందించారు. బుధవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. లడ్డూ ప్రసాదం కల్తీపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిట్ వేయడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. తానూ గతంలో బోర్డు సభ్యుడు ఉన్నానని, అప్పట్లో ఏది కొనుగోలు చేయాలన్నా బోర్డు అనుమతి తీసుకునేవారని గుర్తు చేశారు. నెయ్యి కొనుగోలు చేయాలనుకున్నప్పుడు బోర్డు అనుమతి తీసుకున్నారా? తీర్మానం ఆమోదిం పొందిందా? నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించారా? అనేది కేసు దర్యాప్తులో పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు నర్సింగరావు ముదిరాజ్, పి.ప్రసాద్, కె.శ్రీధర్, నవీన్, నర్సింగ్ గౌడ్, మల్లేశ్ తదితరులున్నారు.

దళితుల్ని విడగొట్టేందుకు పార్టీల కుట్ర


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

బోరబండ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో దళితుల్ని విడగొట్టేందుకు రాజకీయ పార్టీలు చూస్తున్నాయని జాతీయ మాల మహానాడు తెలంగాణ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ విమర్శించారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ దళిత అధ్యయన కేంద్రంలో నిర్వహించిన మాలమహానాడు రాష్ట్ర విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల, మాదిగల జనాభా లెక్కలు, ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ పథకాల వివరాలను అధ్యయనం చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లాలన్నారు. జాతీయ మాలమహానాడు ప్రధానకార్యదర్శి బైరి రమేశ్, కార్యదర్శి ఎ.భాస్కర్, సిహెచ్.నర్సింగ్‌రావు, ఎ.పురుషోత్తం, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

యునాని పరిశోధన కేంద్రంలో జాతీయ సదస్సు నేడు, రేపు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ఎర్రగడ్డలోని యునాని పరిశోధన కేంద్రం ఆడిటోరియంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ ఆధ్వర్యంలో రీసెర్చ్ (యూనాని) సైంటిస్ట్ లెవల్-1 కోసం మెథడాలజీ, హెచ్ఆర్‌డీ కోర్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లపై 'ఏషన్ కమ్ ఇండక్షన్' పేరిట గురు, శుక్రవారాల్లో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు.

బీసీ సంఘాల ఐక్యతకు సమావేశం నేడు


మాట్లాడుతున్న శివశంకర్, చిత్రంలో భాస్కర్, మురళీ, కందగట్ల స్వామి, శ్రీనివాస్, కందగట్ల భిక్షపతి తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: బీసీల హక్కుల సాధన, అన్ని బీసీ కుల సంఘాల్లో ఐక్యత తీసుకురావడానికి ఈనెల 26న అఖిల పక్ష పార్టీలు, కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బోల్ల శివశంకర్ తెలిపారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. బుధవారం పద్మశాలి భవన్‌లో ఆయన మాట్లాడుతూ. బీసీ కుల గణన చేసి రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీల పట్ల కంటితుడుపు చర్యగా ఏదో ఇస్తున్నట్లు మాయ చేస్తోందనే అనుమానం కలుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి తీర్మానాన్ని మరిచిపోయిందన్నారు. సమావేశంలో అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో స్థలంలో సంస్థే ప్లాంట్ నిర్మించాలి


సమావేశంలో టీజీపీఈజేఏసీ నేతలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రామగుండంలో జెన్‌కోకు చెందిన స్థలంలో సంస్థ ఆధ్వర్యంలోనే పవర్ ప్లాంట్ నిర్మించి జెన్‌కోను కాపాడాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ ఐకాస డిమాండ్ చేసింది. ఆర్టీఎస్-బీ స్థానంలో జోన్‌కో, సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఐకాస ఛైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం మింట్‌కాంపౌండ్‌లోని విద్యుత్తు ఉద్యోగుల 1104 సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26న నల్ల బ్యాడ్జీలతో నిరసన, 30 నుంచి అక్టోబరు 3 వరకు విద్యుత్తు ఉత్పత్తి సంస్థల్లో గేట్ మీటింగ్, 4, 5వ తేదీల్లో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అన్ని ఉత్పత్తి కేంద్రాలు, కార్పొరేట్, జిల్లా, డివిజన్ కార్యాలయాలు, విద్యుత్తు సౌధలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. తదుపరి కార్యాచరణపై అక్టోబరు 5న సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఐకాస కో-ఛైర్మన్ శ్రీధర్, కో-కన్వీనర్ బీసీ రెడ్డి, వైస్‌ఛైర్మన్ అనిల్ కుమార్, ప్రతినిధులు వజీర్, శ్యామ్‌మనోహర్, నాగ తులసి రాణి, రాంజీ, సదానందం, కరుణాకర్‌రెడ్డి, వెంకట్ నారాయణరెడ్డి, ఈశ్వర్‌గౌడ్, వేణు, సుధీర్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

ఫార్మా రంగంలో రాష్ట్రం అగ్రస్థానం: మంత్రి


రక్తదాతను అభినందిస్తున్న దామోదర రాజనర్సింహ

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఫార్మా రంగంలో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్స్ (ఏపీఐ) ఉత్పత్తిలో, పెద్దసంఖ్యలో రిటైల్ ఫార్మసీలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రస్తుతం ఫార్మసిస్టులకు ఎంతో డిమాండ్ ఉందని, ఆరోగ్య సంరక్షణలో వారి పాత్ర కీలకం అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్‌ఉలూమ్ ఫార్మసీ కళాశాల (ఎస్‌యూపీసీ), రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బుధవారం కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఫార్మసీ సీట్లను పెంచి ఈ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఛైర్మన్ అజయ్ మిశ్రా రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. ఎస్‌యూఈఎస్ గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్, ఎస్‌యూపీసీ ప్రిన్సిపల్ డా.కోనేరు అనుపమ, ఎస్‌యూఈఎస్ ఛైర్మన్ మహ్మద్ వలీయుల్లా, కోశాధికారి డా.మీర్ అక్బర్ అలీ ఖాన్, బోర్డు సభ్యుడు అమేర్ జావేద్, సభ్యులు ఒమర్ జావీద్, ఫయాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ



స్వర్ణపతకంతో సాహితి

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఇంటర్ స్కూల్ కరాటే టోర్నమెంట్ అండర్-14 విభాగంలో శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సాహితి (ఆరోతరగతి) స్వర్ణ పతకం సాధించింది. పి.లోహిత్‌శౌర్య (ఎనిమిదో తరగతి) ఎ.చక్రేష్‌కుమార్ (ఏడవ తరగతి) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. పాఠశాల ఛైర్మన్ శిరీష భవానీశంకర్ విద్యార్థులను అభినందించారు.

సీఈఐజీని కలిసిన గుత్తేదారులు


రామాంజనేయులును సత్కరిస్తున్న సంఘం నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్తు ప్రధాన తనిఖీ అధికారి (సీఈఐజీ) సీహెచ్ రామాంజనేయులును తెలంగాణ విద్యుత్తు గుత్తేదారుల సంఘం నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి, సీనియర్ నాయకులు ఉన్నారు.

బంగారు ఆభరణాల చోరీ కేసు.. ఇద్దరి అరెస్టు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: పంజాగుట్టలోని లలితా జ్యువెల్లర్స్‌లో గత నెల జరిగిన చోరీ ఘటనలో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 7వ తేదీన లలితా జ్యువెల్లర్స్‌లో జరిగిన ఆడిట్‌లో సుమారు 12.2 గ్రాముల బంగారు చెవి కమ్మలు కనిపించకపోవడంతో షోరూం నిర్వాహకులు సీసీ పుటేజీ పరిశీలించారు. ఓ వ్యక్తితో పాటు మరో మహిళ కలిసి 6వ తేదీన వచ్చి చెవి కమ్మలను చోరీ చేసినట్టు గుర్తించారు. షారూమ్ ఉద్యోగుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నేరేడ్‌మెట్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ కె.నర్సింగ్‌రావు, ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన కె.అరుణ చోరీచేసినట్టు గుర్తించి బుధవారం వారిని అరెస్టు చేశారు. చెవి కమ్మలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

విధులకు ఆటంకం.. 7 రోజుల జైలు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ఓ యువకుడికి న్యాయస్థానం 7 రోజుల జైలుశిక్ష విధించింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... రహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన పవన్ ఆటోడ్రైవర్. ఈనెల 24న రాత్రి మద్యం తాగి స్నేహితులతో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ మధురానగర్ పోలీస్ స్టేషన్ ముందు పడిపోయారు. పోలీసులు వెళ్లగా ఇద్దరు పారిపోయారు. మద్యం మత్తులో ఉన్న పవన్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించాడు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు మనోరంజన్ కాంప్లెక్స్‌లోని 10వ స్పెషల్ కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి మంద మురళి శిక్ష ఖరారు చేశారు.

వానకు మెట్రో గొడుకు..!



రహదారిపై రెడ్ సిగ్నల్ పడటంతో వాహనాదారులు ఆగినట్లు కనిపిస్తుంది కదా.. వాస్తవానికి భారీ వర్షం కురిసినప్పుడు తడవకుండా పంజాగుట్ట మెట్రో స్టేషన్ కింద వాహనదారులు ఇలా ఆగుతున్నారు. – న్యూస్‌టుడే, యూసుఫ్‌గూడ

చరవాణి వల్ల కంటి సమస్యలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో వాసవి హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ కె.రఘువీర్ ప్రారంభించి మాట్లాడారు. జంక్ ఫుడ్‌తో ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారని, స్మార్ట్ ఫోన్‌తో కంటి సమస్యలు తెచ్చుకుంటున్నారన్నారు. కంటి డాక్టర్ ఇంద్రజ, గైనకాలజిస్ట్ శ్రీలక్ష్మి, పల్మనాలజిస్ట్ డా. రూప పరీక్షలు చేశారు.

ఆకట్టుకున్న 'కనక పుష్యరాగం'


టికెట్లు విక్రయిస్తున్న డా.కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: 'ప్రతి నెల నాటకం. .. ప్రేక్షకుడికి వినోదం... టికెట్ కొనండి. నాటకం చూడండి' నినాదంతో రసరంజని సంస్థ బుధవారం రవీంద్రభారతిలో విజయవాడకు చెందిన 'దృశ్యవేదిక' సమర్పణలో 'కనక పుష్యరాగం' నాటకాన్ని ప్రదర్శించింది. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి.రమణాచారి స్వయంగా ప్రేక్షకులకు టికెట్లు విక్రయించారు. ఆరు దశాబ్దాల క్రితం ఎన్నో బహుమతులు పొందిన 'కనక పుష్యరాగం' నాటకానికి కె.వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించగా శ్రీరాఘవ రచించారు. వెంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఎస్.కె.మిత్రో దర్శకత్వంలో నేటితరం ప్రేక్షకుల కోసం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మూగ కుమార్తె వివాహం కోసం ఓ తండ్రి పడినపాట్లను ఇందులో చక్కగా ఆవిష్కరించారు.


ప్రదర్శనలో ఓ సన్నివేశం

నార్సింగిలో దాండియా, బతుకమ్మ నైట్స్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: నార్సింగిలోని ఓమ్ కన్వెన్షన్‌లో ఆరం ఈవెంట్ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 4 నుంచి 6 వరకు 'రంగ్ రాత్రి' పేరుతో హైదరాబాద్‌లో అతిపెద్ద దాండియా, బతుకమ్మ నైట్స్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం జూబ్లీహిల్స్‌లోని మిరాయ్ పబ్‌లో ఏర్పాటు చేసిన ముందస్తు కార్యక్రమంలో సంస్థ సీఈఓ కవితాశెట్టి తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో ధరలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: (ఇవి బుధవారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట 43, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 65, క్యాప్సికం 75, పచ్చకాకర 38, పందిరిబీర 38, క్యాబేజి 21, క్యారెట్ 43, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 26, దోస 21, బీట్‌రూట్ 28, ఉల్లి 50, ఆలు 37, చామ 38, మొరంగడ్డ 35, కంద 65, గోబీ 23, సొర 17, పొట్లకాయ 23, అరటి 9, మునగ 6, మామిడి 65, ముల్లంగి 6, ఉల్లిపొరక 35, వేరుశనగ 50, నిమ్మకాయలు(డజన్) 45.

అంబేడ్కర్ వర్సిటీ భూమి జేఎన్ఎఫ్ఏయూకి కేటాయింపుపై నిరసన


విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న కమిటీ సభ్యులు, ఆచార్యులు, ఉద్యోగులు, సిబ్బంది

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఎఫ్ఏయూ) కేటాయించడాన్ని నిరసిస్తూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం వర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. కమిటీ ఛైర్మన్ ఆచార్య పల్లవి కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయానికి జూబ్లీహిల్స్‌లో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 53 ఎకరాల భూమిని కేటాయించిందని, తరాత టి-శాట్‌కు అయిదెకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం అనధికారికంగా కేటాయించిందన్నారు. కేబుల్ బ్రిడ్జి అభివృద్ధికి 4 ఎకరాల భూమిని ఉపయోగించారని, దుర్గం చెరువులో ఇప్పటికే మరో 5 ఎకరాలకు పైగా మునిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షల మంది విద్యార్థులకు సేవలు అందించడానికి నిర్మించిన వివిధ కార్యాలయ భవనాలతో విశ్వవిద్యాలయం 35 ఎకరాల్లో ఉండదని, మల్టీమీడియా భవనం, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ లెర్నింగ్ సెంటర్, నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. యూనివర్సిటీలో ఉన్న భవనాలు సరిపోక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వారికి భవనాలు నిర్మించాల్సి ఉండగా ప్రభుత్వం యూనివర్సిటీ స్థలాలను ఇతరులకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. కమిటీ నాయకులు డా.రవీంద్రనాథ్ సోలమన్, డా.వెంకటేశ్వర్లు, డా.నారాయణరావు, డా.బానోత్‌ధర్మ ఎం.రుషేంద్రమని, ఆచార్య పుష్పాచక్రపాణి, ఆచార్య మాధురి, ఆచార్య మేరీ సునంద, డా.పి.వెంకట రమణ, డా.ఎల్వీకేరెడ్డి, ఎండీ.హబీబుద్దీన్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి

స్వచ్ఛత.. పరిసరాలు పరిశుభ్రత

బాలానగర్, న్యూస్‌టుడే: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో బుధవారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. దుబాయ్‌గేట్ ఎన్‌ఆర్‌ఎస్‌ఏ క్వార్టర్స్ వద్ద రోడ్లపై శుభ్రం చేయించి మొక్కలు నాటారు. ప్రజలు కూడా సహకరించాలని పారిశుద్ధ్య విభాగం డీఈ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. అనంతరం హస్మత్‌పేటలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్ధ్య పర్యవేక్షకుడు మనోహర్‌రెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


దుబాయ్‌గేటు వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

గువాహటిలో డంపింగ్‌యార్డును సందర్శించిన సబిహాబేగం

అల్లాపూర్: అస్సాం రాష్ట్ర అధ్యయన యాత్రలో భాగంగా గువాహటి మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డును అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం బుధవారం సందర్శించారు. గువాహటి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి నగర మేయర్ జి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, సహచర కార్పొరేటర్లతో కలిసి సబిహాబేగం డంపింగ్‌యార్డులోని వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీక్షించారు.



ఎగిరిపోయిన పక్షులు.. మిగిలిన కర్రలు

జంక్షన్ల అభివృద్ధిలో భాగంగా బాలానగర్ టీ జంక్షన్‌లో పక్షుల థీమ్‌తో బొమ్మలు ఏర్పాటుచేశారు. కర్రలు పెట్టి వాటిపై పక్షుల బొమ్మలు అలంకరించారు. ఒక్కొక్కటిగా పక్షులన్నీ ఊడిపోవడంతో.. చివరికి కర్రలు మిగిలాయి. ఏదైనా శాశ్వత ప్రాతిపదికన ఉండేలా ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు తూతూమంత్రంగా ఇలా చేయడం.. నిర్వహణ లేకపోవడం వలన జంక్షన్ల అభివృద్ధి మూణ్నాళ్ల ముచ్చటైంది.
– న్యూస్‌టుడే, బాలానగర్



వేర్వేరు ఘటనల్లో ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు గంజాయి విక్రేతలను బాలానగర్ ఎక్సైజ్, ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వేణుకుమార్ కథనం ప్రకారం.. కూకట్‌పల్లిలో గంజాయి విక్రయిస్తుండగా ధూల్‌పేటకు చెందిన గణేష్‌సింగ్(28), ఉమేష్‌సింగ్(27)ను ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి 1.08కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మరో కేసులో ఫతేనగర్ వంతెన కింద గంజాయి విక్రయిస్తున్న ప్రభుదేవా(20) నుంచి 630గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి ముగ్గురిని కోర్టులో హాజరుపరిచారు.

వ్యర్థాలతో విద్యార్థుల సృజన

రాయదుర్గం, న్యూస్‌టుడే: తెల్లాపూర్ మంథన్ స్కూలు విద్యార్థులు కాగితపు వ్యర్థాలతో బొమ్మలు, అలంకార వస్తువులు తయారు చేసి సృజన చాటారు. వాటిని గౌలిదొడ్డి కేశవనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఆరుగురు తొమ్మిదో తరగతి విద్యార్థులు కాగితపు వ్యర్థాలను గుజ్జుగా మార్చి వివిధ వస్తువులు తయారుచేశారు.

రక్షణ కంచె ఎంతవరకు?

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే

కేపీహెచ్‌బీలో హౌసింగ్‌బోర్డు స్థలాలను రక్షిస్తామంటూ అధికారులు తరచూ చర్యలు చేపట్టినట్లే చేపట్టి ఆటకెక్కించడం పరిపాటిగా మారింది. తాజాగా ప్రభుత్వ ఆదేశాలంటూ అధికారులు ఏడోఫేజ్‌లో పలు దుకాణాలు నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ స్థానిక స్థలాలను పూర్తిస్థాయిలో కాపాడతారా లేదా అనేది చర్చనీయాంశమవుతోంది. విలువైన హౌసింగ్‌బోర్డు స్థలాలను కాపాడి ప్రజావసరాలకు వినియోగించాలని డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికే ఎకరాలు, గజాల చొప్పున స్థలం అన్యాక్రాంతమైందనే ఆరోపణలున్నాయి. 'ఈనాడు' పరిశీలన చేయగా పలుచోట్ల స్థలాలు కబ్జాకు గురైనట్లు తెలిసింది.

చర్చనీయాంశంగా హౌసింగ్‌బోర్డు చర్యలు


మూడోఫేజ్ కనకదుర్గ ఆలయం-బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం మార్గంలో ఆక్రమణకు గురైన స్థలం

ఆక్రమణదారులకు సిబ్బంది భరోసా

కాలనీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో స్థానిక అవసరాలకు హౌసింగ్‌బోర్డు లేఔట్ ప్రకారం 10శాతం స్థలాలను కేటాయించింది. ఇప్పుడు ఆ స్థలాలే కబ్జాదారుల కోరల్లో ఉన్నాయి. మూడోఫేజ్‌లో చిన్న జాగా అద్దె రూ.30నుంచి 40వేల వరకు ఉంటుంది. ఇక్కడ ఇలాంటి స్థలాలు కొల్లగొట్టి.. వ్యాపారాలను నిర్వహించుకుంటూ పోతున్నారు. హౌసింగ్‌బోర్డు అధికారులేమో 25ఏళ్ల క్రితమే జీహెచ్‌ఎంసీకి అప్పగించామని చెబుతున్నారు. కానీ, జీహెచ్‌ఎంసీ పట్టించుకోదు. ఏదైనా నిర్ణయం తీసుకునే సమయంలో మాత్రం హౌసింగ్‌బోర్డు అధికారులే రంగంలోకి దిగుతారు. ఇలా ఇరు శాఖల అధికారులు ఒకరిపైఒకరు చెప్పుకోవడమే ఆక్రమణదారులకు కలిసొస్తోంది. వీరికి క్షేత్రస్థాయి సిబ్బంది భరోసా ఇస్తున్నట్లు తెలుస్తోంది. పైనుంచి చెప్పించుకుంటే తనకు అడ్డు తగల లేదని ఓ హౌసింగ్‌బోర్డు ముఖ్య అధికారి ఆక్రమణదారులకు చెబుతుండటం గమనార్హం.


కేపీహెచ్‌బీ రమ్య మైదానం పక్కన రక్షణ కంచె వేయాల్సిన ప్రాంతం

ఎక్కడెక్కడంటే..

- రమ్య మైదానం వద్ద పొడవునా స్థలాన్ని అధికారులు కాపాడటంలో వైఫల్యం చెందారనే చెప్పుకోవాలి.
- మూడోఫేజ్ కనకదుర్గ ఆలయం దాటిన తర్వాత రహదారికి ఇరువైపులా రూ.కోట్ల విలువ చేసే స్థలానికి రక్షణ లేదు.
- పోచమ్మ గుడి సమీపంలో 44-49, 49-54 బ్లాక్‌ల మధ్య 10శాతం స్థలంలో సుమారు 20ఏళ్లుగా వంటశాల ఏర్పాటుచేసుకున్న నిర్వాహకులు భయపెడుతున్నట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. తాజాగా తాత్కాలికంగా నిర్మించుకున్న వాటిని శాశ్వతం చేసుకునేందుకు ఎదిగారు.
- ఈసేవ రోడ్డులో సైతం స్థలాన్ని స్వాధీనం చేసుకుని కంచె వేయడంలో తాత్సారం చేస్తుండటంతో వ్యాపారాలకు బయానా, అద్దెల పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్నారు.

అన్ని స్థలాలకు కంచె వేస్తాం

హౌసింగ్‌బోర్డు స్థలాలను రక్షించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఖాళీగా ఉన్న స్థలాలను స్వాధీనం చేసుకుని కంచె వేస్తాం. ఈసేవ రోడ్డు ఆనుకుని పొడవైన స్థలాన్ని సైతం స్వాధీనం చేసుకుంటాం.
- కిరణ్‌బాబు, హౌసింగ్‌బోర్డు పశ్చిమ డివిజన్ ఈఈ

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573985, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

వ్యర్థాల తొలగింపు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధి దేవీనగర్ రోడ్డు నంబర్-9లో ఎస్‌ఏసీ గార్డెన్ సమీపంలో రోడ్డు పక్కన వ్యర్థాలు, చెత్త పేరుకుపోయాయి. స్థానికులు అవస్థలు నెలకొని స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ టీసీ కృష్ణయ్య, డీఈ శ్రీనివాసరావు దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో వ్యర్థాలు, చెత్త తొలగించి శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.



వయోవృద్ధులకు భరోసా కల్పిద్దాం

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వచ్చే నెల 1న నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వారోత్సవాలు జరిపి వారికి భరోసా కల్పిద్దామని జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో విద్య, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ, పౌర సరఫరాలు, మహిళా శిశు సంక్షేమ, వయో వృద్ధులు, వయోవృద్ధాశ్రమాల నిర్వాహకులు, వయోవృద్ధుల కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26న వృద్ధాశ్రమాల్లో వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ-సంక్షేమ చట్టం-2007పై అవగాహన సదస్సు, 29న గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు చట్టం టోల్ ఫ్రీ నంబర్-14567పై అవగాహన సదస్సులు, 30న అంగన్‌వాడీ కేంద్రాలు- పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, 1న జిల్లాస్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలతో కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. జిల్లా వయోవృద్ధుల కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, డీఈఓ విజయకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న రఘునాథస్వామి, నాగేశ్వర్‌రావు ఇతరులు

27న సాంస్కృతిక పోటీలు

మేడ్చల్ కలెక్టరేట్: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 27న మేడ్చల్ కలెక్టరేట్‌లో యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసులు-క్రీడల అధికారి జీవీ.గోపాల్‌రావు పేర్కొన్నారు. జానపద నృత్యాలు, పాటలు, కవిత్వం, వ్యాచరచన, చిత్రలేఖనం తదితర పోటీలుంటాయన్నారు. ఉత్తములను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు 26లోపే దరఖాస్తులు పంపించాలన్నారు.


విజ్ఞాన్‌పురికాలనీ ప్రధాన రహదారిలో..


ఖాజాకుంట ఎస్‌టీపీ రోడ్డులో..


వర్షంలోనే సామాన్లు తీసుకువెళ్తున్న కార్మికులు



ప్రశాంత్‌నగర్‌లో తడుస్తూ వాహనదారుడు, యువకుడు

అదే వర్షం.. వరద ప్రవాహం

నియోజకవర్గం పరిధిలో వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం చిరు జల్లులు పడినా.. మధ్యాహ్నం సమయంలో ఓ మోస్తరు భారీ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ వరదతో నిండి కనిపించాయి. వర్షం పడిన ప్రతిసారీ ఇదే దుస్థితి నెలకొంటుంది. ఎక్కడ మ్యాన్‌హోల్ గుంతలున్నాయో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం తగ్గినా నిలిచిన నీటిని తొలగించే ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం. కొత్తగా నిర్మించిన రోడ్లలోనూ వరద కాలువల ఏర్పాట్లు లేకపోవడంతో జలమయమయ్యాయి. – న్యూస్‌టుడే, కూకట్‌పల్లి

అటెండర్‌ను సన్మానించిన అధ్యాపకులు


నాగముఖేష్‌రాజును సన్మానిస్తున్న బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూలో రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంబడించి చాకచక్యంగా పట్టుకున్న వర్సిటీ అటెండర్ నాగముఖేష్‌రాజును బయో టెక్నాలజీ విభాగం అధ్యాపకులు బుధవారం సన్మానించారు. ఈ నెల 13న నలుగురు సివిల్ విద్యార్థులతో కలిసి ఓ వ్యక్తి కారును అతివేగంగా నడిపి క్యాంపస్‌లో బయో టెక్నాలజీ విద్యార్థి వంశీకృష్ణను ఢీ కొట్టి తర్వాత ఆపకుండా వేగంగా బయటికి వెళ్లి రోడ్డుపై మరో వ్యక్తిని ఢీ కొట్టి గాయాలకు గురిచేశారు. ఇది గమనించిన మాటలు రాని నాగముఖేష్‌రాజు ఆ కారును తన ద్విచక్ర వాహనంపై వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. నాగముఖేష్‌రాజు ధైర్యాన్ని అభినందిస్తూ ప్రవేశాల విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సైదానాయక్ సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

సీపీఎం కేపీహెచ్‌బీ శాఖ మహాసభ

బాలానగర్, న్యూస్‌టుడే: సీపీఎం కేపీహెచ్‌బీ శాఖ మహాసభ బుధవారం బాలానగర్ శ్రీశ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగింది. పార్టీ జిల్లా కార్యవర్గసభ్యురాలు వినోద జెండా ఎగురవేశారు. పలు అంశాలపై తీర్మానం చేసిన నేతలు శాఖ కార్యదర్శిగా కె.కృష్ణనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సీతారాం ఏచూరి, తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు. మండల కార్యదర్శి ఎం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ జెండా ఆవిష్కరణలో నేతలు

కనపడని ప్రమాద సూచీ



వాహనదారులు వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ పోలీసులు మూసాపేట కైత్లాపూర్ నుంచి హైటెక్ సిటీకి వెళ్లే దారిలో ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. కానీ, పక్కన చెట్లకొమ్మలు పెద్దగా పెరగడంతో బోర్డు కనపడని పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని బోర్డు కనిపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధి చేయక అక్రమ పార్కింగ్


ఏఎస్‌రాజునగర్ కమాన్ నుంచి వివేకానందనగర్ రోడ్డులో..


టైల్స్‌ను తొలగించిన ప్రాంతంలో..

కూకట్‌పల్లి జాతీయ రహదారిపై సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానందనగర్ వరకు సర్వీస్ రోడ్డులో చిన్న షెడ్లు, టైల్స్, ఇతర నిర్మాణాలు చేసి వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. రెండు నెలల క్రితం అధికారులు వీటిని తొలగించారు. సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేస్తామని చెప్పి.. తరువాత పట్టించుకోకపోవడంతో మళ్లీ యధావిధిగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. సర్వీస్ రోడ్డు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కానిస్టేబుళ్ల క్రీడాపోటీలు

రాయదుర్గం: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని సైబరాబాద్ జోయల్ డేవిస్ అన్నారు. రెండు రోజుల పాటు శిక్షణలో ఉన్న కానిస్టేబుల్స్ క్రీడా పోటీలు కమిషనరేట్ పరేడ్ మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్‌లలో పోటీలు నిర్వహించగా 270 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవంలో జాయింట్ సీపీ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. సీటీసీ ప్రిన్సిపల్, డీసీపీ ఎల్‌సీ నాయక్, వైస్ ప్రిన్సిపల్ రాంచంద్రుడు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ శ్రీనివాస్, ఏసీపీ గంగారామ్, ఆర్‌ఐ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు


కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాపులో సభ్యత్వం అందిస్తున్న యువమోర్చా నేతలు

కూకట్‌పల్లి: బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాపులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ పలువురికి సెల్‌ఫోన్‌లో సభ్యత్వం చేశారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా నిర్వహించాలన్నారు. యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధి హరిప్రసాద్, మహేష్, సుదీంద్ర, కుమార్ పాల్గొన్నారు.

పటాలంలో పోలీస్ క్యాంటిన్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో సంజయ్‌కుమార్, సిద్ధికి, సిన్నీ తదితరులు

మాదాపూర్: కొండాపూర్‌లోని 8వ పోలీసు పటాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్సిడీ పోలీస్ క్యాంటిన్ (ఎస్‌పీసీ)ని బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సంజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పటాలంలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది క్యాంటిన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీజీఎస్‌పీ డీఐజీ సిద్ధికి, పటాలం కమాండెంట్ సి.సన్నీ, అదనపు కమాండెంట్ కె.వీరయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు బి.సిత్రం, ఎం.రెహమాన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విభాగిని నిర్మాణం.. కసరత్తు ప్రారంభం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

రెండు రోడ్లలో రూ.2.8కోట్లతో పనులు

ఒకప్పుడు రోడ్డు మధ్యలో చిన్న డివైడర్ ఏర్పాటుచేసేవారు. ఎక్కడపడితే అక్కడ పాదచారులు రోడ్డు దాటడం.. ప్రమాదాలు జరగడం.. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వంటివి వెలుగుచూసేవి. దీంతో ప్రజలు ఇష్టానుసారం రోడ్డు దాటే వీలు లేకుండా చర్యలు చేపట్టారు. భారీ విభాగిని ఏర్పాటుకు శ్రీకారం చుట్టి.. ఏ మాత్రం అవకాశం ఉన్నా.. రోడ్ల మధ్యలో కొన్నేళ్లుగా నిర్మాణం చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల ఏర్పాటుచేయగా.. మరికొన్ని చోట్ల తాజాగా చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణే కాకుండా.. వీటి మధ్యలో మొక్కలు పెట్టడం ద్వారా రోడ్లకు పచ్చందాలు తీసుకొస్తున్నారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని రెండు వేర్వేరు రోడ్లలో జరుగుతున్న విభాగిని నిర్మాణ పనుల గురించి తెలుసుకుందాం..

చెరువు రోడ్డులో అసంపూర్తి పనులు

కూకట్‌పల్లి రంగధాముని చెరువు రోడ్డులో రెండేళ్ల క్రితం చిన్నగా ఉన్న విభాగిని తొలగించి దానిస్థానంలో కొత్తగా భారీది నిర్మించారు. అయితే, ఈ రోడ్డు మొత్తం పొడవు 1.7కిలోమీటర్లు ఉండగా.. యూటర్న్‌లు.. మధ్యలో పాదచారులు దాటేందుకు ఏర్పాట్లు వదిలేస్తే.. 1.5కిలోమీటర్ల దూరం విభాగిని నిర్మించాల్సి ఉంది. అప్పట్లో కేటాయించిన నిధులతో గుత్తేదారు 930మీటర్ల పొడవు మాత్రమే నిర్మించారు. దీంతో సగం భారీ.. మరి కొంత చిన్న డివైడర్లతో రోడ్డు అధ్వానంగా కనిపిస్తుంది. దీనిపై ఇప్పటికే 'ఈనాడు'లో కథనాన్ని ప్రచురించడంతో స్పందించిన అధికారులు 600మీటర్ల పొడవు దూరం విభాగిని నిర్మాణానికి రూ.80 లక్షల ఆమోదం తీసుకొని తాజాగా పనులు ప్రారంభించారు. ఇరువైపులా పొక్లెయిన్‌తో తవ్వి.. తవ్విన చోట గోడ నిర్మాణానికి స్టీలు కడుతున్నారు.


రంగధాముని చెరువు రోడ్డులో పొక్లెయిన్‌తో తవ్వకాలు

కేపీహెచ్‌బీలో కొత్తగా

కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్-1 గాంధీ విగ్రహం నుంచి నెక్సస్ మాల్ రాజీవ్ విగ్రహం వరకు మొత్తం రోడ్డు పొడవు 2 కిలోమీటర్లు ఉంటుంది. ఇందులోనూ యూటర్న్‌లు.. పాదచారులు రోడ్డు దాటే ఏర్పాట్లు చేస్తే.. 1.6కిలోమీటర్ల దూరం విభాగిని నిర్మించాల్సి ఉంటుంది. రూ.2కోట్ల నిధులు ఆమోదం తీసుకున్న అధికారులు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. ఇక్కడ తవ్వకాలు చేపట్టగా.. ప్రస్తుతం ఉన్న చిన్న డివైడర్‌ను తొలగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చిన్న డివైడర్‌పై కొంతమేర చెట్లు, మొక్కలు ఉండడంతో వాటిని సంరక్షిస్తూ.. ఈ పనులు చేపట్టారు. ఇరువైపులా కాంక్రీట్‌తో నిర్మించి మధ్యలో మొక్కలు ఏర్పాటుచేసేందుకు స్థలాన్ని వదిలేస్తున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఆకర్షణీయమైన మొక్కలు ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారు. నగర సుందరీకరణలో భాగంగా ఈ రెండు రోడ్లలో ఈ పనులు చేపట్టినట్లు ఏఈ శ్రీనివాస్ చెప్పారు. తొందరగా పూర్తిచేసి రంగులేసి యూబీడీకి అప్పగిస్తామని, వారు పచ్చదనం అభివృద్ధి చేస్తారన్నారు.


స్టీలు కడుతున్న సిబ్బంది

దస్త్రం.. జర భద్రం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్లక్ష్యం

మూసాపేట: అదో ప్రభుత్వ కార్యాలయం.. దస్త్రాలు సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలి. కానీ, మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటువంటి నిర్లక్ష్యమే కొనసాగుతుంది. భవన యజమానికి సంబంధించిన న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా కార్యాలయ అంతర్భాగంలో ఉన్న ఓ షట్టరును బ్యాంకు అధికారులు 6 నెలల క్రితం సీజ్ చేశారు. వాస్తవానికి సదరు షట్టరులో కార్యాలయానికి సంబంధించిన పలు రకాల ధ్రువపత్రాలను నిల్వ ఉంచుతూ వచ్చారు. అయితే, ఉన్న ఫలంగా షట్టరును బ్యాంకు వారు సీజ్ చేయడంలో అందులో నిల్వ ఉంచిన దస్త్రాలను మూత్రశాల విభాగానికి వెళ్లే గల్లీలో గుట్టలుగా పోశారు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన సబ్ రిజిస్ట్రార్ విజయ్ హయాం నుంచి వాటి ఆలనాపాలనా గాలికొదిలేశారు. అయితే ఆ దస్త్రాలు ముఖ్యమైనవా? లేక నిరుపయోగమైనవో తెలియదు కానీ భద్రత మాత్రం కరవైంది. మూత్రశాలల విభాగానికి వచ్చిపోయే వారిలో ఎవరైనా సదరు దస్త్రాలను ఎత్తుకెళ్లే, అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ఈ దస్త్రాలను భద్రపరుచుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గుట్టలుగా దస్త్రాలు

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



వివేకానందనగర్ కాలనీలో సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలోని ఇద్దరికి బుధవారం వివేకానందనగర్‌కాలనీలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. మాదాపూర్ ఆదిత్యానగర్‌కు చెందిన హుస్సేన్‌కు రూ.1.50 లక్షలు, వివేకానందనగర్‌కాలనీ డివిజన్ సుమిత్రానగర్ నివాసి లక్ష్మికి రూ.1.25 లక్షల చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌యాదవ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట



రాయదుర్గం ఎఫ్‌డీడీఐ వద్ద పైపులైన్‌కు మరమ్మతు చేసిన ప్రదేశం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద తాగునీటి పైపులైన్ లీకేజీకి జలమండలి సిబ్బంది మరమ్మతులు చేసి నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. అక్కడ నీటి వృథాపై గతంలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ప్రధాన లైన్ కావడంతో షట్‌డౌన్ తీసుకోవాల్సి ఉంటుందని.. తద్వారా గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ప్రాంతాల్లోని నీటి సరఫరాపై ప్రభావం పడుతుందని అధికారులు చెప్పారు. షట్‌డౌన్‌కు సమయం తీసుకుని ఎట్టకేలకు మరమ్మతు చేపట్టి నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు.

సంక్షిప్త సమాచారం

అధికారులకు అదనపు బాధ్యతలు

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇతర అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఏసీపీ మెహరా స్థానంలో జోన్ ఏసీపీగా పనిచేస్తున్న సాయిబాబాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రోడ్డు విస్తరణ ప్రక్రియ అధికారి రవీందర్‌కు టీపీఎస్ రమేష్ స్థానంలో అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

చందానగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. బుధవారం గంగారం ప్రభుత్వ పాఠశాలలో వైద్యులు శ్రీధర్‌రెడ్డి దంత పరీక్షలు చేసి పళ్ల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ విద్యార్థులకు టూత్ బ్రష్, పేస్ట్ అందజేశారు.

పార్కు స్థలంలో నిర్మాణాలపై ఫిర్యాదు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి అంజయ్య నగర్‌లోని ఎకరం 20 గుంటల పార్కు స్థలంలో అక్రమంగా భవనాలు నిర్మాణం చేస్తున్నారని జనం కోసం సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. పార్కు స్థలానికి దొంగ పత్రాలు తయారు చేసి నిర్మాణాలు సాగిస్తున్నారని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి వివరించారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు.

ఫార్మాసిస్టులకు ఉద్యోగావకాశాలు

పటాన్‌చెరు: అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ శాఖల్లో ఫార్మసిస్టులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని కేంద్ర ఔషధ నియంత్రణ మండలి డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ రామ్ కిషన్ అన్నారు. ఈ మేరకు బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం జి ఫార్మా నెక్సస్ అనే సావనీర్‌ను విడుదల చేశారు. ఫార్మా ప్రిన్సిపల్ శివకుమార్, అధ్యాపకుడు బప్పా ఆదిత్య చటర్జీ, ప్రియాంక దాస్ తదితరులు ఉన్నారు.

'భాజపాకే అన్ని వర్గాల మద్దతు'

మియాపూర్: ప్రధాని మోదీ నాయకత్వంలోనే భాజపాకే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎం.రవి కుమార్ యాదవ్ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రామ్ నరేష్ నగర్‌లో బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కనీసం బూత్ నుంచి 300 సభ్యత్వాలు నమోదు చేయాలని నాయకులకు సూచించారు. అనంతరం సంఘ సంస్కర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

శేరిలింగంపల్లి: బీహెచ్ఈఎల్ పాత ఎంఐజీ కాలనీలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రేణుక, రత్న, విజయ్ రాజ్, దారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పురపాలక పరిధి జయలక్ష్మినగర్ కాలనీ నాలుగో ఫేజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా బండి వినయ్, సంయుక్త కార్యదర్శులుగా మల్లయ్య, రాజ్‌కుమార్ గౌడ్, కోశాధికారిగా నరేందర్‌లను ఎన్నుకున్నారు.

స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం

శేరిలింగంపల్లి: ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డితో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాన కూడళ్ల దగ్గర, పార్కుల ప్రాంతాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జోన్ పరిధిలోని ఉప కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

సంతల్లో శుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్‌లో వారాంతపు సంతల వద్ద వ్యర్థాల సేకరణకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. వారంలో ఏదో ఒక రోజు కూరగాయల సంతలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో సంతల నిర్వహణ అనంతరం చెత్త తొలగింపు సమస్యగా మారింది. కూరగాయల అమ్మకాల అనంతరం పాడైపోయిన కూరగాయలు అక్కడే పారబోసి వెళుతున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీవాసుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక కసరత్తు చేపడుతున్నారు.

వ్యర్థాలు వేసేందుకు సంచులు

డివిజన్లలో పలు చోట్ల జరిగే సంతల్లో కూరగాయలు అమ్మేవారికి ప్రత్యేకంగా కవర్లు అందజేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు భావిస్తున్నారు. అమ్మకాల అనంతరం వారి బండి వద్ద ఉండే చెత్తను వారే కవర్లలో వేసి ఒకచోట వేయాలి. సంతలో కూర్చున్న వారి సంఖ్యను బట్టి మున్సిపల్ సిబ్బంది ఒక్కో కవరు చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. కవర్లు ఇవ్వడం, అందరూ ఒక చోట వేసిన చెత్త కవర్లను తిరిగి తీసుకెళ్లే బాధ్యత రాంకీ సంస్థ సిబ్బందికి అప్పగించారు. సంతలు జరిగే రోజుల్లో ఆ ఏరియా పారిశుద్ధ్య విభాగం ఎస్ఎఫ్ఏ ఎక్కడా కూరగాయల వ్యర్థాలు ఉంచకుండా కవర్లోనే వేయాలని అమ్మకందార్లకు చెబుతారు. అందరూ ఒక చోట కవర్లు వేసేలా ఎస్ఎఫ్ఏ పర్యవేక్షిస్తారు. సంతలకు కేటాయించిన సమయాన్ని బట్టి నిర్వహణ ముగిశాక చెత్త కవర్లు తీసుకెళ్లేందుకు ప్రాంతాల వారీగా ప్రత్యేక వాహనాలను సిద్ధం చేశారు. వాహనాలు సమయపాలనను ఆ ప్రాంత ఎస్ఆర్‌పీలు పర్యవేక్షిస్తారు. సంతలో వ్యర్థాలను తొలగించిన అనంతరం ఆ ప్రదేశాన్ని శుభ్రపరిచేందుకు సిబ్బంది దిని కేటాయిస్తున్నారు. అక్కడ ఉన్నందుకు అమ్మకందారులు ఒక్కొక్కరూ రూ.10 సిబ్బందికి ఇచ్చేలా చూడాలని జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికే ఆ ప్రాంత ఎస్ఆర్‌పీలకు సూచించారు.



హుడా కాలనీలో కూరగాయల సంత

ఏ రోజు చెత్త ఆ రోజే తొలగింపు

– మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్, చందానగర్ సర్కిల్

వారం వారం జరిగే సంతల వల్ల పరిశుభ్రత లోపిస్తోంది. ఆ సమస్యను కొలిక్కి తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. సర్కిల్‌లో వారాంతపు సంతలు జరిగే 27 ప్రదేశాల్లో సంతలు ముగిసిన రాత్రి పూటే అక్కడ చెత్త కనిపించకుండా చర్యలు తీసుకుంటాం. ఈ ప్రక్రియలో పారిశుద్ధ్య విభాగం వైద్యాధికారి, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, ఎస్ఆర్‌పీలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడతారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

రామచంద్రాపురం రూరల్, మియాపూర్, శేరిలింగంపల్లి, ఆల్విన్ కాలనీ, న్యూస్‌టుడే:

? తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామంలో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. మైపులను శుభ్రం చేయించాలి. – సురేందర్, ముత్తంగి

✔ గ్రామంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం, వార్డు ఆఫీసర్‌తో పని చేయిస్తున్నాం. లీకేజీలపై పరిశీలన చేసి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. – సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

? మియాపూర్ దత్త సాయి నగర్ కాలనీ ప్రవేశద్వారం వద్ద సాయంత్రం వేళలో కొందరు యువకులు బల్లలపై కూర్చొని మద్యం తాగుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. – లక్ష్మీదేవి, దత్త సాయి నగర్

✔ గతంలో కాలనీలో చెందిన మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టాం. సీసీ కెమెరాలు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – వెంకటేష్, ఎస్ఐ, మియాపూర్

? కొండాపూర్ మజీద్ బండ మారుతినగర్ జశ్విత లేఅవుట్ ప్రాంతంలో వర్షం పడితే అడుగు పెట్టలేనంత బురదమయంగా మారుతోంది. ఎస్ఎంఆర్ వినయ్ వెనుక గేటు ప్రాంతంలో వ్యర్థాలు పోస్తున్నారు. – రమేష్, కొండాపూర్

✔ ఆయా సమస్యలపై సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటాం. – ముకుందరెడ్డి, ఉప కమిషనర్, శేరిలింగంపల్లి సర్కిల్

? మాధవరం కాలనీలోని 8, 9, 10 రోడ్లలో మ్యాన్‌హోల్స్ ధ్వంసమై రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సమీపంలో పాఠశాలలు ఉండడంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉంది. – నవీన్, మాధవరం కాలనీ

✔ పరిశీలించి మరమ్మతు చేస్తాం. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తాం. – సత్యనారాయణ, పర్యవేక్షణ అధికారి, భాగ్యనగర్ కాలనీ జలమండలి కార్యాలయం

స్పందనకు వందనం

మియాపూర్ జేపీ నగర్ నుంచి ప్రశాంత్‌నగర్ వెళ్లే మార్గంలో విశ్వనాథ్ గార్డెన్స్ వద్ద రోడ్డు పూర్తి అధ్వానంగా మారడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులు స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమయ్యాయి. సమస్యను డీఈ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన అక్కడ గుంతలను కాంక్రీట్‌తో పూడ్చించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు.

పోలీసు పటాలంలో క్యాంటీన్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో సంజయ్‌కుమార్, సిద్ధికి, సిన్నీ తదితరులు

మాదాపూర్, న్యూస్‌టుడే: కొండాపూర్‌లోని 8వ పోలీసు పటాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్సిడీ పోలీస్ క్యాంటీన్ (ఎస్‌పీసీ)ని బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సంజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పటాలంలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది క్యాంటీన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీజీఎస్‌పీ డీఐజీ సిద్ధికి, పటాలం కమాండెంట్ సి.సన్నీ, అదనపు కమాండెంట్ కె.వీరయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు బి.సిత్రం, ఎం.రెహమాన్, ఎం.నాగభూషణం బి.రాంబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందిస్తే మేలు



ప్రదర్శన తిలకిస్తున్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: చదువుతున్న సమయంలోనే విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కార్పొరేటర్ సింధు అన్నారు. ఈ మేరకు బుధవారం భారతీ నగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీ విద్యాభారతి పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభించి తిలకించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ సామాజికంగా జరుగుతున్న విషయాలను పిల్లలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాపీఠానికి చెందిన పాఠశాలల విద్యార్థులు వందకు పైగా నమూనాలను ప్రదర్శించారు.

ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ సర్వే



ఇస్నాపూర్ జాతీయ రహదారిపై పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్, ఇతర అధికారులు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: పారిశ్రామికవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలబడకుండా ఎప్పటికప్పుడు నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్ చెప్పారు. ఈ మేరకు బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ పాశమైలారం గ్రామాల్లో డీఎస్పీ రవీందర్ రెడ్డితో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నుంచి భారీ వాహనాలు ఒకేసారి రోడ్లపై రావడం వల్ల ట్రాఫిక్ నిలుస్తుందని తెలిపారు. వీటిని నియంత్రించేందుకు వీలుగా పాఠశాలల బస్సులు తిరిగే సమయంలో పరిశ్రమల వాహనాలు రోడ్లపై రానివ్వకుండా వాటి యజమానులకు తాకీదులు జారీ చేస్తామని చెప్పారు. సీఐలు ప్రవీణ్ రెడ్డి, లాలు నాయక్, స్వామి గౌడ్ తదితరులు ఉన్నారు.

రద్దీ నివారణకే కూలీల అడ్డా మార్పు

మియాపూర్: మియాపూర్ గచ్చిబౌలి మార్గంలోని హఫీజ్‌పేట మార్తాండ నగర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా అక్కడ ఉన్న అడ్డాను నోవాటెల్ రోడ్డుకు మార్చినట్లు మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అడ్డా కూలీలతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి సమస్యపై వారికి అవగాహన కల్పించారు. ఇక్కడ ప్రధాన రహదారి కావడంతో పాటు నిత్యం వేలాది వాహనాలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుందని, కూలీల కోసం వచ్చే ఆటోలు రోడ్డుపై నిలపడం, కొందరు కార్మికులు అవగాహన లేక ఇక్కడ రోడ్డు దాటే ప్రయత్నంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అడ్డాను ఆర్టీవో ఆఫీస్ సమీపంలో నోవాటెల్ రోడ్డులోకి మార్చటానికి కార్మికులూ సముఖత వ్యక్తం చేశారని చెప్పారు.

సందడిగా కానిస్టేబుల్స్ క్రీడాపోటీలు



సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌తో విజేతలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని, ఆటలకు తప్పకుండా ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ జోయల్ డేవిస్ అన్నారు. రెండు రోజుల పాటు శిక్షణలో ఉన్న కానిస్టేబుల్స్ క్రీడా పోటీలు కమిషనరేట్ పరేడ్ మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్‌లలో పోటీలు నిర్వహించగా 270 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవంలో జాయింట్ సీపీ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. సీటీసీ ప్రిన్సిపల్, డీసీపీ ఎల్‌సీ నాయక్, వైస్ ప్రిన్సిపల్ రాంచంద్రుడు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ శ్రీనివాస్, ఏసీపీ గంగారామ్, ఆర్ఐ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా వన మహోత్సవం



కొండాపూర్ పాలపిట్ట పార్కు నుంచి బొటానికల్ గార్డెన్ మార్గంలో రహదారి మధ్య డివైడర్‌లో పెట్టేందుకు అలంకరణ మొక్కలు తీసుకొస్తున్న కూలీలు

వ్యర్థాలతో విద్యార్థుల సృజన



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మంథన్ స్కూల్ విద్యార్థిని

రాయదుర్గం, న్యూస్‌టుడే: తెల్లాపూర్ మంథన్ స్కూలు విద్యార్థులు కాగితపు వ్యర్థాలతో బొమ్మలు, అలంకార వస్తువులు తయారు చేసి సృజన చాటారు. వాటిని గౌలిదొడ్డి కేశవనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఆరుగురు తొమ్మిదో తరగతి విద్యార్థులు కాగితపు వ్యర్థాలను గుజ్జుగా మార్చి వివిధ వస్తువులు తయారుచేశారు. పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ప్రాజెక్టు గో కురిన్‌లో భాగంగా దీన్ని చేపట్టారు. బుధవారం కేశవనగర్ విద్యార్థులకు అందజేసి వారితో ఆడిపాడి సందడి చేశారు. పలు వస్తువులు, దుస్తులను సేకరించి అందజేశారు. ప్రిన్సిపల్ సుర్జీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఏడుగురికి గాయాలు

జోగిపేట: కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఆరుగురు ఉపాధ్యాయులు, కారు చోదకుడు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం అందోలు మండలం సంగుపేట శివారులోని 161వ నంబరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందోలు మండలం అక్సానిపల్లి, నేరడిగుంట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వరలక్ష్మి, పూర్ణచందర్, రాంచందర్, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ, జ్యోతి రత్నకుమారిలు ప్రతీరోజు బీహెచ్ఈఎల్, పటాన్‌చెరు ప్రాంతాల నుంచి అందోలు మండలంలోని అక్సానిపల్లికి చెందిన ప్రవీణ్ కారులో వస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం కారులో వస్తుండగా అందోలు మండలం సంగుపేట శివారులో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న అందరూ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ నాయకులు పరామర్శించారు.

విద్యుదాఘాతంతో వాచ్‌మెన్ మృతి

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: వాచ్‌మెన్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కాకినాడకు చెందిన ఎస్. వీరబాబు(30) కొండాపూర్ హెచ్ఎఎల్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 6.30 గంటలకు భవనంలో లైట్లు ఆఫ్ చేస్తుండగా విద్యుత్తు తీగలు తగలడంతో కిందపడిపోయాడు. స్థానికుల సాయంతో భార్య భవాని అతడిని కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన ఒగ్గు కథ ప్రదర్శన



సంప్రదాయ వాయిద్యాలతో కళాకారులు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చేపట్టిన రెండు రోజుల ఒగ్గు కథ కళారూపాల ప్రదర్శన, కార్యశాల ముగిసింది. జానపద సాంస్కృతిక అధ్యయన కేంద్రం (సీఎఫ్‌సీఎస్), స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఎల్లమ్మ పరశురాముడి సంవాదం, మల్లన్న కల్యాణం, గొల్ల కేతమ్మ మేడలమ్మ సమతుల వాదం తదితర అంశాలను ప్రదర్శించారు. వివిధ వాయిద్యాల ప్రత్యేకతలను వివరించారు. కొమురవెల్లి మలన్న ఒగ్గు కథ కళాబృందం సింగారపు రాజ్‌కుమార్, హెచ్‌సీయూ పూర్వవిద్యార్థి, నాటక రచయిత డా.కుమార స్వామి ఆధ్వర్యంలో ఒగ్గు కథ విశిష్టత గురించి అవగాహన కల్పించారు. అధ్యయన కేంద్రం అధిపతి డా.జాలీ పుత్తుస్సేరి, ప్రొఫెసర్ సాంబశివ రాజు, నిజిల్, వసుమతి, ధనలక్ష్మి, మల్లేశ్వరి, లక్ష్మణ్, కళాకారులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ సమస్యలపై సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: తాగునీటి సరఫరా సమయంలో ఎదురయ్యే సమస్యలను సహాయకులు తీర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండల పరిషత్ ప్రాంగణంలో సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో ఒక గ్రామానికి నల్లా కనెక్షన్ల సంఖ్యను బట్టి ముగ్గురు సహాయకులను నియమిస్తున్నామని చెప్పారు. 615 మందిని నియమించి శిక్షణ ఇస్తున్నామన్నారు. డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి, ఎంపీ ఓ హరిశంకర్ గౌడ్, సుచరిత తదితరులు ఉన్నారు.


గంజాయి పట్టివేత

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: రామచంద్రాపురం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణంలో గంజాయి అమ్ముతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి ప్రాంతానికి చెందిన కిషోర్ దాస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. వచ్చిన కస్టమర్లకు గంజాయి అమ్ముతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై దాడి చేసింది. 6.715 కిలోల ఎండు గంజాయితోపాటు రూ.7100 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రదీప్‌రావు చెప్పారు.



ఆలోచన పెంచేలా.. ఆహ్లాదం పంచేలా..











గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ మార్గంలో రహదారికి ఇరువైపులా గోడలపై రాసిన సూక్తులు, వివిధ వర్ణ చిత్రాలు అటుగా రాకపోకలు సాగించేవారిని ఆకట్టుకుంటున్నాయి. రంగుల చిత్రాలు ఆహ్లాదాన్ని పంచుతుండగా.. సూక్తులు ఆలోచింపజేస్తున్నాయి.



విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కమిషనర్ సత్యనారాయణ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దుండిగల్, న్యూస్‌టుడే: స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమంలో భాగంగా దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్లాస్టిక్ కారణంగా కలిగే నష్టాలు, ప్లాస్టిక్ నిషేధం, తడి, పొడి చెత్త సేకరణ, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ, వాతావరణానికి హాని కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కమిషనర్ సత్యనారాయణ ప్రశంసా పత్రాలను అందజేశారు.

కుత్బుల్లాపూర్

భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం చేయాలి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం రూ.10వేల ఆర్థిక సహాయం అందించాలని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ అయిలయ్య కోరారు. బుధవారం ఆయన జగద్గిరిగుట్టలో భవన నిర్మాణ కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కార్మికులకు ఉపాధి లేక పస్తులు ఉంటున్నారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ కార్డు ఉన్న కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు చంద్రయ్య, మొగులయ్య, ఆరోగ్యరెడ్డి, యాదగిరి, కుమలమ్మ, జనార్దన్ పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న అయిలయ్య

చిత్రలేఖనంలో ప్రతిభ



పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రజతోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోస్టర్ పోటీల్లో గాజులరామారం శ్రీరంగనగర్‌కు చెందిన చికిలే మనస్విత ప్రథమ బహుమతి గెలుచుకుంది. రాజనీతిశాస్త్రం శాఖ నిర్వహించిన పరిపాలనలో కృత్రిమ మేధా పాత్రపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందింది.

పోలీసు పటాలంలో క్యాంటీన్ ప్రారంభం




మాదాపూర్: కొండాపూర్‌లోని 8వ పోలీసు పటాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్సిడీ పోలీస్ క్యాంటీన్ (ఎస్‌పీసీ)ని బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సంజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పటాలంలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది క్యాంటీన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీజీఎస్పీ డీఐజీ సిద్ధికి, పటాలం కమాండెంట్ సి.సన్నీ, అదనపు కమాండెంట్ కె.వీరయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు బి.సిత్రం, ఎం.రెహమాన్, ఎం.నాగభూషణం బి.రాంబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరవు

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: గిరినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడు గదులతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిసిన ప్రతిసారి తరగతి గదులపై స్లాబు నుంచి వర్షపు నీరు కిందికి కారుతూ ఉంటుంది. దీనికి తోడు స్లాబు తడిసిపోయి పెచ్చులూడి కిందపడుతుండటంతో పిల్లలు భయంతో కూర్చొని విద్యాభోదన చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో ఈ పాఠశాల కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఇక కప్పులకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి మమ అనిపించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ ఒక్క పాఠశాలలోనే పరిస్థితి ఇలా ఉందనుకుంటే పొరబడినట్లే సుమా..! నియోజకవర్గంలో 29 పాఠశాలల్లో మౌలిక వసతులు మృగ్యమవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

మొత్తం 86 పాఠశాలలు

నియోజకవర్గంలో మొత్తం 86 ప్రాథమిక, ఒకటి ప్రాథమికోన్నత, 21 ఉన్నత పాఠశాలలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు-మన బడి' పథకంలో కుత్బుల్లాపూర్ మండలంలో 25, గండిమైసమ్మ దుండిగల్ మండలంలో 9, బాచుపల్లి మండలంలో 3 పాఠశాలలను ఎంపిక చేశారు. కానీ ప్రయోగాత్మకంగా కుత్బుల్లాపూర్ మండలంలోని భగత్‌సింగ్‌నగర్, సూరారం, గండిమైసమ్మ మండలంలో బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లి, దుండిగల్, బాచుపల్లి మండలంలో నిజాంపేట, ప్రగతినగర్ పాఠశాలల్లో రూ. 1.25 కోట్లతో మౌలిక వసతులు మెరుగు పరిచారు. ఇంకా 29 పాఠశాలల్లో వసతులు కల్పించాల్సి ఉంది.



గిరినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వరదచేరడంతో పేరుకుపోయిన బురద

శౌచాలయాల లేమి..

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 60 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున 425 శౌచాలయాలు ఉండాలి. కానీ 25,526 మంది విద్యార్థులకు 319 శౌచాలయాలు అందుబాటులో ఉన్నాయి. మరో 106 శౌచాలయాలు కావాల్సి ఉంది. ఇక ఉన్న వాటిని శుభ్రంచేసే నాథుడు లేక వాటి నిర్వహణ బాధ్యత జీహెచ్ఎంసీ, నగర పాలక, పురపాలక సంఘాల సిబ్బందికి అప్పగించినా పరిస్థితుల్లో మార్పులేదు.

నియోజకవర్గంలో ఇలా..

	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	86	11,690
ప్రాథమికోన్నత	1	182
ఉన్నత	21	13,654

తరగతి గదులు

ప్రస్తుతం ఉన్నవి	654
ఏర్పాటు చేయాల్సినవి	131

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం..

కొన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత ఉన్నమాట వాస్తవం. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఇటీవల పలు పాఠశాలల్లో వసతులు మెరుగుపరిచాం. అయినా మరోసారి సందర్శించి, వాటిల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఒక నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– హరిచంద్, ఎంఈఓ కుత్బుల్లాపూర్.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

కుత్బుల్లాపూర్, పేట్‌బషీరాబాద్, దుండిగల్ న్యూస్‌టుడే:

? ఇటీవల కురిసిన వర్షాలకు వైష్ణవినగర్‌లో ప్రధాన రహదారిపై తారు లేచిపోయి గుంతలు పడ్డాయి. రహదారిపై వరద నిలిచి చిత్తడిగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
–భాను ప్రకాష్, శివాలయనగర్.

✓ సంబంధిత రహదారి నిర్మాణానికి ఇటీవలే అంచనాలు రూపొందించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – కిష్టప్ప, ఈఈ గాజులరామారం సర్కిల్.

? కుత్బుల్లాపూర్ గార్డెన్ బస్తీ ఎదురుగా ఉన్న గల్లీలో మ్యాన్‌హోళ్లపై ఉన్న మూతలు సగం వరకు మాత్రమే ఉండటంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
– నక్కా ప్రకాశ్, కుత్బుల్లాపూర్

✓ పరిశీలించి మ్యాన్‌హోళ్లపై మూతలు పూర్తిగా ఉండేలా చర్యలు చేపడతాం. – రవి, జలమండలి మేనేజర్, కుత్బుల్లాపూర్

? మల్లంపేటలో బస్టాప్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద పది రోజులుగా డ్రైనేజీ లీకై మురుగు రోడ్డుపై పారుతుంది. సమస్యను పరిష్కరించండి. –సుబ్బారావు, స్థానిక నివాసి

✓ పారిశుద్ధ్య సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. –సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

వీధి దీపాల పునరుద్ధరణ

స్పందనకు వందనం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: గాజులరామారం సర్కిల్ మిథిలానగర్ ఆదిత్యహిల్స్ బృందావన్ పార్కు ఏరియాలో రెండు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి పడగానే వీధులన్నీ అంధకారంగా మారి ఇబ్బందులు పడుతున్నామని అదే ప్రాంతానికి చెందిన మాణిక్ ఈ నెల 21న సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా'కు నివేదించారు. వెంటనే సర్కిల్ ఎలక్ట్రికల్ డీఈ రఘుపతి రెడ్డి స్పందించి వెలగని దీపాలను పునరుద్ధరించి సమస్య పరిష్కరించారు.

దీన్ దయాళ్ జీవితం యువతకు ఆదర్శం



దుండిగల్: సింహపురి కాలనీలో మొక్క నాటుతున్న భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి



ప్రగతినగర్‌లో మాట్లాడుతున్న మల్లారెడ్డి

దుండిగల్: భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బౌరంపేట సింహపురి కాలనీలోని ఏ బ్లాక్ పార్క్ భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, కృష్ణారెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు భాజపా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

జీడిమెట్ల: భాజపా చింతల్ డివిజన్ అధ్యక్షుడు పత్తి సతీశ్‌కుమార్, ఓబీసీ మోర్చా కార్యదర్శి భాను చందర్, డివిజన్‌సెక్రటరీ యాదిలాల్ దీన్ దయాళ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పేట్‌బషీరాబాద్: భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధానకార్యదర్శి గిరివర్దన్‌రెడ్డి, అసెంబ్లీ కో-కన్వీనర్ పొత్తూరి శివాజీ రాజు మహిళా మోర్చా నేతలు సరిత, మాధురి దీన్ దయాళ్ జయంతిని కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించారు.

నిజాంపేట: దీన్ దయాళ్ జయంతి భాజపా ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లో నిర్వహించారు. ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అర్బన్ విభాగం కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లాకార్యదర్శివిఘ్నేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, పార్లమెంట్ కో కన్వీనర్ డా.రాజు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

● నిజాంపేట బస్టాండు చౌరస్తాలో పార్టీ నిజాంపేట అధ్యక్షుడు మర్రి భిక్షపతి యాదవ్, సుమన్‌రావు, శిల్పారెడ్డి, రవియాదవ్, అప్పారావు తదితరులు దీన్ దయాళ్ జయంతి నిర్వహించారు.

ఫార్మా రంగంలో రాష్ట్రం అగ్రస్థానం

బంజారాహిల్స్: ఫార్మ రంగంలో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్స్ (ఏపీఐ) ఉత్పత్తిలో, పెద్దసంఖ్యలో రిటైల్ ఫార్మసీలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రస్తుతం ఫార్మసిస్టులకు ఎంతో డిమాండ్ ఉందని, ఆరోగ్య సంరక్షణలో వారి పాత్ర కీలకం అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్‌ఉలూమ్ ఫార్మసీ కళాశాల (ఎస్‌యూపీసీ), రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బుధవారం కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఫార్మసీ సీట్లను పెంచి ఈ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఛైర్మన్ అజయ్ మిశ్రా రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. ఎస్‌యూఈఎస్ గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్, ఎస్‌యూపీసీ ప్రిన్సిపల్ డా. అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని రెడ్డి ఫంక్షన్‌హాలులో బుధవారం బాలానగర్ జోన్ పోలీసులు, ఆకార్ ఆశా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో శారీరక వైకల్యం, పుట్టుకతో అంగవైకల్యం, కాలిన గాయాలు, ప్రమాదాల కారణంగా ఏర్పడ్డ వైకల్యం, గ్రహణమొర్రి తదితర సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాలకు చెందిన 40 మంది వివిధ అంగవైకల్య సమస్యలతో శిబిరాన్ని వచ్చారు. శిబిరాన్ని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, ఆకార్ ఆశా ఆస్పత్రి డా.భారతేందు శ్వైన్ ప్రారంభించారు. డీసీపీ మాట్లాడుతూ.. ఆకార్ ఆశా ఆసుపత్రి డాక్టర్ భారతేందు శ్వైన్ ఎంతో సేవాభావంతో నిరుపేదలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. డాక్టర్ భారతేందు శ్వైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం శిబిరానికి హాజరైన వారు తమ బంధువులు, తెలిసిన వారు ఉంటే వారికి సమాచారం చేరవేయాలని నిరంతరం తన ఆసుపత్రిలో అంగవైకల్యం కలిగిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్, సీఐలు క్రాంతికుమార్, మల్లేష్, వెంకటేశ్వరరావు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ సురేష్‌కుమార్

గుర్రపు డెక్క..దోమల తిష్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట మున్సిపల్ పరిధి ప్రగతి నగర్‌లో ఉన్న అంబుర్ చెరువు ఇది గుర్రపు డెక్క పేరుకుపోయింది దీంతో దుర్వాసన,దోమలు పెరిగి చుట్టూ పక్కల ఉన్న అపార్ట్మెంట్ వసూలు ఇబ్బంది పడుతున్నారు అధికారులు గుర్రపు డెక్కను. చెరువులో నుంచి తొలగించి దోమలు పెరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
– కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే

దరఖాస్తులా.. చెత్త కాగితాలా..



చెత్త కుప్పల్లా పడేసిన అర్జీలు



కుర్చీలు ఇలా..

మీ సేవాలో వివిధ రకాల పథకాలకు, ధ్రువపత్రాలకు చేసుకున్న దరఖాస్తులను దుండిగల్ మండల కార్యాలయంలో చెత్తకుప్పల్లా కట్టి పడేసారు. జాగ్రత్తగా ఉంచాల్సిన వాటిని ఇలా పడేయడంతో పాతవి దొరకక ప్రజలు తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారులు వాటిని పాడవకుండా రక్షణ ఏర్పాటు చేసి దాచాల్సిన అవసరం ఉంది. కార్యాలయంలో కుర్చీలు, బీరువాలు ఇతర సామగ్రి విరిగిపోయి దర్శనమిస్తున్నాయి



విరిగిన బీరువా తలుపులు

అడుగుకో గుంత.. రాకపోకలు ఎట్లా..



మల్లికార్జున స్వామి ఆలయం దగ్గరలో

బౌరంపేటలోని బొడ్రాయి నుంచి స్థానిక శివాజీ విగ్రహం వరకు ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. అడుగుకో గుంత, బురదమయంగా మారిన రోడ్డులో వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఈ మార్గంలో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, దుండిగల్



బొడ్రాయి సమీపంలో..

భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి



షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని జరుగుతున్న నిత్యపూల మాల కార్యక్రమం బుధవారం నాటికి 38వ రోజుకు చేరుకుంది. సూరారంలోని బాబూ జగ్జీవన్‌రాం, బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిన దళిత సంఘాల నాయకులు భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చేవరకు తాము పోరాటం చేస్తామని తెలిపారు. నాయకులు సత్యనారాయణ, అంజన్న, రత్నం, అశోక్ పాల్గొన్నారు.

కూన వెంకటేష్‌గౌడ్‌ను స్మరిస్తూ అన్నదానం



వెంకటేష్‌గౌడ్‌కు నివాళులర్పిస్తున్న అభిమానులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: ఇటీవల మృతిచెందిన తెదేపా సీనియర్ నేత కూన వెంకటేష్‌గౌడ్‌ను స్మరిస్తూ ఆయన సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అభిమానులు షాపూర్‌నగర్‌లో బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కేకేఎం ట్రస్టు ఛైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాచోటి సత్యనారాయణ, కూన వెంకటేష్‌గౌడ్ అభిమానులు పాల్గొన్నారు.

భారీ గుంత.. ప్రజలకు అవస్థ

ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలు పడి వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రింగురోడ్డు నుంచి సచ్చిదానంద ఆశ్రమం మీదుగా గ్రామానికి వెళ్లి దారిలో భారీ గుంత ఏర్పడింది. అధికారులు గుంతను పూడ్చి ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్



రోబోటిక్ సర్జరీ యంత్రం ప్రారంభం



యంత్రం ఆవిష్కరణలో జయసుధ, ప్రీతిరెడ్డి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రిలో బుధవారం రోబోటిక్ సర్జరీ యంత్రాన్ని ప్రముఖ సినీనటి జయసుధ, ఆసుపత్రి వైస్ ఛైర్మన్ ప్రీతిరెడ్డి ప్రారంభించారు. జయసుధ మాట్లాడుతూ.. రోగి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి ఆరోగ్య సంరక్షణలో నూతన ఆవిష్కరణలు చాలా అవసరమన్నారు. డాక్టర్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ.. చికిత్సలో కచ్చితత్వం వేగవంతమైన రికవరీ కోసం అధునాతన రోబోటిక్ సర్జరీని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్ అంజని కుమార్, డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ సుధారమణ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కూకట్‌పల్లి: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు గంజాయి విక్రేతలను బాలానగర్ ఎక్సైజ్, ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వేణుకుమార్ కథనం ప్రకారం.. కూకట్‌పల్లిలో గంజాయి విక్రయిస్తుండగా ధూల్‌పేటకు చెందిన గణేష్‌సింగ్(28), ఉమేష్‌సింగ్(27)లను ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు.వారి నుంచి 1.08కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మరో కేసులో ఫతేనగర్ వంతెన కింద గంజాయి విక్రయిస్తున్న ప్రభుదేవా(20) నుంచి 630గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి ముగ్గురిని కోర్టులో హాజరుపరిచారు.

వయోవృద్ధులకు భరోసా కల్పిద్దాం..!



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఇతరులు

మేడ్చల్ కలెక్టరేట్: అక్టోబరు 1న నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడు రోజుల పాటు వారోత్సవాలను జరిపి వారికి భరోసా కల్పిద్దామని జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో విద్య, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ, పౌర సరఫరాలు, మహిళా శిశు సంక్షేమ, వయో వృద్ధులు, వయోవృద్ధాశ్రమాల నిర్వాహకులు, వయో వృద్ధుల కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న వృద్ధాశ్రమాల్లోని వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాక్‌థాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ-సంక్షేమ చట్టం-2007పై అవగాహన సదస్సు, 29న గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు చట్టం టోల్ ఫ్రీ నంబర్-14567పై అవగాహన సదస్సులు, 30న అంగన్‌వాడీ కేంద్రాలు- పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.

27న సాంస్కృతిక పోటీలు

మేడ్చల్ కలెక్టరేట్: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 27న మేడ్చల్ కలెక్టరేట్‌లో యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసులు-క్రీడల అధికారి జీవి.గోపాల్‌రావు పేర్కొన్నారు. జానపద నృత్యాలు, పాటలు, కవిత్వం, వ్యాచరచన, చిత్రలేఖనం తదితర పోటీలుంటాయన్నారు. ఉత్తములను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు 26లోపే దరఖాస్తులు పంపించాలన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

నందిగామ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంలో కార్మికుడు మృతి చెందిన సంఘటన నందిగామ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అబ్దుల్ షాకీర్(40) నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న షెడ్డులో వెల్డింగ్ పనిచేస్తుండగా విద్యుదాఘాతాని గురై కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

చెత్త రిక్షాల పంపిణీకి రంగం సిద్ధం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో పారిశుద్ధ్య కార్మికులకు చెత్త తరలింపునకు అవసరమైన కొత్త రిక్షాలు అందించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాలుగా తుప్పుపట్టిన రిక్షాలతో చెత్త తరలించడానికి కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాటి నిర్వహణనకు జీహెచ్ఎంసీ కనీసం నిధులు కేటాయించకపోవడంతో కార్మికులే సొంత డబ్బులతో వాటికి మరమ్మతులు చేయించుకుని చెత్త తరలించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.



సర్కిల్ కార్యాలయ ఆవరణలో..

ఆరునెలలకే తుప్పు..

జంట సర్కిళ్లలో 125 పారిశుద్ధ్య యూనిట్లు పనిచేస్తున్నాయి. వీటిలో 941 మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారికి నెలకు రూ.16730 వేతనం చెల్లిస్తుండగా, పీఎఫ్, ఈఎస్ఐ వాటా పోను రూ.14100 వరకు చేతికి వస్తుంటాయి. గతంలో ఒక్కో యూనిట్‌కు ఒక్కో చెత్త రవాణా రిక్షాలను సమకూర్చారు. నాణ్యత లేమితో 70 శాతం రిక్షాలు ఆరు నెలలకే తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ క్రమంలో తరచూ అవి మరమ్మతులకు వస్తుండంతో ఆయా యూనిట్లలో పని చేసే కార్మికులే తమ వేతనాల్లో నుంచి డబ్బులు పోగు చేసుకుని బాగుచేయించుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి మరమత్తులు చేయించుకునే స్తోమత లేక చెత్తను దగ్గరలోని డంపింగ్ కేంద్రానికి తరలించడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రెండొందలకు..వందే ఇచ్చారు

ఒక్కో సర్కిల్‌కు కనీసం వంద చెత్త రవాణా రిక్షాలు సమకూర్చాలని జంట సర్కిళ్ల వైద్యాధికారులు ఇటీవల జీహెచ్ఎంసీకి లేఖలు రాశారు. అయితే జీహెచ్ఎంసీ వ్యాప్తంగా వివిధ సర్కిళ్ల నుంచి కూడా చెత్త రవాణా రిక్షాలు కావాలంటూ అభ్యర్థనలు రావడంతో రెండు రోజుల క్రితం ఒక్కో సర్కిల్‌కు 50 చొప్పున 100 రిక్షాలను సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో అందజేసిన రిక్షాల్లో చాలావరకు నాణ్యత లోపించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ సారి వాటికి థర్డ్‌పార్టీతో నాణ్యత పరీక్షలు నిర్వహించాక కార్మికులకు అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే కొత్త రిక్షాల రాకతో సంబంధిత కార్మికుల్లో మాత్రం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్ల అందజేత


బ్యాటరీ సైకిళ్లు అందించిన సంజయ్‌సింగ్ తదితరులు

కంటోన్మెంట్: న్యూబోయిన్‌పల్లి మనోవికాస్‌నగర్‌లోని జాతీయ మానసిక దివ్యాంగుల సాధికారత సంస్థ(నిపిడ్)లో బుధవారం దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, చరవాణులు, చక్రాల కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సంజయ్‌సింగ్, భాజపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బాణుక మల్లికార్జున్‌తో కలిసి తొలుత పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులకు సామగ్రిని పంపిణీ చేశారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం


జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

లాలాపేట, న్యూస్‌టుడే: తార్నాకలోని సరోజినినాయుడు వనితా ఫార్మసీ మహావిద్యాలయంలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం ఇండియన్ ఫార్మాస్యూటికల్స్ అసోసియేషన్(ఐపీఏ), తెలంగాణ రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐపీఏ తెలంగాణ శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ బి.ప్రభాశంకర్, ప్రధాన కార్యదర్శి రామ్ ప్రసాద్‌రెడ్డి జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఫార్మాస్యూటికల్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలపై చర్చించారు.

ఇక్కడ అవస్థలే పాఠాలు

- పది తరగతులు.. మూడు గదులు.. 270 మంది విద్యార్థులు
- ప్రభుత్వ రౌండ్ టేబుల్ పాఠశాల దుస్థితి

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఆహ్లాదకర వాతావరణంలో విద్యనభ్యసించాల్సిన విద్యార్థులు అవస్థలతో నెట్టుకొస్తున్నారు. ఇరుకు గదుల్లో, అపరిశుభ్ర పరిసరాల్లో, దాహం కేకలతో ఉండిపోతున్నారు. ఇక్కడి విద్యార్థులు నిత్యం అవస్థల పాఠాలే చదువుకోవాల్సి వస్తోంది. ఇది సనత్‌నగర్ ఎస్.ఆర్.టి.కాలనీలోని ప్రభుత్వ రౌండ్ టేబుల్ పాఠశాల దుస్థితి.

అలవాటైన నేల చదువులు

గ్రౌండ్+2 భవనంలో కొనసాగుతున్న ఈ పాఠశాలలో మొదటి, రెండో అంతస్తులో ఉన్నత పాఠశాల కొనసాగుతుంది. ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలకు సంబంధించి 6 గదుల్లో 10 తరగతులు నిర్వహించాల్సి ఉండగా.. గదులు చాలక పైకప్పుపై షెడ్డు వేసి కూర్చోబెడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో సమస్య మరింత తీవ్రంగా ఉంది. 1-5 వరకు ఉన్న తరగతుల్లో రెండు మాధ్యమాలకు కలిపి 10 తరగతులున్నాయి. మొత్తం 270 మంది విద్యార్థులకు కేవలం గ్రౌండ్ ఫ్లోర్‌లోని మూడు గదులు మాత్రమే కేటాయించారు. ఒక్కో గదిలో రెండు లేదా మూడేసి తరగతులు నిర్వహిస్తున్నారు. కొందరు బెంచీలపై, మరికొందరు కింద కూర్చుంటున్నారు. దీంతో ఏ ఉపాధ్యాయుడు ఏ పాఠం చెబుతున్నారో అర్థం కాని పరిస్థితి. ఇక వర్షం కురిసిందంటే విద్యార్థులంతా మూడు గదుల్లోనే ముడుచుకుపోతున్నారు.


ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటి సీసాలు చూపుతున్న విద్యార్థులు

అవసరాలకూ సమస్యే..

- విద్యార్థులు తాగేందుకు కనీసం నీటి సదుపాయం లేకపోవడం గమనార్హం. ఓ దాత స్పందించి నీటి శుద్ధి ట్యాంకును ఏర్పాటు చేసినా నల్లాలకు అనుసంధానం చేయలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే సీసాల్లో నీటిని తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం తరువాత నీటి కోసం సమీపంలోని టిఫిన్ సెంటర్లు, హోటళ్లకు సీసాలు పట్టుకుని వెళ్లాల్సి వస్తోంది.
- ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు సంబంధించి బాలికలకు ఒకే టాయిలెట్ ఉంది. నిర్వహణ, శుభ్రత లేకపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో బాలురకు ఒకే మరుగుదొడ్డి ఉంది. వెనకవైపు ఉన్న మరుగుదొడ్డికి వెళ్లాలంటే దుర్వాసన, బురద, మురుగు నుంచి నడిచివెళ్లక తప్పదు.

ఉపాధ్యాయుల కొరత

ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులకు ఒకరు ఉద్యోగోన్నతిపై వెళ్లగా.. మరొకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడితో కలిపి ఐదుగురు 10 తరగతలకు బోధించాల్సి వస్తోంది. మరో ఇద్దరు ఉపాధ్యాయులు అవసరం.


ఇరుకు గదిలో బెంచీలపై, కింద కూర్చున్న రెండు తరగతులకు చెందిన విద్యార్థులు

ఆశలు రేపిన 'మన బస్తీ.. మన బడి'

మన బస్తీ.. మన బడి కార్యక్రమం రెండో దశలో పాఠశాలను చేర్చడంతో ఇక అవస్థలు తీరినట్లేనని అంతా భావించారు. అమల్లోకి వచ్చేసరికి ఇప్పటివరకు అక్కడ పనులే ప్రారంభం కాలేదు. ప్రస్తుతం పాఠశాలలో మరో 8 తరగతి గదుల అవసరం ఉంది. ఇటీవల ఉపాధ్యాయులు, స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్దకు వెళ్లి పాఠశాల దుస్థితిని వివరించి ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు.


అపరిశుభ్రంగా మరుగుదొడ్లకు వెళ్లే మార్గం

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య
సికింద్రాబాద్: 8008573368
కంటోన్మెంట్: 8008573361
సనత్‌నగర్: 8008573356

కార్ఖానా, సంజీవరెడ్డినగర్, రెజిమెంటల్ బజార్, అడ్డగుట్ట, న్యూస్‌టుడే:

? చంద్రానగర్ కాలనీలో డ్రైనేజీలు తరచూ పొంగుతున్నాయి.
– శ్యాంరావ్, చంద్రానగర్ కాలనీ

✓ మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం.
– జీవన్, పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్

? బీకేగూడ బతుకమ్మ చౌరస్తా నుంచి శ్రీరామ్‌నగర్ కాలనీ వైపు వచ్చే ప్రధాన రహదారిలో ఓ మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రమాదాలు జరుగుతున్నాయి. – ఎ.బాలనర్సింహ, బీకేగూడ

✓ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయిస్తాం.
– వంశీకృష్ణ, జలమండలి డీజీఎం

'మూసీ ప్రక్షాళన ఓర్వలేకే కేటీఆర్ విమర్శలు'

హైదరాబాద్: త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కనీసం డిపాజిట్లైన దక్కించుకోవాలనే తాపత్రయంతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలను వెంటపెట్టుకొని నగరంలో తిరుగుతున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ విమర్శించారు. ఆయన బుధవారం అసెంబ్లీలోని సీఎల్పీ మీడియాహాలులో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీని ప్రక్షాళన చేస్తానంటే కేటీఆర్ ఓర్వలేక పోతున్నారని శ్రీగణేష్ మండిపడ్డారు.

రైల్వే పింఛనుదారుల నిరసన


నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

సికింద్రాబాద్: చిలకలగూడలోని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద బుధవారం రైల్వే పింఛనుదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న కేంద్ర ప్రభుత్వ పింఛనుదారుల నిరసనలకు మద్దతు ప్రకటించారు. 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, పాత పింఛను విధానం అమలు చేయాలని, 18 నెలల కరవు భత్యం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'కోదండరాంను విద్యాశాఖ మంత్రిగా నియమించాలి'


వేదికపై ఎమ్మెల్సీ ప్రొ కోదండరాం, ప్రొ హరగోపాల్ తదితరులు

లాలాపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిగా నియమించాలని, అందుకు ఆయనకు అన్ని అర్హతలున్నాయని ఓయూ తాత్కాలిక అధ్యాపకులు తెలిపారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన్ను బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా పార్ట్‌టైం అధ్యాపకుల సంఘ నాయకులు సోమేశ్వర్, డాక్టర్ జానకిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల విద్యా స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు విద్యారంగంపై ఆయనకు పూర్తి పట్టు ఉందన్నారు. పార్ట్‌టైం అధ్యాపకులకు సమాన పనికి సమాన వేతనం అందించే బాధ్యతలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని కోదండరాం తెలిపారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఓయూ యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుల్తానా పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి చొరవ అవసరం

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఆ పార్టీ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్ చొరవ చూపాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆదంను కలిసి పలు సమస్యలు వివరించారు.

బల్కంపేట ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థాన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.51,48,685 ఆదాయం సమకూరింది. యూఎస్ డాలర్లు 180, మలేషియా రింగిట్స్ 9, న్యూజిలాండ్ డాలర్లు 20, ఇండోనేషియా కరెన్సీ 2000, యూరో 10 వచ్చినట్లు ఈఓ బి.కృష్ణ, ఛైర్మన్ కొత్తపల్లి సాయిబాబాగౌడ్ తెలిపారు. ఆగస్టు 5 నుంచి ఈ నెల 25 వరకు వచ్చిన ఆదాయమని తెలిపారు.

పారిశుద్ధ్య కర్మచారులకు తోపుడుబళ్ల అందజేత



ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ చీర సుచిత్ర, ఎస్ఎస్ ధనగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మహంకాళి ఆలయం వద్ద రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని 12 మంది సఫాయి కర్మచారులకు వ్యర్థాల తొలగింపునకు మూడు చక్రాల తోపుడు బళ్లు అందించారు. అనంతరం తమవంతు బాధ్యతగా ప్రజలంతా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు.

చెత్త కుప్పలు.. తప్పని తిప్పలు



అడ్డగుట్టలో మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీప చౌరస్తా, మహేంద్రహిల్స్ త్రిమూర్తికాలనీ తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలు తరలించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆహారం కోసం కుక్కలు చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయి. ఈ కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, అడ్డగుట్ట

అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

కార్ఖానా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ రెండో వార్డు కృష్ణానగర్ బస్తీలో బుధవారం విద్యుత్తు సిబ్బంది బిల్లులు వసూలు చేశారు. కట్టని వినియోగదారుల విద్యుత్తు కనెక్షన్లు తొలగించారు. దీంతో సిబ్బందికి, స్థానికుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గృహజ్యోతి పథకం అమలు చేయకుండా నెలల బిల్లులు ఒకేసారి చెల్లించాలంటే ఎలా అని వినియోగదారులు ప్రశ్నించారు. స్థానికుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో కనెక్షన్లు పునరుద్ధరించి సిబ్బంది వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ బస్తీలో పర్యటించారు. గృహజ్యోతి అమలుకావడం లేదని స్థానికులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. అర్హులందరికీ కచ్చితంగా అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే విద్యుత్తు అధికారులతో మాట్లాడి ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు.

మారేడుపల్లి, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలను చూసిపోవడమే తప్ప పరిష్కరించడం లేదని మోండా మార్కెట్ డివిజన్ లక్ష్మయ్యదొడ్డి బస్తీ మహిళలు వాపోయారు. బుధవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ పార్టీ శ్రేణులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తిరుమల లడ్డూ వివాదంపై దీక్ష


దీక్షలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందంటూ బుధవారం లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నామాల గుండు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, నాణ్యత లేని నెయ్యిని వాడటం దారుణమని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీరికి విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం, పంచ ఆశయ పరిషత్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు మద్దతు ప్రకటించారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి


వివరాలు నమోదు చేసుకుంటున్న ఆర్డీవో దశరథ్‌సింగ్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ మోండామార్కెట్ ప్రాంతంలోని ఓల్డ్ జైల్‌ఖానా పురాతన ప్రహరీ కూలిన ప్రాంతాన్ని బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించి తనవంతు సాయం అందించారు. బాధితులను ఆదుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. అక్కడి పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్‌సింగ్ బాధితుల వివరాలు నమోదు చేసుకొని వారి గుర్తింపు కార్డులు తీసుకున్నారు. అక్కడ ప్రమాదకరంగా ఉన్న గోడలను జీహెచ్ఎంసీ సిబ్బంది పూర్తిగా కూల్చివేస్తున్నారు. ఏడు దుకాణాలు, 11 నివాసాలు, ఒక యూనియన్ ఆఫీసు ఉందని ఆర్డీవో తెలిపారు. 11 నివాసాల వారికి గతంలోనే ఇళ్ల పట్టాలు ఇచ్చారని చెప్పారు. నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు.

ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి


అమీర్‌పేటలో శ్యామ్‌సుందర్, ఇతర భాజపా నేతలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని భాజపా డివిజన్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర భాజపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్, నాయకులు పాల్గొన్నారు.

అమీర్‌పేట, న్యూస్‌టుడే: భాజపా సిద్ధాంతకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కాసాని శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం అమీర్‌పేటలో నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్, సీనియర్ నాయకులు భిక్షపతిగౌడ్, ఎం.శ్రీనివాస్, విద్యాధర్‌రెడ్డి, నరేందర్‌చౌదరి, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్, లాలాపేట, న్యూస్‌టుడే: బౌద్ధనగర్ డివిజన్‌లో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తార్నాకలో డివిజన్ అధ్యక్షుడు రామువర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హాజరయ్యారు.

భాజపాకు ప్రజల మద్దతు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న సారంగపాణి

బౌద్ధనగర్, న్యూస్‌టుడే: భాజపాకు ప్రజలు మద్దతు తెలుపుతూ సభ్యత్వ నమోదు కోసం స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లో బుధవారం బూత్ నెంబర్ 165 కోఆర్డినేటర్ యాదమ్మ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయన మాటాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

28న జాతీయ లోక్ అదాలత్

అమీర్‌పేట: ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. బుధవారం ఠాణాలో ఆయన మాట్లాడుతూ ఇతర వివరాల కోసం ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ లేదా లా అండ్ ఆర్డర్ ఠాణాల్లో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు

బేగంపేట, న్యూస్‌టుడే: బేగంపేట డివిజన్‌లోని ఎన్‌బీటీనగర్, పాటిగడ్డ బస్తీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ ఎన్నికల్లో ఓటమి పాలైన ప్రత్యర్థి చిరంజీవి బుధవారం ఏసీపీ గోపాలకృష్ణమూర్తిని కలిసి ఫిర్యాదు అందజేశారు. ఎన్నికలపై తనకు అనుమానాలున్నాయని, ఓటరు జాబితా ఇవ్వాలని అభ్యర్థించినా ఖాతరు చేయలేదన్నారు.

మైనర్లకు వాహనాలు నడపడం నేరం

బేగంపేట, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, వారికి వాహనాలిచ్చిన తల్లిదండ్రులపై కూడా కేసు నమోదవుతాయని ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఇన్‌స్పెక్టర్ వి.రామ్‌చందర్ హెచ్చరించారు. బేగంపేటలోని ఉద్భవ్ పాఠశాలలో బుధవారం రోడ్డు భద్రతా నిబంధనలు, ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు.

స్వాగతోత్సవ సందడి


మిస్టర్, మిస్ ఫ్రెషర్స్‌గా ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణ, ఫ్యాషన్ షో తదితర కార్యక్రమాలతో అమీర్‌పేటలోని న్యూసైన్స్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు అలరించాయి. అదిరేటి దుస్తులతో, అలరించే క్యాట్‌వాక్‌తో విద్యార్థులు సందడి చేశారు. వేడుకల్లో మిస్టర్ మిస్ ఫ్రెషర్స్‌గా ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ సమీర అభినందించారు.

సరిగమల ఉచ్ఛరణతో ఆరోగ్యం, ఆనందం


కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

మారేడుపల్లి, న్యూస్‌టుడే: సంగీతం, సరిగమల ఉచ్ఛరణతో ఆనందం, ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని శ్రీ భక్తరామదాసు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.సరిత అన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఇటీవల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన సరితను అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు.

ఇష్టమైనవాళ్ల ఫొటోలే ఆఖరి స్టేటస్

హోటల్ గదిలో యువకుడి ఆత్మహత్య


అక్షయ్‌కుమార్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని లాడ్జ్‌లో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మార్కెట్ పోలీసుల సమాచారం ప్రకారం.. వరంగల్ జిల్లా భూపాల్‌పల్లికి చెందిన అక్షయ్‌కుమార్(24) ఐటీఐ ఫిట్టర్ పూర్తి చేశాడు. గతేడాది హైదరాబాద్‌కు వచ్చి కొంతకాలం ఉద్యోగం చేశాడు. కొత్త బైక్ కొనుగోలు చేసి కొద్దిరోజుల క్రితమే సొంతూరు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి సికింద్రాబాద్ వచ్చాడు. బండిమెట్‌లోని ఒక లాడ్జ్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. బుధవారం ఉదయం మిత్రులు, కుటుంబసభ్యుల్లో ఇష్టమైన వాళ్ల ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు అనుమానంతో అతడికి ఫోన్‌చేసినా స్పందన రాలేదు. స్విచ్ఛాఫ్ అయినట్టు గుర్తించారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కుటుంబసభ్యులు రాత్రి లాడ్జ్‌కు వచ్చారు. గదిలో చూడగా ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

నగదు, బంగారు గొలుసు చోరీ

రెజిమెంటల్‌బజార్: శ్రీకాకుళానికి చెందిన వెంకట లక్ష్మీకాంతం కర్ణాటకలో బ్యాంకు ఉద్యోగిని. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళం నుంచి విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు బయలుదేరారు. ఈ నెల ఒకటిన రైలు సికింద్రాబాద్ చేరుకున్నాక బాధితురాలి తల్లి హ్యాండ్‌బ్యాగులోని 20.75 గ్రాముల బంగారు గొలుసు, రూ.22 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో కర్ణాటక వెళ్లాక అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా బదిలీ బుధవారం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: **(బుధవారం నాటివి..కిలో రూ.లో)** టమాటా 43, వంగ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 21, క్యారెట్ 43, దొండ 35, ఆలు 37, ఉల్లి 54, సొర 17, పొట్ల 18, బీన్స్ 55, గోరు చిక్కుడు 23, చిక్కుడు 50, దోస 21, బీర 38, కాకర 38, చామగడ్డ 38, కీర 40, క్యాప్సికం 70, బీట్‌రూట్ 28, కందగడ్డ 65, చిలకడ దుంప 40, మామిడి 65, మునగ 85, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా 43, వంగ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకర 38, బీర 38, క్యాబేజీ 21, బీన్స్ 55, క్యారెట్ 43, దొండ 35, చిక్కుడు 50, క్యాప్సికం 70, ఆలు 37, కీర 26, దోస 21, చామగడ్డ 38, అరటి 9, బీట్‌రూట్ 28, సొర 17, గోకర 23.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

అల్వాల్, న్యూస్‌టుడే: వివిధ కాలనీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మచ్చబొల్లారంలోని రాయల్ ఎన్‌క్లేవ్, ధర్మారెడ్డి కాలనీ వాసులతో బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు వంటి కనీస సదుపాయాల కల్పనకు సంబంధించి ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆయా కాలనీ వాసులు సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రశాంత్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ



మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు.

27న సాంస్కృతిక పోటీలు

మేడ్చల్ కలెక్టరేట్: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 27న మేడ్చల్ కలెక్టరేట్‌లో యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసులు-క్రీడల అధికారి జీవీ గోపాల్‌రావు పేర్కొన్నారు. జానపద నృత్యాలు, పాటలు, కవిత్వం, వ్యాసచరచన, చిత్రలేఖనం తదితర పోటీలుంటాయన్నారు. ఉత్తములను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు 26లోగా దరఖాస్తులు పంపించాలన్నారు.

హైడ్రా ఆదేశం.. అధికారుల్లో చలనం

చెరువుల పాత రికార్డులపై దృష్టి

అల్వాల్, న్యూస్‌టుడే: చెరువుల పాత రికార్డులపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. హైడ్రా ఆదేశాల ప్రకారం మండలంలోని ప్రతి జలవనరు చరిత్రను వెలికి తీసే పనిలో రెవెన్యూ, జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు. జలవనరులకు ప్రసిద్ధి చెందిన అల్వాల్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ వివరాలను తెలిపే రికార్డులు గతంలో ఉండేవి. మున్సిపాలిటీ నుంచి జీహెచ్ఎంసీలో విలీన సమయంలో అప్పటి టీపీవో రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ప్రతి చెరువు వివరాలను పొందుపరుస్తూ ఒక నివేదిక(పుస్తకం)ను సిద్ధం చేశారు. దీంట్లో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అప్పటికే గుర్తించిన సరిహద్దులు, ఎఫ్‌టీఎల్ ఆధారంగా ఎఫ్‌టీఎల్ రాళ్లు, బఫర్‌జోన్ వివరాలను పొందుపరిచారు.

అధికారులు మారడంతో..

దశాబ్దం క్రితం తరచూ టౌన్‌ప్లానింగ్‌లో బదిలీలు జరుగుతుండడంతో గతంలో రూపొందించిన నివేదిక కనిపించకుండాపోయింది. ప్రస్తుతం ఆ సర్వేనంబర్ల ఆధారంగానే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తిస్తున్నారు. ఆయా జోన్లల్లో గత ఆరేళ్లగా అనుమతులు జారీ అవుతున్నాయి. అందుకు ఆయా జోన్లు నివాస ప్రాంతాలుగా మారడమే కారణమన్న విషయాన్ని అధికారుల తెరపైకి తెచ్చి అనుమతుల జారీని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అందుకు చిన్నరాయుని చెరువే ఉదాహరణ. ఇక్కడ చెరువును ఆనుకొని గతంలో అనుమతులు జారీ అయ్యాయి.



కొత్తచెరువులో తొలగించిన ఎఫ్‌టీఎల్ రాయి

మోతులకుంటకే పరిమితమైన కంచె

సర్కిల్ కార్యాలయం రికార్డుల ఆధారంగా మచ్చబొల్లారంలోని మోతులకుంట చెరువుకు కంచె నిర్మాణాన్ని 2013-14లో పూర్తి చేశారు. అప్పటికే ఆ చెరువు రికార్డులను కొందరు తారుమారు చేశారు. ఒకప్పుడు గుర్తించిన ఎఫ్‌టీఎల్ రాళ్లను ఆక్రమణదారులు తొలగించడంతో కంచె నిర్మాణంపై వివాదం తలెత్తింది. ఆ తర్వాత కొత్తచెరువు వద్దకు రాగానే వివాదం ముదిరింది. వాస్తవానికి సర్కిల్‌లోని అన్ని చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ రాళ్లు రెండు దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేశారు. వీటిని క్రమంగా తొలగించడంతో అప్పటికే ఉన్న రాళ్ల ఆధారంగా సర్కిల్ అధికారులు ముందు చూపుతో రికార్డులను రూపొందించారు. ఈ రికార్డులే ఉంటే వీటినే ప్రమాణికంగా తీసుకునేవారు. అలా చేస్తే ప్రస్తుత వివాదాలు ఉండేవి కాదన్న వాదన ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

డిఫెన్స్‌కాలనీ, గౌతంనగర్, మల్కాజిగిరి, అల్వాల్, న్యూస్‌టుడే:

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి ఎంప్లాయిస్ కాలనీ ప్రధాన మార్గంలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు రోడ్డుపై పొంగిపొర్లుతోంది.
– సూరజ్, ఎంప్లాయిస్ కాలనీ

✓ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. – నవీన్, జలమండలి అధికారి

? గౌతంనగర్ డివిజన్ మధుసూదన్‌నగర్‌లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.
–సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌నగర్

✓ చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం.
– సంజీవ, ఎస్ఎఫ్ఏ

? తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ వసంతపురి కాలనీలో చెత్తకుప్పలు పేరుకు పోయాయి. – వెంకట నారాయణ, కాలనీవాసి

✓ చెత్తకుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, సర్కిల్ పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకుడు

? గోపాల్‌నగర్‌లోని పెంటారెడ్డి గార్డెన్ ముందురోడ్డు కుంగిపోయింది.
–రాంరెడ్డి, స్థానికుడు

✓ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తాం. ఉన్నతాధికారుల నుంచి ఆమోదం రాగానే కొత్త రోడ్డు వేస్తాం. – రవళి, ఏఈ

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



శివపురిలో నివాళి అర్పిస్తున్న భాజపా నేతలు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: భాజపా సీనియర్ నేత పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని శివపురిలోని కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ.. విభిన్న భాషలు, సంస్కృతుల ప్రజలు దేశం కోసం ఒక్కటిగా ఉండాలన్నారు. అప్పుడే దీన్‌దయాళ్‌కు ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, ప్రభుగుప్తా, సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.



జ్యోతికాలనీలో ఓబీసీ నేతలు

అల్వాల్, న్యూస్‌టుడే: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం భాజపా ఆధ్వర్యంలో అల్వాల్‌లో ఘనంగా నిర్వహించారు. మచ్చబొల్లారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు నివాళులర్పించి మాట్లాడారు. తత్వవేత్త, ఆలోచనాపరుడైన దీన్‌దయాల్ సేవలను దేశం మరిచిపోదన్నారు. ఆయన మార్గదర్శకంలో ప్రతి కార్యకర్త నడుచుకోవాలన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణశ్రీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

★ భాజపా ఓబీసీ ఆధ్వర్యంలో నాయకులు జ్యోతికాలనీలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పించారు. సుజాత, వెంకటేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు



కార్మికులకు బియ్యం అందజేస్తున్న ఎంపీ ఈటల

గౌతంనగర్, న్యూస్‌టుడే: దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల్లో భాగంగా భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం గౌతంనగర్ డివిజన్ వాణీనగర్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో 450 సభ్యత్వాలు పూర్తి చేసినట్లు తెలిపారు. చరవాణి ద్వారాను సభ్యత్వం తీసుకోవచ్చన్నారు. ఘణ, చందు పాల్గొన్నారు.

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. మోదీ, అమిత్‌షా నాయకత్వంలో పార్టీకి దేశవ్యాప్తంగా మరింత ఆదరణ పెరుగుతోందన్నారు. సర్కిల్ పరిధిలోని కొందరు పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం సంచులను ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్కే శ్రీనివాస్, వెంకటేశ్, భాను ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వానికి ప్రతి ఒక్కరు ఆసక్తి ..



ఆన్‌లైన్‌లో సభ్యత్వాన్ని చూపుతున్న రామచందర్‌రావు

అల్వాల్, న్యూస్‌టుడే: మోదీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని చూసి భాజపా సభ్యత్వం తీసుకునేందుకు ప్రతి ఒక్కరు ఆసక్తి చూపుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అన్నారు. మచ్చబొల్లారంలోని 393, 394 బూత్ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదును ఆయన బుధవారం ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు భాజపాకు మద్దతు ఇస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు దుష్ప్రచారాన్ని నమ్మే స్థితిలో ఎవరూ లేరని పేర్కొన్నారు. మోదీ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని వివరించారు. పార్టీ నేతలు శ్రీనివాస్, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



నర్సింహారెడ్డి నగర్‌లో స్తంభంపై పాకిన తీగజాతి మొక్కలు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ నర్సింహారెడ్డి నగర్‌లోని ఓ ఇంటి ముందున్న విద్యుత్తు స్తంభానికి తీగజాతి మొక్కలు పాకాయి. దీంతో వీధి దీపం వెలిగిన వెలుగులు రావడం లేదు. వెంటనే అధికారులు వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సమస్యను విద్యుత్తు ఏఈ నాగేశ్వర రావు దృష్టికి తీసుకెళ్లగా తీగలను తొలగిస్తామన్నారు.

పని చేయని నిఘా నేత్రాలు

తాగుబోతులకు అడ్డాగా మౌలాలి పారిశ్రామిక వాడ



అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

మౌలాలి, న్యూస్‌టుడే: సుమారు వేయి మంది కార్మికులు విధులు నిర్వహించే మౌలాలి పారిశ్రామికవాడ నోటిఫైడ్ పరిశ్రమలకు స్థావరం. కార్మికుల భద్రత పేరిట రూ.లక్షలు వెచ్చించి రెండు పర్యాయాలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ అవి ప్రస్తుతం పని చేయడం లేదు.

గతంలో రూ.30లక్షలతో ఏర్పాటు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టీఎస్ఐఐసీ ఐలా ఆధ్వర్యంలో ఏడేళ్ల క్రితం అప్పటి ఐలా ఛైర్మన్ సత్యనారాయణ రాజు హయాంలో సుమారు రూ.30 లక్షలతో 36 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అనంతరం కొంత కాలానికి ఛైర్మన్‌గా వచ్చిన ఉత్తమ్‌రెడ్డి పాతవి పాడైపోయాయని కొత్తవి ఏర్పాటు చేశారు. ఆయా పరిశ్రమల వద్దకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అలాంటి ప్రదేశంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఇటీవల ఛైర్మన్ సత్యనారాయణ రాజుకు చెందిన పరిశ్రమ వద్ద విధులు నిర్వహించే సెక్యూరిటీపై గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేస్తే ఛైర్మన్ మల్కాజిగిరి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో తాగుబోతులకు అడ్డాగా మారుతోంది. రెండోసారి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఒకటి అరా పనిచేస్తున్నాయి తప్ప మిగతావన్నీ అలంకారప్రాయంగా మారాయని కార్మికులు తెలిపారు.

శునకానికి క్షవరం.. గాయపరిచారంటూ ఫిర్యాదు

ఆరోపణలు రుజువు చేయకపోవడంతో కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: రూ.1,20,000 చెల్లించి కొనుగోలు చేసిన శునకానికి గ్రూమింగ్ (క్షవరం) చేస్తూ గాయపరిచినందుకు పరిహారం చెల్లించాలంటూ దాఖలైన కేసును రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ కొట్టివేసింది. కాప్రాకు చెందిన అనన్య వైష్ణవి (న్యాయశాస్త్ర విద్యార్థి) దాఖలు చేసిన ఫిర్యాదును అధ్యక్షురాలు సీహెచ్.లతాకుమారి, సభ్యులు పారుపల్లి జవహర్‌బాబు, శ్యామలతో కూడిన బెంచ్ విచారించింది. ఆరోపణలు రుజువు చేసేలా సాక్ష్యాలు లేని కారణంగా ఫిర్యాదును కొట్టివేస్తూ బెంచ్ తీర్పు వెలువరించింది.

పోలీసులకు ఉద్యోగ విరమణ రోజే ప్రయోజనాలివ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న సంఘం నేతలు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పోలీసులకు ఉద్యోగ విరమణ రోజే ప్రయోజనాలు అందచేయాలని తెలంగాణ విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ఎం.రాజమల్లా రెడ్డి, కోశాధికారి ఎస్పీ కాశీం పీరా, ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, దేవేందర్‌రెడ్డి, సుదర్శన్ రాజు తదితరులు పాల్గొని మాట్లాడారు. అధికార లాంఛనాలతో పోలీసులను ఇంటికి పంపించాలని గతంలో ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత పోలీసు అధికారుల ఆరోగ్య భీమాను రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని కోరారు.

రోడ్డు మధ్యలో స్తంభాలు.. పట్టించుకోని యంత్రాంగం



గౌతంనగర్ డివిజన్ జేఎల్ఎన్ఎస్‌నగర్ నుంచి న్యూవెంకటేశ్వరనగర్‌కు వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభాలు రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు స్తంభాలకు తీగలు అల్లుకుని ఉన్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గౌతంనగర్

న్యూవెంకటేశ్వరనగర్‌లో..

తిరుమల ఘటనలో దోషులను గుర్తించి శిక్షించాలి

భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తితిదే బోర్డు మాజీ సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి స్పందించారు. బుధవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. లడ్డూ ప్రసాదం కల్తీపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిట్ వేయడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. తానూ గతంలో బోర్డు సభ్యుడు ఉన్నానని, అప్పట్లో ఏది కొనుగోలు చేయాలన్నా బోర్డు అనుమతి తీసుకునేవారని గుర్తు చేశారు. నెయ్యి కొనుగోలు చేయాలనుకున్నప్పుడు బోర్డు అనుమతి తీసుకున్నారా? తీర్మానం ఆమోదిం పొందిందా? నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించారా? అనేది కేసు దర్యాప్తులో పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు నర్సింగరావు ముదిరాజ్, పి.ప్రసాద్, కె.శ్రీధర్, నవీన్, నర్సింగ్‌గౌడ్, మల్లేశ్ తదితరులున్నారు.

వయోవృద్ధులకు భరోసా కల్పిద్దాం..



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఇతరులు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వచ్చే నెల 1న నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వారోత్సవాలను జరిపి వారికి భరోసా కల్పిద్దామని జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో విద్య, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ, పౌర సరఫరాలు, మహిళా శిశు సంక్షేమ, వయోవృద్ధులు, వృద్ధాశ్రమాల నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26వ వృద్ధాశ్రమాల్లోని వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాక్‌థాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ-సంక్షేమ చట్టం-2007పై అవగాహన సదస్సు, 29న గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు చట్టం టోల్ ఫ్రీ నంబర్- 14567పై అవగాహన సదస్సులు, 30న అంగన్‌వాడీ కేంద్రాలు-పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వేడుకలతో కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వయోవృద్ధుల కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, డీఈవో విజయకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఐక్యతకు సమావేశం నేడు

నారాయణగూడ: బీసీల హక్కుల సాధన, అన్ని బీసీ కుల సంఘాల్లో ఐక్యత తీసుకురావడానికి ఈనెల 26న అఖిల పక్ష పార్టీలు, కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బోల్ల శివశంకర్ తెలిపారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. బుధవారం పద్మశాలి భవన్‌లో ఆయన మాట్లాడుతూ. బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీల పట్ల కంటితుడుపు చర్యగా ఏదో ఇస్తున్నట్లు మాయ చేస్తోందనే అనుమానం కలుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి తీర్మానాన్ని మరిచిపోయిందన్నారు. సమావేశంలో అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, ప్రధాన

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన సభ రేపు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన సభను 27న నిర్వహించనున్నట్లు ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

జీహెచ్‌ఎంసీ సిబ్బందితో గొడవ..ముగ్గురికి జైలు

గౌతంనగర్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న జీహెచ్‌ఎంసీ సిబ్బందితో గొడవ పడిన ముగ్గురు యువకులకు మూడు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. సీఐ సందీప్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం. . వినాయకనగర్‌లో నివసించే శ్రీకాంత్(29), లింగస్వామి(28), ప్రశాంత్(27)లు మద్యం తాగి జీహెచ్‌ఎంసీ సిబ్బందితో గొడవ పడ్డారు. వెంటనే సిబ్బంది డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యువకులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. మల్కాజిగిరి అయిదో ప్రత్యేక మెట్రోపాలిటిన్ కోర్టు న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2,720 జరిమానా విధించారు.

ఫార్మా రంగంలో రాష్ట్రం అగ్రస్థానం: మంత్రి



రక్తదాతను అభినందిస్తున్న దామోదర రాజనర్సింహ

బంజారాహిల్స్, ఫార్మా రంగం రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్స్ (ఏపీఐ) ఉత్పత్తిలో, పెద్దసంఖ్యలో రిటైల్ ఫార్మసీలు ఉన్న రాష్ట్రం తెలంగాణ అని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రస్తుతం ఫార్మసిస్టులకు ఎంతో డిమాండ్ ఉందని, ఆరోగ్య సంరక్షణలో వారి పాత్ర కీలకం అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్‌ఉలూమ్ ఫార్మసీ కళాశాల, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బుధవారం కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఫార్మసీ సీట్లను పెంచి ఈ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ అజయ్ మిశ్రా రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు.

ప్రమాద బీమాతో మేలు



చెక్కు అందజేస్తున్న రీజనల్ మేనేజర్ రవికిరణ్

గౌతంనగర్, న్యూస్‌టుడే: వృత్తి ఒత్తిళ్లతో సతమతమవుతున్న ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యం కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఎస్బీఐ రీజనల్ మేనేజర్ రవికిరణ్ అన్నారు. వెస్ట్‌మల్కాజిగిరి శాఖలోని ఓ ఖాతాదారుడికి ప్రమాద బీమా కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కును ఆయన బుధవారం అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ నగేష్, బ్రాంచి మేనేజర్ సాయిలత, ఏవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార నిలయాలు.. అంగన్‌వాడీ కేంద్రాలు

- పోషణ్‌ట్రాక్ యాప్‌లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారం



గౌతంనగర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలు అనగానే అరకొర సౌకర్యాలు, అద్దె భవనాలే గుర్తొస్తాయి. కానీ ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. బాలలు, బాలింతలు, గర్భిణుల్లో పోషక లోపాలను గుర్తించడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ సెప్టెంబరులో నిర్వహిస్తోన్న పోషణ మాసం కార్యక్రమాన్ని నియోజకవర్గంలో పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

అయిదు థీమ్‌లుగా విభజించి...

అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మెరుగైన సేవలందుతున్నాయో లేదో పరిశీలించడంతో పాటు కేంద్రాలను గాడిలో పెట్టడానికి పర్యవేక్షకుల పాత్ర కీలకం. అందులో భాగంగా పోషక మాసాన్ని అయిదు థీమ్‌లుగా విభజించారు. వాటిలో మొదటి వారం రక్త హీనత, పరీక్ష, చికిత్స, రెండో వారం గ్రోత్ మానటరింగ్, మూడో వారం కాంప్లిమెంటరీ ఫీడింగ్, నాలుగో వారం పోషణ్ బీ పాడాయి బీ, అయిదో వారం పర్యావరణ పరిరక్షణ, మాస్ సెన్సిటైజేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. కేంద్రాలకు వచ్చే వారి ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోషణ్‌ట్రాక్ యాప్‌లో పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో పిల్లల ఎదుగుదల విషయంలో పోషణ లోపం ఉన్న వారిని గుర్తించడంతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. చిన్నారుల మానసిక ఎదుగుదలకు బాలామృతాన్ని అందిస్తున్నారు. అది ఎదిగే పిల్లలకు సమర్థవంతమైన అనుబంధ పోషణ ఆహారంగా ఉపయోగపడటంతో పాటు విటమిన్లు, ఖనిజాలు కలిగి పోషకాహారలోపాన్ని తగ్గిస్తోంది.

	మల్కాజిగిరి పరిధిలో	అల్వాల్‌లో
• అంగన్‌వాడీ కేంద్రాలు	– 43	34
• గర్భిణులు	– 647	319
• బాలింతలు	– 437	235
• ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు	– 3,812	2,692
• మూడు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు	– 972	851

ఉత్తమ సేవలందించేందుకు సర్వే

– స్వాతి, సీడీపీవో

చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు కావాల్సిన అనేక పోషకాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నాం. పోషణ్ ట్రాకర్ ద్వారా కేంద్రాల్లోని సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం. ఉత్తమ సేవలు అందించేందుకు కుటుంబ సర్వే చేపడుతున్నాం.

నిందితుడి కోసం గాలింపు

అల్వాల్, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న నిందితుడి కోసం అల్వాల్ పోలీసులు గాలిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి బహిరంగ మూత్రవిసర్జన చేసిన వివాదంలో ముగ్గురు యువకులు నాగిరెడ్డికాలనీ సంఘ నేతలపై కర్రలతో దాడి చేసిన విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి నరేశ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్‌లను అరెస్టు చేశారు. మహేశ్ పరారీలో ఉన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన అజయ్ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో వ్యక్తి మోహన్‌రెడ్డి డిశ్చార్జి అయ్యారు. అజయ్ పరిస్థితి కుదుటపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

శునకాల పట్టివేత

గౌతనగర్, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం సిబ్బంది బుధవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో వీధి కుక్కలను పట్టుకుని శస్త్ర చికిత్సలు చేసేందుకు తరలించారు. 16 మంది సిబ్బంది, మూడు ప్రత్యేక వాహనాల్లో వచ్చి ఆర్టీసీ కాలనీ, దివాకర్‌నగర్, మల్కాజిగిరి ఠాణా వీధి, మిర్జాలగూడ, ఎంజేకాలనీ, గాయిత్రీనగర్, భరత్‌నగర్, మౌలాలిగుట్ట, మారుతీనగర్‌లలో శునకాలను పట్టుకున్నారు. వీధి కుక్కల విషయంలో ఎటువంటి సమస్యలున్నా తెలియజేయాలని ఉపకమిషనర్ రాజు తెలిపారు.

అక్కినేని.. వ్యక్తిత్వ వికాసానికి ప్రతీక


సినీ నటుడు జెన్నీకి జ్ఞాపిక అందజేస్తున్న విజయబాబు, రామకృష్ణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: అక్కినేని నాగేశ్వరరావు బహుముఖ ప్రతిభాశాలి అని ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. బుధవారం రాత్రి సాహితీ సాంస్కృతిక 'సేవా సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో.. కళాలలిత కూడలిలో నిర్వహించిన నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అక్కినేని వ్యక్తిత్వ వికాసానికి ప్రతీక అని కొనియాడారు. ఈ సందర్భంగా సినీ, టీవీ నటుడు జెన్నీకి ఆత్మీయసత్కారం చేశారు. తొలుత 'మా హృదయము కోవెలలో ఏఎన్నార్ శీర్షికతో నిర్వహించిన సినీగీత విభావరిలో గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను ఆలపించారు. ప్రముఖులు సి.రామకృష్ణ, వి.శైలజ, ఎంవీ రమణకుమారి, ఎంవీ సుబ్బలక్ష్మి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

ముంపు ప్రాంతాల్లోని ఇళ్ల పరిశీలన

అంబర్‌పేట, న్యూస్‌టుడే: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పటేల్‌నగర్ బస్తీలోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో అక్కడి ప్రజలు తమ ఇబ్బందులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. వారి సూచన మేరకు బుధవారం బల్దియా అధికార ప్రతినిధి మహేశ్‌ముదిరాజ్, జల మండలి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, దుర్గ, నర సింహా, రాజేష్‌లు వరద ప్రభావిత బస్తీలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. నేతలు ఉదయ్, కిరణ్‌గౌడ్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.


పటేల్‌నగర్ పర్యటిస్తున్న మున్సిపల్, జలమండలి సిబ్బంది

ఏఎన్నార్ చిత్రగీతావళి 28న

గాంధీనగర్: సిల్వెల్ కార్పొరేషన్, త్రివేణు ఆర్ట్స్, ఆర్ ఆర్ ఫౌండేషన్, ఆదర్శ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు(ఏఎన్నార్) శతజయంతి సందర్భంగా 'ఆకాశవీధిలో అందాల జాబిలి' శీర్షికతో అక్కినేని చిత్రగీతావళి కార్యక్రమాన్ని జరుపుతున్నామని నిర్వాహకులు బండారు సుబ్బారావు, పన్నాల బాల్‌రెడ్డి, బీరెడ్డిలు తెలిపారు. బుధవారం వివేకనగర్‌లో వారు మాట్లాడుతూ.. త్యాగరాయగాన సభలో ఈ నెల 28న ఉదయం 11.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పలువురు గాయనీగాయకులు నిర్విరామంగా గానం చేస్తారన్నారు.

ఇళ్ల కేటాయింపు నిర్ణయం అభినందనీయం

గోల్నాక, న్యూస్‌టుడే: మూసీ నది బఫర్ జోన్‌లో నివసిస్తున్న కుటుంబాలకు సుమారు 15 వేల రెండు పడకగదుల ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం అభినందనీయమని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య అన్నారు. బుధవారం శంకర్‌నగర్‌లోని కార్యాలయంలో.. భారాస డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతాల పరిధిలో నివసించే అర్హులైన పేదల వివరాల సేకరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. మూసీ పరివాహక బాధితులతో కలిసి తాము చేపట్టిన ఆందోళనకు ప్రభుత్వం స్పందించిందని, ఇప్పటికైనా వారందరికీ న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ హితం.. పారిశుద్ధ్యమే లక్ష్యం

స్వచ్ఛతాహీ సేవపై రైలు ప్రయాణికులకు అవగాహన


అవగాహనా ర్యాలీలో విద్యార్థులు, అధికారులు

కాచిగూడ, న్యూస్‌టుడే: పర్యావరణ హితానికిదోహద పారిశుద్ధ్యమే లక్ష్యంగా కాచిగూడ స్టేషన్‌లో రైలు ప్రయాణికులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతికి ముందు.. ఏటా పక్షం రోజుల పాటు దక్షిణమధ్య రైల్వే హైదరాబాద్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతాహీ సేవ' ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో ప్రయాణికులతోపాటు పాఠశాలల విద్యార్థులనూ భాగస్వాములను చేస్తున్నారు. ప్రస్తుతం రైల్వే ఉన్నతాధికారులు, ఆయా విభాగాల సిబ్బంది ప్రతిరోజూ కార్యక్రమానికి హాజరవుతున్నారు. స్టేషన్‌తో పాటు రైళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరుతున్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం

◆ స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు 'అమ్మ పేరుతో ఒక మొక్క'ను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సంబంధిత అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిలోభాగంగా కాచిగూడ స్టేషన్ పరిసరాల్లో ఇప్పటికే మొక్కలు నాటారు. ◆ స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై 'పేరుకుపోయిన రైళ్లలోని వ్యర్థాలను సేకరించాక రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చి గార్డెనింగ్‌లో మొక్కలకు వేస్తున్నారు. ◆ రైళ్లలో చెత్త, వ్యర్థాలు, తినుబండారాలను పారవేయకుండా పరిశుభ్రతకు సహకరించాలని ప్రయాణికులను కోరుతున్నారు. ◆ పారిశుద్ధ్యంపై అవగాహనకు రైల్వే క్వార్టర్స్, పరిసరాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నారు. ◆ పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించనున్నారు. ◆ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచిస్తున్నారు. ◆ 'స్వచ్ఛ భారత్'పై అవగాహనకు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, నృత్యాలను ప్రదర్శించనున్నారు. ◆ రైల్వే స్టేషన్ పరిశుభ్రతలో యువతను భాగస్వాములను చేయనున్నారు. ◆ స్టేషన్ ప్రాంగణంలోని రెస్టారెంట్లు, హోటళ్లు, క్యాంటీన్లు, ఫుడ్‌స్టాల్ సహా పాంట్రీ కార్ పరిశుభ్రంగా ఉండేలా చూస్తారు. ◆ రైల్వే భవనాలు, కార్యాలయాలు, కాలనీల్లో అధికారులు, సిబ్బంది.. తమ కుటుంబీకులతో కలిసి సామూహిక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతారు.



2న 'స్వచ్ఛ భారత్' వేడుకలు

అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున స్వచ్ఛ భారత్ వేడుకలను నిర్వహిస్తారు. ఆ రోజున రైల్వే అధికారులు, సిబ్బంది కలిసి సామూహిక శ్రమదానం చేసి 'పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగిస్తారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్వహిస్తారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, నల్లకుంట, న్యూస్‌టుడే:

? ఆర్టీసీ కళాభవన్ ఎదుట ఉన్న బిస్కట్ ఫ్యాక్టరీ, విజయ ఆయిల్ గోదాం ప్రధాన రోడ్డులో వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో అవస్థలు పడుతున్నాం.
–ఎం.సమత, ప్రైవేటు ఉద్యోగిని, బాగ్‌లింగంపల్లి

✓ వ్యర్థాలను సత్వరమే తొలగించేలా చర్యలు చేపడతాం.
– ప్రవీణ, ఏంఎంహెచ్‌వో, బల్దియా

? గాంధీనగర్ జనప్రియ అపార్ట్‌మెంట్ ఉత్తరభాగం నీలిమ ఐ కాన్ సమీపంలోని వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రిళ్లు చీకటి కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
–వెంకట్‌రావు, గాంధీనగర్

✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.
–అనూష, జీహెచ్‌ఎంసీ వీధిదీపాల నిర్వహణ విభాగం ఏఈ

? ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పాత రామాలయం సమీపంలో రోడ్డుపై కంకర కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. –ప్రశాంత్, పాతనల్లకుంట

✓ సమస్యను పరిశీలించాక మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తాను.
– నరేందర్, పర్యవేక్షకుడు, జీహెచ్‌ఎంసీ

లెదర్ టెక్నాలజీ హబ్ ఏర్పాటుకు డిమాండ్


మాట్లాడుతున్న రాజేందర్ చిత్రంలో శ్రీనివాస్, రవీందర్ తదితరులు

రాంనగర్, న్యూస్‌టుడే: పదేళ్ల భారాస సర్కార్ పాలనలో.. లిడ్‌క్యాప్(లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కార్పొరేషన్)ను పూర్తిగా విస్మరించడంతోపాటు కేటాయించిన నిధులనూ దారి మళ్లించారని తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘాల ఐకాస ఛైర్మన్ ఆరెపల్లి రాజేందర్ ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో లిడ్‌క్యాప్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక అవి నిరాదరణకు గురయ్యాయన్నారు. బుధవారం ఇందిరాపార్కులో ఐకాస కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని సర్కార్ తక్షణం స్పందించి లెదర్ టెక్నాలజీ హబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. లిడ్‌క్యాప్‌కు పాలక మండలి ఏర్పాటుపైనా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 మినీ లెదర్ పార్కులకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి.. వాటిని మరింతగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఐకాస నాయకులు రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

షిల్లాంగ్‌లో అధ్యయనానికి అంబర్‌పేట కార్పొరేటర్



అంబర్‌పేట, న్యూస్‌టుడే: మేఘాలయ రాజధాని షిల్లాంగ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల అధ్యయనానికి అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ వెళ్లారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత నేతృత్వంలో 67 మంది కార్పొరేటర్ల బృందం షిల్లాంగ్‌కు బయలుదేరి వెళ్లింది. వారితోపాటు వెళ్లిన విజయ్‌కుమార్‌గౌడ్.. స్థానికంగా అమలు చేస్తున్న పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

ఫార్మా రంగంలో రాష్ట్రం అగ్రస్థానం: మంత్రి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఫార్మా రంగంలో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్స్ (ఏపీఐ) ఉత్పత్తిలో, పెద్దసంఖ్యలో రిటైల్ ఫార్మసీలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రస్తుతం ఫార్మసిస్టులకు ఎంతో డిమాండ్ ఉందని, ఆరోగ్య సంరక్షణలో వారి పాత్ర కీలకం అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్‌ఉలూమ్ ఫార్మసీ కళాశాల (ఎస్‌యూపీసీ), రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బుధవారం కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఫార్మసీ సీట్లను పెంచి ఈ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఛైర్మన్ అజయ్ మిశ్రా రక్తదానం ప్రాముఖ్యం వివరించారు. ఎస్‌యూఈఎస్ గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్, ఎస్‌యూపీసీ ప్రిన్సిపల్ డా.కోనేరు అనుపమ, ఎస్‌యూఈఎస్ ఛైర్మన్ మహ్మద్ వలీయుల్లా, కోశాధికారి డా.మీర్ అక్బర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మంచిని ప్రోత్సహించేలా సినిమాలుండాలి


రూపకు అవార్డు అందజేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి. చిత్రంలో రేలంగి నరసింహారావు తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: సమాజంలోని అన్నివర్గాల ప్రజలపైనా సినిమాల ప్రభావం తప్పకుండా ఉంటుందని.. ఈ నేపథ్యంలో మంచిని ప్రోత్సహించేలా వాటిని తీయాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. త్యాగరాయ గానసభలో నిర్వహించిన ఆరాధన 30వ టీవీ పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మనిషి నిజజీవితంలో ఎన్నో పాత్రలను పోషిస్తుంటారన్నారు. అయితే, నటన మాత్రం శ్రమతో కూడుకున్నదని చెప్పారు. సినీదర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ.. పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలతో పాటు టీవీ రంగంలో ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. ఉత్తమ సీరియల్‌గా 'ఈటీవీ'లో ప్రసారమయ్యే 'మనసంతా నువ్వే'కు సంబంధించి నిర్మాత ఎం.రాధాకృష్ణ, ఉత్తమ నటిగా నయన(పెళ్లి పుస్తకం), ఉత్తమ హాస్యనటుడిగా గడ్డం నవీన్(జబర్దస్త్), ఉత్తమ విలన్‌గా రూప(మౌనపోరాటం)లతో పలువురు సంబంధిత పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖులు చిల్లా రాజశేఖరరెడ్డి, జి.హనుమంతరావు, ఉమర్‌ఖాన్, యుగంధర్‌రెడ్డి, లోకం కృష్ణయ్య, లంకా లక్ష్మీనారాయణ, దైవజ్ఞశర్మ, నిర్మలాప్రభాకర్, రేణుకాప్రభాకర్, మోహన్ కృష్ణ, గిరిరాజు, శంకర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం పెంపుదలకు క్రీడలు దోహదం


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న విజయలక్ష్మి

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని హిమాయత్‌నగర్ మండల ఉపవిద్యాశాఖాధికారి విజయలక్ష్మి కోరారు. మానసికోల్లాసం కలిగించడంతో పాటు ఆత్మస్థైర్యం పెంచేందుకు సైతం క్రీడలు దోహదం చేస్తాయన్నారు. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో.. మండల జోనల్‌స్థాయి పాఠశాలల కబడ్డీ, ఖో-ఖో టోర్నమెంట్‌ను కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ముఖ్య అతిథిగా ఆమె ప్రారంభించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాచిగూడ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ చిరంజీవి, మండల పర్యవేక్షణాధికారులు సుమన్ నాయక్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు


'లడ్డూ కల్తీ ఘటనలో దోషులను గుర్తించి శిక్షించాలి'

హిమాయత్‌నగర్: తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తితిదే బోర్డు మాజీ సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి స్పందించారు. బుధవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. లడ్డూ ప్రసాదం కల్తీపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సిట్ వేయడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. తానూ గతంలో బోర్డు సభ్యుడు ఉన్నానని, అప్పట్లో ఏది కొనుగోలు చేయాలన్నా బోర్డు అనుమతి తీసుకునేవారని గుర్తు చేశారు.

గోల్నాక మార్కెట్‌లో కూరగాయల ధరలు


తిలక్‌నగర్: **(బుధవారం నాటివి.. కిలోకు రూపాయల్లో)** టమాట-50, ఆలుగడ్డ-50, వంకాయ-50, బెండ-55, దొండ-55, దోసకాయ-40, కాకర-60, బీర-70, సొర-35, క్యాబేజి-45, క్యాప్సికం-60, బీన్స్-80, చిక్కుడు-70, క్యారెట్-50, బీట్‌రూట్-45, ఉల్లిగడ్డ-65, పచ్చిమిర్చి-45, వెల్లుల్లి-320, అల్లం-80.

చుట్టలుగా తీగలు.. స్థానికులకు తిప్పలు


అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ మార్గంలో..


గోల్నాక జైస్వాల్ గార్డెన్ దారిలో..


నల్లకుంట వద్ద


బర్కత్‌పురకు వెళ్లే రహదారి చెంత

అంబర్‌పేటలోని పలుప్రాంతాల్లో ఉన్న కరెంటు స్తంభాలకు కేబుళ్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వాటిల్లో ఇంటర్నెట్, టీవీ ప్రసారాల తీగలు ఉన్నాయి. వాటిని ఎక్కడికక్కడ చుట్టిపెట్టడంతో.. అవి చెల్లాచెదురై కరెంటు తీగలతో కలిసి అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. ఈదురుగాలుల వేళ తరచూ తెగిపడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిమజ్జనాన్ని చూసేందుకు వెళ్లి అదృశ్యం

అంబర్‌పేట, న్యూస్‌టుడే: వినాయక ప్రతిమల నిమజ్జనం ప్రక్రియను తిలకించేందుకు వెళ్లిన యువకుడు కనిపించకుండాపోయిన సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్సై మౌనికలు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి బస్తీకి చెందిన వెంకటేష్ కుమారుడు తాళ్ల మనోజ్(18) ఈ నెల 15న గణేష్ నిమజ్జనాన్ని చూసేందుకు స్నేహితులతో కలిసి ట్యాంక్‌బండ్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి అతడు కనిపించకుండా పోయాడు. స్నేహితులను అడిగితే టిఫిన్ చేయడానికి వెళ్లి.. ఎంతసేపటికీ తిరిగిరాలేదని చెబుతున్నారు. బుధవారం బాధితుడి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రయాణికురాలి చరవాణి, నగదు బ్యాగు చోరీ

కాచిగూడ, న్యూస్‌టుడే: ప్రయాణికురాలి సెల్‌ఫోన్‌తోపాటు చేతి బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జాల్గావ్ ప్రాంతానికి చెందిన రేఖాప్రభాకర్ మంగళవారం ఓఖా-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి బయలుదేరింది. రైలు పూర్ణ స్టేషన్ వద్ద ఉండగా.. సెల్‌ఫోన్, రూ. 8 వేల నగదుతో కూడిన చేతిబ్యాగు చోరీకి గురైంది. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

వ్యభిచార ముఠా గుట్టురట్టు.. పోలీసుల అదుపులో నలుగురు

కాచిగూడ, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును కాచిగూడ పోలీసులు రట్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా శ్రీనివాసులు(60) అనే వ్యక్తి ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి కుత్బిగూడలోని ఒక ఇంట్లో వ్యభిచారాన్ని నిర్వహిస్తున్నాడు. అతడికి యువతులను రఫీక్ ఉల్‌ముల్లా(31) సరఫరా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం సంబంధిత నివాసంపై దాడి జరిపి యువతి(19), విటుడు సంతోష్ మిశ్రా(32)తో పాటు శ్రీనివాసులు, రఫీక్ ఉల్‌ముల్లాను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి నుంచి రూ. 6700 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

జూదరుల అరెస్టు

రాంనగర్: జూదం ఆడుతున్న 17 మందిని ముషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌లోని సహారా ఫంక్షన్‌హాల్‌లో కొందరు జూదం ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు మధ్యమండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేశారు. అనంతరం ఇందిరానగర్‌కు చెందిన నిర్వాహకుడు జావిద్ అలీ మీర్జా(40) సహా 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 70,470 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై తెలిపారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం స్ఫూర్తిదాయకం




చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ లక్ష్మణ్ ★ పటేల్‌నగర్ చౌరస్తాలో ఆనంద్‌గౌడ్, నాగభూషణం, నేతలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జన్‌సంఘ్ మాజీ అధ్యక్షుడు, భాజపా సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తన జీవితాన్ని దేశం కోసం త్యాగం చేసిన మహనీయుడని రాజ్యసభ సభ్యుడు, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై.. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం డివిజన్‌లోని బూత్ నెం. 127లో సభ్యత్వ నమోదు చేపట్టారు. నేతలు రమేష్ రామ్, పూస రాజు, శ్రీకాంత్, శివకుమార్, అరుణ్‌కుమార్, ఆనంద్‌రావు, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: దీన్‌దయాళ్ జయంతి కార్యక్రమాన్ని పటేల్‌నగర్ చౌరస్తాలో భాజపా అంబర్‌పేట అధ్యక్షుడు నాగభూషణంచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ నివాళులర్పించారు. నేతలు భిక్షపతి, యశ్వంత్, కృష్ణ ముదిరాజ్, మైలారం రాజు, దయాకర్‌యాదవ్, రాంచందర్‌గుప్త, భాస్కర్‌గౌడ్, ఈశ్వర్, పెంటం రాజు, అయోధ్యరాములు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఐక్యతకు సమావేశం నేడు

నారాయణగూడ: బీసీల హక్కుల సాధన, అన్ని బీసీ కుల సంఘాల్లో ఐక్యత తీసుకురావడానికి ఈనెల 26న అఖిల పక్ష పార్టీలు, కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బోల్ల శివశంకర్ తెలిపారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. బుధవారం పద్మశాలి భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీల పట్ల కంటితుడుపు చర్యగా ఏదో ఇస్తున్నట్లు మాయ చేస్తోందనే అనుమానం కలుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి తీర్మానాన్ని మరిచిపోయిందన్నారు. సమావేశంలో అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణ

రాంనగర్, న్యూస్‌టుడే: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో దోమలగూడలోని గగన్‌మహల్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రథమ చికిత్స విధానాలతోపాటు మ్యాపింగ్, మార్చ్‌పాస్ట్, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, జాతీయ పతాకాన్ని ఎగురవేసే పద్ధతి, నైతిక విలువలు పెంపొందించుకోవడం.. తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎర్రోల్ల లింగం, పరమేశ్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాన తగ్గినా.. వరదతో హైరానా



కాచిగూడ బస్ డిపో మార్గంలో వాహనదారుల పాట్లు


నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చెంత బస్టాప్‌లో..

అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం స్థానికంగా పలు ప్రాంతాల్లో రహదారులపై వరదనీరు నిలవడంతో రాకపోకల సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల బస్టాప్‌ల్లోనూ వరద నిలవడంతో.. బస్సుల కోసం వాటిల్లో నిరీక్షించే ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు.



రాంనగర్, న్యూస్‌టుడే: ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఇందిరాపార్కులో బురదతో వాకర్స్ ఇబ్బందులు పడ్డారు. భారీవర్షాలకు వరదనీరు నిలిచిపోయి పలుచోట్ల నడకదారి కూడా గుంతలుగా మారిందని.. మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఇందిరాపార్కు వాకర్స్ పరిరక్షణ సమితి సభ్యులు కోరారు.



నడిరోడ్డుపై ప్రమాదం.. చెట్టుకొమ్మతో అప్రమత్తం

న్యూ నల్లకుంట నుంచి నరసింహ బస్తీకి వెళ్లే మార్గం మధ్యలో గుంతపడడంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా రాకపోకలు సాగించేవారిని అప్రమత్తం చేసేలా.. గుంతలో చెట్టుకొమ్మను తాత్కాలిక సూచికగా స్థానికులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా వానలు పడుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణం స్పందించాలని స్థానికులతోపాటు వాహనదారులు కోరుతున్నారు.

ఉప్పల్

• ఉప్పల్ • మేడ్చల్

పాఠశాల అభివృద్ధికి చర్యలు



వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఈనాడు కథనానికి స్పందన

ఉప్పల్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్‌లోని చిలుకానగర్ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై **'ఈనాడు'**లో సోమవారం **'సార్లు లేరు..చదువు సాగేదెలా?'** అని ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. బుధవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు (డీఎస్ఈ) ఈవీ నర్సింహారెడ్డిని ఆయన కలిశారు. 560 మంది విద్యార్థులు చదువు కుంటున్న చిలుకానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అదనపు గదులు, వసతులు కల్పించాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. డీఎస్ఈ ఈవీ నర్సింహారెడ్డి స్పందిస్తూ పాఠశాలల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఖాళీలను భర్తీ చేయాలి



కార్యక్రమంలో ఈఎస్ఐ అధ్యక్షురాలు విక్టోరియా, ఉద్యోగులు

నాచారం, న్యూస్‌టుడే: నాచారంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం(టీజీఎంఈయూ) ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని జరిపారు. టీజీఎంఈయూ ఈఎస్ఐ అధ్యక్షురాలు విక్టోరియా, కార్యదర్శి వేణుకుమార్ మాట్లాడుతూ..ఈఎస్ఐలో ఖాళీగా ఉన్న ఫార్మాసిస్ట్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

సాంస్కృతిక పోటీలు 27న

మేడ్చల్ కలెక్టరేట్: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 27న మేడ్చల్ కలెక్టరేట్‌లో యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసులు-క్రీడల అధికారి జీవి.గోపాల్‌రావు పేర్కొన్నారు. జానపద నృత్యాలు, పాటలు, కవిత్వం, వ్యాచరచన, చిత్రలేఖనం తదితర పోటీలుంటాయన్నారు. ఉత్తములను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు 26 లోపే దరఖాస్తులు పంపించాలన్నారు.

చిగురిస్తున్న ఆశ

- మళ్లీ రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ
- పేదలకు లభించనున్న భరోసా



న్యూస్‌టుడే:ఉప్పల్,ఘట్‌కేసర్

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలనుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త రేషన్‌కార్డులను ఇవ్వడానికి సిద్ధమవుతోంది. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు జారీ చేయాలని, అక్టోబరు 2నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సీఎం సూచించారు.

ప్రజాపాలనలో.. ఐదేళ్ల క్రితం చాలా మంది దరఖాస్తు చేస్తున్నారు. వీటిల్లో కొన్ని తహసీల్దార్ లాగిన్లలో, మరికొన్ని డీఎస్‌వో లాగిన్లలో ఉన్నాయి.. తాజాగా ప్రజాపాలనలోనూ చాలా మంది రేషన్‌కార్డులకు వినతులు సమర్పించారు.

పథకాలకు దూరం..

వేలాది మంది కొత్త కార్డులు జారీ కాక, పాతవాటిలో మార్పులు, చేర్పులకు వీలుకాక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ దూరమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గతంలో చిన్నారుల పేర్ల నమోదుకు, నూతన కార్డులకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లభించలేదు. కొత్తగా వివాహం చేసుకున్నవారు. దశాబ్దకాలంగా జన్మించిన చిన్నారుల పేర్లు కార్డుల్లో చేర్చేందుకు అవకాశం లేకుండా పోయింది.

25 వేలకు పైగా పెండింగ్‌లోనే..

పౌర సరఫరాల శాఖ ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఉప్పల్, మల్కాజ్‌గిరితో పాటు ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ కొంత భాగం ఉంది. కొత్త కార్డుల విషయాన్ని పక్కన పెడితే ఉన్న కార్డులోనూ పేర్ల చేర్పులు, మార్పుల కోసం సర్కిల్ పరిధిలో 25వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవి కాకుండా ప్రజాపాలనలోనూ అత్యధికంగా వేలాది దరఖాస్తులు రేషన్ కార్డుల కోసమే వచ్చాయి. చివరకు వీటి గురించి కూడా కనీస చర్యలు కరవయ్యాయి.

గతంలో చేర్పుల, మార్పుల సమయంలో చాలా మంది లబ్ధిదారుల కార్డుల్లోని పేర్లు అకారణంగా తొలగించారు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అవకాశం ఇవ్వలేదు. అన్ని రకాలుగా అర్హత ఉన్నప్పటికీ ఆహార భద్రత కార్డులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు అర్హత పొందే అవకాశం లేకుండా పోతుంది.

ఇంకా ఆదేశాలు రాలేదు: బాలరాజు, ఏఎస్‌ఓ, ఉప్పల్ సర్కిల్

కొత్త రేషన్ కార్డుల మంజూరు, పాత కార్డుల్లో చేర్పులు, మార్పులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి సూచనలు రావడమే పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులందరికీ కార్డులు అందేలా చూస్తాం.

ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల వివరాలు

మండలం	దుకాణాలు	ఆహారభద్రత కార్డులు	అంత్యోదయ	అన్నపూర్ణ
ఘట్‌కేసర్	28	18276	5	1096
మేడిపల్లి	9	17769	2	416
మేడ్చల్	37	19222	77	2361
శామీర్‌పేట	24	14470	0	2199
కీసర	24	17818	0	1499
కాప్రా	16	13888	0	817
ఉప్పల్ సర్కిల్	240	178001	4	3284



వయోవృద్ధులకు భరోసా కల్పిద్దాం..!



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఇతరులు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వచ్చే నెల 1న నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వారోత్సవాలను జరిపి వారికి భరోసా కల్పిద్దామని జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో విద్య, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ, పౌర సరఫరాలు, మహిళా శిశు సంక్షేమ, వయో వృద్ధులు, వయోవృద్ధాశ్రమాల నిర్వాహకులు, వయో వృద్ధుల కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గోడ పత్రికను ఆవిష్కరించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26వ వృద్ధాశ్రమాల్లోని వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాక్‌థాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ-సంక్షేమ చట్టం-2007పై అవగాహన సదస్సు, 29న గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు చట్టం టోల్ ఫ్రీ నంబర్- 14567పై అవగాహన సదస్సులు, 30న అంగన్‌వాడీ కేంద్రాలు- పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంతో కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వయోవృద్ధుల కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, డీఇవో విజయకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

శునకానికి క్షవరం.. గాయపరిచారంటూ ఫిర్యాదు

ఆరోపణలు రుజువు చేయకపోవడంతో కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: రూ.1,20,000 చెల్లించి కొనుగోలు చేసిన శునకానికి గ్రూమింగ్ (క్షవరం) చేస్తూ గాయపరిచినందుకు పరిహారం చెల్లించాలంటూ దాఖలైన కేసును రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ కొట్టివేసింది. కాప్రాకు చెందిన అనన్య వైష్ణవి (న్యాయశాస్త్ర విద్యార్థి) దాఖలు చేసిన ఫిర్యాదును అధ్యక్షురాలు సీహెచ్.లతాకుమారి, సభ్యులు పారుపల్లి జవహర్‌బాబు, శ్యామలతో కూడిన బెంచ్ విచారించింది. దాఖలు చేయకపోవడం, ఆరోపణలు రుజువు చేసేలా సాక్ష్యాలు లేని కారణంగా ఫిర్యాదును కొట్టివేస్తూ బెంచ్ తీర్పు వెలువరించింది.

రక్షణ గోడకు భూమిపూజ

నాగారం, న్యూస్‌టుడే: పట్టణంలోని పుర వాహనాల రక్షణకు గోడ నిర్మాణం చేపట్టేందుకు బుధవారం పుర ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి భూమిపూజ చేశారు. ఈ నిర్మాణానికి రూ.20 లక్షలను వెచ్చిస్తున్నారు.

కాప్రా మండల విద్యాధికారిగా జి.బాబురెడ్డి

కాప్రా, న్యూస్‌టుడే: కాప్రా మండలం నూతన మండల విద్యాధికారిగా కుషాయిగూడ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.బాబురెడ్డి నియమితులయ్యారు. పీఆర్‌టీయూటీఎస్ కాప్రా మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం నేతలు, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

ప్రయాణ ప్రాంగణం ముందే మురుగు



మేడ్చల్, న్యూస్‌టుడే: మురుగు మేడ్చల్ ఆర్టీసీ డిపో, ప్రయాణ ప్రాంగణంలో నిలుస్తోంది. కొన్నాళ్లుగా ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రయాణికులు నిత్యం నరక యాతన పడుతున్నారు. దుర్వాసన, దోమలు, పందుల విహారంతో ఇబ్బంది పడుతున్నారు.

- 121 బస్సులు మేడ్చల్ నుంచి గ్రేటర్‌లోని ప్రధాన నగరాలతో పాటు, రామాయంపేట, హయత్ నగర్, సికింద్రాబాద్, బహదూర్‌పల్లి, పటాన్‌చెరువు, యాదగిరిగుట్ట ప్రాంతాలకు బస్సులు వెళ్తాయి.
- 26 గ్రామీణ ప్రాంతాలలో తిరుగుతాయి.
- రోజుకి 60-70వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు.

చిన్న పనులు చేయలేరా..!



బోగారం(కీసర), న్యూస్‌టుడే:

- రోడ్డు: బోగారం- కరీంగూడ
- పరిధి: రోడ్లు భవనాల శాఖ
- దూరం: 3 కి.మీ
- పరిస్థితి: బోగారం ప్రధాన చౌరస్తాతో పాటు కరీంగూడకు వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి వేళ గుంతలు కన్పించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా రాయిరావుపేట, జమిలాపేట, మాదాపురంతో పాటు బర్సిగూడ, బోగారం నుంచి రాంపల్లి, చర్లపల్లికి వెళ్లాలంటే ఇదే మార్గం. ● ఎంత ఖర్చవుతుంది: గుంతలను పూడ్చేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం లేదు. అక్కడక్కడ ఉన్న గుంతలతో పాటు మూల మలుపులో ఉన్న గుంతలను సిమెంట్ కాంక్రీటుతో పూడ్చితే సరిపోతుంది.

అర్హులైన వారికి ఇళ్లు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్: మానవతావాద సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని మైసమ్మగూడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాస్తంత నవ్వు..!



వేడుకలో విద్యార్థినులు

శామీర్‌పేట, న్యూస్‌టుడే: శామీర్‌పేట మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆహ్వాన వేడుక సందడిగా సాగింది. నూతన విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ఆట పాటలతో స్వాగతించారు. బుధవారం ఈ కళాశాలలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, మిస్ స్మైల్, మిస్ ట్రెడిషన్, మిస్ రన్నర్ వేషధారణ అలరించాయి.

రోడ్డు స్థలం కాపాడాలని వినతి

నాచారం: సావర్కర్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి ప్రహరీ పక్కనున్న రోడ్డు స్థలాన్ని కాపాడాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం నేతలు బుధవారం కాప్రా ఉపకమిషనర్ జగన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

కాప్రా, నాగారం, న్యూస్‌టుడే

? భారీ వర్షాలకు కాలనీలోని విద్యుత్తు స్తంభాలు ఒరిగి పోతున్నాయి.

– రాజేశ్వర్, సాకేత్ కాలనీ

✓ ఇప్పటికే రెండు స్థంభాలను రీలొకేట్ చేశాం. మిగతావాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – రవీంద్ర, డీఈ, జీహెచ్ఎంసీ

? హనుమాన్ గుడి వద్ద చెత్తకుప్పలు ఎత్తడం లేదు.

– రాజన్న, బీజేఆర్ కాలనీ, జమ్మిగడ్డ

✓ చెత్తను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – సుదర్శన్, శానిటరీ సూపర్‌వైజర్

? ప్రధాన రహదారిపై మంచినీటి పైపులైన్ పగిలి మంచినీరు వృథా అయ్యాయి. తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్‌గౌడ్, మల్లారెడ్డి, వంపుగూడ

✓ నీటి సరఫరాను నిలిపివేశాం. పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేపడతాం. – సతీష్, డీజీఎం, జలమండలి

? పట్టణంలోని సత్యనారాయణ కాలనీ రోడ్డు నంబర్ 1,2లో రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి .– శ్రావన్ కుమార్, సత్యనారాయణ కాలనీ, నాగారం


✓ రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వాటిని తొలగిస్తాం – రఘు, డీఈఈ, నాగారం

రుణమాఫీ చేయాలని ఆందోళన



ప్లకార్డు ప్రదర్శిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల రైతు సంఘం సర్వసభ్య సమావేశం గందరగోళంగా మారింది. బుధవారం పట్టణంలో ఛైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. మాజీ ఎంపీపీ వై.సుదర్శన్ రెడ్డి తదితరులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభా వేదిక ముందుకు వచ్చి రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. రుణమాఫీ పేరుతో రైతులను ముఖ్యమంత్రి మోసం చేశారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. రుణం తీసుకున్న రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామని కాంగ్రెస్ నాయకులు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మ



మాట్లాడుతున్న ఎంపీ ఈటల

ఏర్పాట్లలో అధికారులు

33 పంచాయతీల ఎన్నికలకు కసరత్తు

అంతటా సందిగ్ధం... ప్రస్తుతం మున్సిపాలిటీల్లో విలీనం కాకుండా మిగిలిన 33 గ్రామ పంచాయతీలు, 3 మండల, 3 జిల్లా పరిషత్తు వ్యవస్థలు కొనసాగించడం కష్టంగా మారనున్నందున వాటిని కూడా నగర పంచాయతీలుగా లేదంటే మున్సిపాలిటీలుగా చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు మరోవైపు ప్రచారం జరుగుతుంది. మూడుచింతలపల్లి మండలంలో ఉన్న 13 గ్రామపంచాయతీలను కలిపి మూడుచింతలపల్లి కేంద్రంగా ఒకటి, శామీర్‌పేట మండలంలో మిగిలిన ఏడు గ్రామ పంచాయతీలను కలిపి అలియాబాద్ కేంద్రంగా ఒకటి, మేడ్చల్ మండలంలోని 13 గ్రామ పంచాయతీలను కలిపి డబిల్‌పూర్, రావల్‌కోల్ కేంద్రాలుగా రెండు నగర పంచాయతీలు లేదా మున్సిపాలిటీలుగా చేయనున్నట్లు సమాచారం. అది ఎంత వరకు నిజమనేది సందిగ్ధత నెలకొంది.

కీసర, న్యూస్‌టుడే: పరిపాలన సౌలభ్యానికి రింగు రోడ్డు లోపల, బయట ఉన్న గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో పలు గ్రామ పంచాయతీలు కనుమరుగయ్యాయి. విలీనమైన గ్రామ పంచాయతీలు ఇప్పటికే మున్సిపల్ వార్డు కార్యాలయాలుగా మారాయి. నియోజకవర్గంలోని మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, మూడుచింతలపల్లి మండలాల్లో 61 గ్రామ పంచాయతీలు, 5 మండల, 5 జిల్లా పరిషత్తులు ఉండగా, అందులో 28 గ్రామ పంచాయతీలు సమీప మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. కీసర, ఘట్‌కేసర్ మండలాల్లో గ్రామ పంచాయతీలన్నీ మున్సిపాలిటీల్లో విలీనం కాగా. మేడ్చల్ మండలంలో 13, శామీర్‌పేట మండలంలో 7, మూడుచింతలపల్లిలో 13 గ్రామపంచాయతీలు మాత్రమే మిగిలాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మిగిలిన వాటిలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల వారిగా కొత్త ఓటర్ల జాబితా సిద్ధం చేసి, డేటా ఎంట్రీ చేసి డేటా అపరేటర్లకు సైతం శిక్షణ ఇచ్చారు. పాత రిజర్వేషన్ల ప్రకారం ఇప్పటికే కార్యదర్శులు వార్డు సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్లపై వివరాలు పంపించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై సంబంధిత అధికారులు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి వాటిని పరిష్కరించి వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను ఆయా గ్రామ పంచాయతీ, మండల పరిషత్తులలో ప్రచురించారు.



మూడుచింతలపల్లి పంచాయతీ కార్యాలయం

ఎన్నికల నిర్వహణకు చర్యలు

– వెంకయ్య, జిల్లా పంచాయతీ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 33 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఆయా గ్రామ పంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటర్ జాబితాను అందుబాటులో ఉంచాం. ఎవరి పేర్లు నమోదు కాకపోయిన, ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా సంబంధిత గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలి.

హైడ్రా అధికారుల పరిశీలన

పీర్జాదిగూడ (బోడుప్పల్),న్యూస్‌టుడే : పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని చెరువులు, కుంటల ప్రాంతాలను హైడ్రా అధికారులు పరిశీలించారు. బుధవారాల్లో హైడ్రా అధికారులు పీర్జాదిగూడ గూడెం చెరువు, పులిచెరువు కుంట ప్రాంతాలను తనిఖీ చేశారు. ఉదయమే చెరువు వద్దకు చేరుకున్న అధికారులు మ్యాప్‌లు, నక్షల ఆధారంగా ఆక్రమణలపై ఆరా తీశారు. గూడెం చెరువు 65 శాతం కబ్జాలతో నిండిపోయినట్లు నిర్ధారించారు. పులిచెరువు కుంట 90 శాతం కనుమరుగైనట్లు అంచనాకు వచ్చారు. ఒకటి,రెండు రోజుల్లో పీర్జాదిగూడలో కూల్చివేతలు ఉండే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత హైడ్రా అధికారులు చెబుతున్నారు.

సంక్షిప్త సమాచారం

భాజపా సభ్యత్వ నమోదు

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి బుధవారం భాజపా సభ్యత్వాన్ని ఇంటింటా చేపట్టారు.


స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొనాలి

పోచారం(ఘట్‌కేసర్): స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అయితేనే లక్ష్యం నెరవేరుతుందని పోచారం మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కమిషనర్ వీరారెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం పురపాలకలో విలీనమైన కొర్రెముల, చౌదరిగూడ, వెంకటాపూర్, జోడిమెట్లలో పర్యటించారు.


అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

నాచారం: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మల్లాపూర్‌లో ఉప్పల్ నియోజకవర్గ పాత్రికేయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలరాజుగౌడ్, వెంకట్రాంరెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ నిర్లక్ష్యం ఎవరిది..?



కీసర-బోగారం రోడ్డులో..



జీపీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద..



జాఫర్‌గూడలో..

రాంపల్లిదాయర,(కీసర), న్యూస్‌టుడే: కీసరలో పలు చోట్ల విద్యుత్తు స్తంభాలను చెట్ల తీగలు అల్లుకుపోయాయి. గాలి వీచినప్పుడు తీగలు ఒకదానికొకటి అల్లుకుపోయి కరెంట్ పోతోంది. వర్షాలు కురుస్తున్న సమయంలో తీగల నుంచి మంటలు వస్తున్నాయి.

- రాంపల్లిదాయర, జాఫర్‌గూడలో ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి.

అవీ..ఇవీ..అన్నీ

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. నగర మేయర్ అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ స్రవంతి, కమిషనర్ రామలింగం వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నాగారం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని దమ్మాయిగూడ ఛైర్మన్ వసుపతి ప్రణీత పేర్కొన్నారు. బుధవారం పుర పరిధి 1, 2, 3 వార్డుల పరిసరాల్లోని చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు నాను నాయక్, ఎన్.సుజాత పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఇరువురికి గాయాలు

కాప్రా: పెద్ద చర్లపల్లికి చెందిన హరీశ్(23) ప్రైవేటు ఉద్యోగి. బుధవారం సాయంత్రం స్నేహితునితో కలిసి చర్లపల్లి నుంచి నాచారం వైపు వెళ్తున్నాడు. అశోక్‌నగర్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. హరీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి.